ఆదివారం
ప్రజాశక్తి
21 అక్టోబర్, 2001

సంబరాల దసరా

27వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో

శ్రీ రాజ రాజేశ్వరి దేవస్థానము

దర్గామిట్ట, నెల్లూరు-4. ఫోన్: 322016

ప్రతి దినము సాయంత్రం పూలంగిసేవ
శ్రీ ముప్పరాజు సుబ్బారావు, శ్రీమతి బబిత, అమెరికా

మహాభిషేకము: ప్రతి సం. ఒక్కసారిమాత్రమే విజయదశమి పర్వదినమున ఉ.4 గం.లకు శ్రీ అమ్మవారికి మహాభిషేకము జరుపబడును. పై మహాభిషేకమునందు పాల్గొనదలచిన భక్తులు రూ. 116లు చెల్లించి పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి తరించ ప్రార్థన.

27.10.2001 తేదీ శనివారం మ.12.00గం.లకు అన్నదానము
శ్రీ నంబూరి బాలయ్యనాయుడు, శ్రీ నంబూరి మునిరత్నంనాయుడుగార్లు, జేమ్స్‌గార్డెన్, నెల్లూరు.

శ్రీ అమ్మవారికి మొక్కుబడులుగా వచ్చిన చీరలు, రవికలు 17.10.2001 తేదీనుండి 26.10.2001 తేదీవరకూ ప్రతిరోజు ఉ.9.00గం.లనుండి రాత్రి 9.00 గం.ల వరకు దేవస్థానమునందు బహిరంగ వేలములో విక్రయించబడును.

శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవ సమాహ్వానము

17.10.2001 తేదీనుండి 26.10.2001 తేదీవరకు

ఉత్సవ కార్యక్రమాలు

17.10.2001 తేదీ శుద్ధపాడ్యమి ఉ.గం. 6.40 నుండి 6.44ని.ల. లోగా కలశ స్థాపనము వ్యవస్థాపక ధర్మకర్తలవారి ఆధ్వర్యమున దేవస్థానమువారిచే జరుపబడును.

17.10.2001 బుధవారం శుద్ధపాడ్యమి చండీఅలంకారం ఉభయకర్తలు: శ్రీ ఆర్. వెంకటేశ్వరరావుగారు, శ్రీమతి శాంతమ్మగారు, నెల్లూరు,
18.10.2001 గురువారం శుద్ధవిదియ భవానీ అలంకారం ఉభయకర్తలు:శ్రీ మాగుంట సుధాకర్‌రెడ్డిగారు, శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డిగారు, శ్రీ మాగుంట విజయారెడ్డిగారు, నెల్లూరు,
19.10.2001 శుక్రవారం శుద్ధ తదియ గాయత్రి అలంకారం ఉభయకర్తలు:శ్రీ అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డిగారు, కోవూరు
20.10.2001 శనివారం శుద్ధచవితి అన్నపూర్ణ అలంకారం ఉభయకర్తలు:శ్రీమతి దేవిరెడ్డి శైలజమ్మగారు, మద్రాసు
21.10.2001 ఆదివారం శుద్ధ పంచమి గజలక్ష్మి అలంకారం ఉభయకర్తలు:శ్రీ పాట్టిపాటి ఓబుల్‌రెడ్డిగారు, ఛైర్మన్ మరియు ఎం.డి., విప్రో, నెల్లూరు.
22.10.2001 సోమవారం శుద్ధ షష్టి కాళికా అలంకారం ఉభయకర్తలు: శ్రీ చెన్నారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డిగారు, ఇండికేర్ మెడికల్స్, నెల్లూరు.
23.10.2001 మంగళవారం శుద్ధ సప్తమి (మూల నక్షత్రం) సర్వతీ అలంకారం ఉభయకర్తలు:శ్రీ బి. మధుసూదన్‌రెడ్డిగారు, శ్రీమతి బి. రజనిగారు, అమెరికా
24.10.2001 బుధవారం శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) దుర్గా అలంకారం ఉభయకర్తలు:శ్రీఆర్. వెంకట్రామానాయుడుగారు, శ్రీమతి సులోచనమ్మగారు, నెల్లూరు.
25.10.2001 గురువారం శుద్ధ నవమి (మహర్నవమి) మహిషాసుర మర్దని అలంకారము ఉ. 11.40నుండి 11.44 లోగా పూర్ణాహుతి రాత్రికి సువాసిని పూజ ఉభయకర్తలు:కీ॥ శే॥ ఆనం అమ్మణ్ణమ్మగారు జ్ఞాపకార్థం, గోపాలకృష్ణారెడ్డిగారు, నెల్లూరు. 26.10.2001 శుక్రవారం శుద్ధ దశమి (విజయదశమి) శ్రీ రాజరాజేశ్వరి అలంకారము శమీపూజ, పారువేట, నగరోత్సవం ఉభయకర్తలు:శ్రీ జక్కా కోదండరామిరెడ్డిగారు, శ్రీమతి సులోచనమ్మగారు,నెల్లూరు

సదా అమ్మవారిసేవలో- భవదీయులు

రత్నం సుందరరాజు ఎం.కాం.,
వ్యవస్థాపక ధర్మకర్త

వద్దినేని సాయిబాబా
కార్యనిర్వహణాధికారి.

With Best Compliments...



శ్రీ రామ బార్ అండ్ రెస్టారెంట్
రామేశ్వరం రోడ్డు, ప్రొద్దుటూరు

రాజసింహ బార్ అండ్ రెస్టారెంట్
శివాలయం వీధి, ప్రొద్దుటూరు

సాగర్ బార్ అండ్ రెస్టారెంట్
బి.జి.ఆర్. కాంప్లెక్స్, ప్రొద్దుటూరు

సూర్య బార్ అండ్ రెస్టారెంట్
గౌరమ్మకట్టవీధి, ప్రొద్దుటూరు

సిప్ ఇన్ బార్ అండ్ రెస్టారెంట్
రాజీవ్‌సర్కిల్, ప్రొద్దుటూరు

గ్రీన్‌పార్క్ బార్ అండ్ రెస్టారెంట్
ఎర్రగుంట్ల రోడ్డు, ప్రొద్దుటూరు. కడప జిల్లా

శుభాకాంక్షలతో...

నకరికల్లు మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్

నకరికల్లు, గుంటూరుజిల్లా.

పాలలో చిక్కదనం! రుచిలో కమ్మదనం!! అదే మోడల్ డెయిరీ గొప్పధనం!!

కొత్తనడక నేర్చిన పాల కడవలు...

నగర జీవితంలో పాలు రాకుండా, లేకుండా సూర్యుణ్ణి చూడటం కష్టమే! చీకటిలో.. చలిలో.. వానలో.. పాలకోసం క్యూలో నిలబడటం యిబ్బందే!! పాలు వస్తాయో-రావో! వచ్చినా - తమదాకా వస్తాయో రావోనన్న ఆందోళన నిండిన ముఖాలు ఏ పాలబూతులోనైనా మనకు నిత్యం కనిపించే దృశ్యాలు.

పాడి పరిశ్రమ రంగంలో **మోడల్ డెయిరీ** రావడంతో పరిస్థితి మారింది. కాలు కదపకుండా కాళ్ళదగ్గరికే పాలు తరలివచ్చే సౌకర్యాలు వచ్చాయి. పోటీ దృక్పథం.. పాలు నాణ్యత, తాజాదనం నిలవడానికి దోహదం చేసింది. పాలు వాడకందార్ల అవసరాలకు అనుగుణంగా అన్నిచోట్లా అన్నివేళలా **మోడల్ మిల్క్** దొరికే సదుపాయం. నాణ్యత చెడకుండా **'ఫ్రీజర్లు'** ఏర్పాటు, స్వీయ రవాణా వ్యవస్థద్వారా వినియోగదారుల వద్దకు తరలిన విక్రయ కేంద్రాలు, పచారీ వస్తువులా పాలు ప్రతిచోటా దొరకటం, డోర్ డెలివరీ విధానం, గ్రామీణ వాతావరణాన్ని తలపించే 'ముంత పెరుగు' సరఫరా, ఆదానిచ్చే డిస్కౌంట్ కార్డులాంటి ఎన్నో సౌకర్యాలు వాడకందార్లకు శుభపరిణామాలు కాగా...

పాల సేకరణదారులు, పాల ఉత్పత్తిదారులు **మోడల్ డెయిరీ** సహకారంతో తమ జీవనగతిని మెరుగుపరుచుకోవడం, కొత్త ఆశలతో కొత్తదారులవెంట భుజం కలిపి నడవడం, పాడి పశువులకు అవసరమయ్యే దాణా, మందులను స్వల్ప ధరలకే **మోడల్ డెయిరీ** సరఫరా చేయడం, గిట్టుబాటు ధరను ఇవ్వడమేగాక, సకాలములో వాళ్ళ ముంగిళ్ళనుంచి పాలు సేకరించడం, చిన్నచిన్న పల్లెలలో సైతం పాలు సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో **మోడల్ డెయిరీ** ఇటు ప్రజలకు, అటు పాల ఉత్పత్తిదారులకు మరింత చేరువై ప్రశంసాపర్వమైనది.

మోడల్ డెయిరీ ప్రోత్సాహంతో పల్లెసీమల నుంచి పాల కడవలు కొత్త నడకలు నేర్చాయి!

కొత్తదారుల వెంట పరుగులు తీస్తున్నాయి!! 'ఇది హర్షించదగిన పరిణామం' అంటున్నది.

- మీ మోడల్ డెయిరీ

TEST THE BEST

MODEL GHEE

MODEL

SYMBOL OF QUALITY

MODEL DAIRY PRIVATE LIMITED

Factory: Nidamanuru - 521 104, VIJAYAWADA-(A.P.)

Fact: Ph: 842396, 842777.

కుందేలు - తాబేలు

అనగనగా ఒక తాబేలు. తన పనేదో తాను చేసుకుపోయే మనస్తత్వంతో పాటు - తాపీగా నడిచే గుణంతో బతుకుతోంది. అనగనగా ఒక కుందేలు. గర్వమెక్కువ. కళ్లెప్పుడూ నెత్తిమీదే వుంటాయి. ఒక రోజున కుందేలు తాబేలింటికి వచ్చి - నాతో నువ్వు పరుగెత్తలేవు కదూ అని అడిగింది. దేవుడు నాకు పరుగు నేర్పలేదని తాబేలు నిజం చెప్పింది. గత జన్మలో నువ్వేదో పాపం చేసి వుంటావని కుందేలు చురక అంటించింది. తాబేలు ఆ చురకని పట్టించుకోలేదు. వేగంగా పరుగెత్తే గుణం ప్రసాదించకపోయినా - సుఖంగా బతికేందుకు అనువైన ఏర్పాట్లెన్నో దేవుడు నాకు చేసేడని ఆనందంగా చెప్పింది. ఆ సమాధానంతో కుందేలుకి వళ్లు మండిపోయింది. ఏ విధంగానైనా సరే తాబేలుని పరుగు పందెంలోకి దించి ఓడించి అవమానించాలని తీర్మానించుకుంది!

మనం పరుగు పందెం పెట్టుకుంటే ఎట్లా వుంటుందని కుందేలు తాబేలుని అడిగింది. ఆ పందెంలో నువ్వే గెలుస్తావని తాబేలు తొణక్కుండా చెప్పింది. నాకాలికి దెబ్బతగిల్తే ఎక్కడో చోట కూలపడతాను. అప్పుడు గెలుపు నీదే కావచ్చుగదాని కుందేలు తాబేలుకి ఆశకూడా పెట్టింది. ఆ మాటకి తాబేలు నొచ్చుకుంది. నన్ను గెలిపించాలనే సదుద్దేశం నీకున్నందుకు ఆనందంగా వున్నా - *పందెంలో నీకాలు దెబ్బతినాలని* కోరుకోవడం భావ్యం కాదని బాధపడుతూ చెప్పింది తాబేలు! దాంతో కుందేలుకి కోపం వచ్చింది. తాబేలు రోషం తెచ్చుకునేందుకు అవసరమైన కూతలు అనేకం కూసింది. నీకు దమ్ము లేదన్నది. దమ్ములేని వాళ్లే ఇలాంటి సుభాషితాలు పలుకుతారన్నది! ఈ వరిస్థితుల్లో ఏం మాటాడినా తప్పే అవుతుందనే ఉద్దేశంతో - తాబేలు నీ యిష్ట ప్రకారమే కానివ్వమని కుందేలుతో అయిష్టంగానే అన్నది. ఇప్పుడు నాకు నచ్చేవని కుందేలు కుట్రనవ్వొకటి నవ్వేసింది. రెండు ఫర్లాంగుల దూరంలో వున్న దిగుడు బావిని ఎవరు ముందు చేరుకుంటే - వాళ్లు గెలిచినట్టనే షరతుతో పరుగు పందెం ప్రారంభమైంది. కుందేలు చెంగు చెంగున దూకుతుంటే - తాబేలు తాపీగా పాకుతోంది. కొంతదూరం పరుగెత్తిన కుందేలు తాబేలు కోసం వెనక్కి తిరిగి చూసింది. కనుచూపు మేరలో తాబేలు కనిపించకపోవడంతో కుందేలు తనలో తానే గర్వంగా నవ్వుకుంది. తాను వున్న చోటుకి తాబేలు పాక్కుంటో రావడానికి చాలా టైం పడుతుంది గనక - ఈలోగా చిన్నకునుకు తీద్దామనుకుని కుందేలు ఒక చెట్టునీడని చేరుకుని కునుకు తీయడం ప్రారంభించింది!

ఆ చిన్న కునుకు నిద్రగా మారి గాఢనిద్రకు దారితీసింది. ఆ గాఢ నిద్రలో ఎంతటైం వృధా అయ్యిందోగాని - లేచి చూస్తే తాబేలు కనిపించలేదు. బహుశా యింకా వెనకపడే వుంటుందనే అభిప్రాయంతో - వళ్లు విరుచుకుని - ఎందుకైనా మంచిదని వేగంగా పరుగెత్తింది. దిగుడుబావి అల్లంత దూరంలో కనిపిస్తోంది! అక్కడ తాబేలు తాపీగా భోంచేస్తూ కనిపించే సరికి కుందేలు కుదేలైపోయింది. నేను ఓడిపోయినట్లేనా అని సిగ్గుపడుతూ అడిగింది. నిన్ను ఓడించింది నేను కాదని తాబేలు చెప్పింది. ఈ తిరకాసు మాట కుందేలుకి అర్థం కాలేదు. నీ అహంకారమే నిన్ను ఓడించిందని తాబేలు తన మాటకి తాత్పర్యం చెప్పింది!

ఈ కథని మనం మన నిత్యజీవితంలో అన్వయించుకునే అవసరం ఎంతైనా వుంది. కుందేలు స్వభావం మనక్కూడా తగులుకోవచ్చు. అహంకారమే మన అలంకారమైనప్పుడు కుందేలు మన గుండెల్లో కూచుంటుంది. ఫలితంగా అపజయాలే మన అనుభవాలవుతాయి. అహంకారమనే పదార్థం మన కళ్లను కప్పేస్తుంది. మన మెదడ్ని పాడు చేస్తుంది. ఎవరేం చెప్పినా ఆఫ్టరాలంటాం. సప్తసముద్రాలూ అవలీలగా దాటగల మనశక్తిని అహంకారం పాడుచేయడం మూలంగా - మురికి గుంటని దూకలేక ఆ రొంపిలో పడిపోతాం. మనక్కావల్సింది అహంకారం కాదు - ఆత్మవిశ్వాసం! ఒక్కో సందర్భంలో అదే ఇదనుకునే భ్రమలో పడచ్చు. తస్మాత్ జాగ్రత్త! ☆

లోపలి పేజీల్లో.....

సెరిబ్రల్ పాల్సీ గల పిల్లలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు... 6, 7

పెళ్ళి బేరాలు ... 15

విలక్షణ క్రికెటర్లకు 'నెలవు' హైదరాబాద్ ... 17



అతడనేక యుద్ధముల ఆరియు తేరిన వృద్ధమూర్తి ... 18, 19

ఇంకా...

బాలల వికాసం 10
బాల నేస్తాలు 12, 13
టూరిస్ట్ గైడ్ 16
కచేరి 20
కథ 22, 23
పలుకుబడి 24
వగైరా........

సంబరాల దసరా

ఏ పండుగైనా మంచికి ప్రతీకగా జరిగేదే. పంట ఇంటికొస్తే సంక్రాంతి అనీ, నరకాసురుడు చనిపోతే దీపావళి అని జరుపుకొన్నట్లుగానే మహిషాసురుని వధ జరిగిన రోజును దసరాగా జరుపుకుంటున్నాం. పేద-ధనిక, రైతు-కూలి, భూస్వామి-పాలేరు, యజమాని-కార్మికుడు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుతారీ దసరాను. అయితే ఎప్పటికప్పుడు పెరుగుతున్న ధరలతో సామాన్యులు ఇక్కట్లు పడుతుంటే కరువు పరిస్థితులు నెలకొని రైతాంగం ఈ ఏడాది దిగులుతో వుంది. కొందరు ఆకలి చావులకే గురికాగా, మరికొందరు ప్రకృతి వైపరీత్యాలకు బలయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో వారి జీవితాల్లో దసరా ఏ మాత్రం సరదా సంతరించుకుంటుందనేది ప్రశ్నార్థకమే!

ఎంతో సరదాగా గడిపే దసరా వెనక చారిత్రక నేపథ్యాలు అనేకం వున్నాయి. దేశ వ్యాప్తంగా ఆశ్వయుజ మాసంలో వచ్చే అతి ముఖ్యమైన పండగ ఇది. శుద్ధ పాడ్యమి నుండి శుద్ధ దశమి వరకు తొమ్మిది రోజులు (వీటినే నవరాత్రులు అంటారు) ఈ ఉత్సవాలు జరుగుతాయి. ప్రధానంగా మహిషాసురుడిని దుర్గాదేవి వధించిన రోజునే దసరా జరుగుతుందని చెబుతుంటారు. అసలు మహిషాసురుడు ఎవరు? అతన్ని చంపిన దుర్గ ఎవరు అనే ప్రశ్నలకు చారిత్రక కథనంలో జవాబు దొరుకుతుంది. పురాణంలో మహిషాసురుడు రాక్షసుడు. జంతువుల్లోని ఏ రూపం అంటే ఆ రూపంలోకి మారిపోగలవాడు. అలా మారిపోయి రైతుల పంటకు నష్టం కలిగిస్తుంటాడు. ఆ గ్రామంలో ఒక నాయకురాలు వుంటుంది. ఆమె వెళ్ళి జంతువు రూపంలో ఉన్న ఆ రాక్షసుణ్ణి చంపివేస్తుంది. తమ పంటకు ఎన్నాళ్ళ నుండో నష్టం చేస్తున్న జంతువును చంపిన ఆనందంలో జరిగే వేడుకే దసరాగా చెబుతారు. ఇంచుమించు ఇదే కథాంశంతో మరో కథ. మహిషాసురుడు అనే వ్యక్తి వంద సంవత్సరాలు పోరాడి దేవతలను స్వర్గం నుండి తరిమాడు. తరువాత ఇంద్రుని సింహాసనం అధిష్టించాడు. దేవతలంతా బ్రహ్మ నాయకత్వంలో విష్ణు, మహేశ్వరులను తరుణోపాయం చూపించమని ప్రార్థిస్తారు. అప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల నుండి వెలువడిన ఒక వింతకాంతే భూమిపై 'దుర్గామాత'గా జన్మిస్తుంది. దేవతలంతా ఆమెకు అనేక కానుకలు ఇస్తారు. ఆమెకు వాహనంగా సింహాన్ని కూడా వారే బహూకరిస్తారు. దుర్గ-మహిషాసురుడు యుద్ధంలో తలపడతారు. రాక్షసుడు అనేక రూపాలు ధరించి పోరాడినా చివరకు దుర్గ చేతిలో మరణిస్తాడు.

మరో కథ భారతంలో కనపడుతుంది. అజ్ఞాత వాసాన్ని ముగించుకొన్న అర్జునుడు ఉత్తరుని రథసారథిగా చేసుకొని విరాట నగరంపై దండెత్తి వచ్చిన కౌరవులను ఓడించిన రోజు కనుక విజయదశమి అంటారని మరికొందరు చెబుతారు. మనదేశ సంస్కృతిపై ఆర్యుల ప్రభావం అధికంగా ఉండటం వల్లే ఈ పండుగకు ఇన్ని రకాల కథలు పుట్టుకొచ్చాయని కొందరు చెబుతారు. అప్పట్లో మాతృస్వామ్య వ్యవస్థ బలంగా ఉండటంతో పాటు వ్యవసాయ దేవతలు అధికంగా ఉండేవారు. చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే గ్రామ దేవతలందరూ వ్యవసాయ దేవతలే అని అర్థమవుతుంది. దేవతలలో స్త్రీలు ఎక్కువగా కనిపించినట్లే యుద్ధ దేవతల్లో పురుషులు ఎక్కువగా వుంటారు. ఈ సంప్రదాయానికి భిన్నమైన వ్యక్తే 'దుర్గామాత'. సమాజంలో స్త్రీల ఆధిపత్యం బాగా వున్న కాలంలో పుట్టుకొచ్చిన ఈ దుర్గామాత ప్రాధాన్యత నానాటికీ పెరిగిందే తప్ప తరగలేదు. ఆ తర్వాత కాలంలో గ్రామదేవతలందరికీ పుట్టుకొచ్చినట్టే దుర్గామాతకు అనేక కథలు పుట్టుకువచ్చాయి. దేవతలకు జంతువులను బలి ఇవ్వడమనేది కూడా ఇక్కడి నుండి పుట్టుకొచ్చినదే... కాలక్రమంలో మాతృస్వామిక వ్యవస్థ ప్రభావం పూర్తిగా పోయి పితృస్వామిక సమాజం ఏర్పడినా ఆ ఒరవడిలో

బెంగాల్‌లో వందల యేండ్లుగా జరుగుతున్న దుర్గాపూజ

అన్ని పండగల కన్నా బెంగాల్‌లో దుర్గాపూజ అత్యంత ముఖ్యమైనది. దుర్గాపూజను రాష్ట్రమంతా ఘనంగా జరుపుకుంటారు. అన్నింటికన్నా కలకత్తాలో ఈ పండుగను రంగరంగ వైభవంగా జరుపుకుంటారు. కొన్ని వందల సంవత్సరాల నుండి దుర్గాపూజను క్రమం తప్పకుండా జరుపుకుంటున్న అతి పురాతన ఇండ్లు ఇక్కడ వున్నాయి. ఇందులో సబర్న చౌదరి వారసత్వ సంపదగా వస్తున్న బారిషా అనే అత్యంత పురాతన ఇల్లు ఒకటి. ఈ కుటుంబానికి చెందిన రాయ్ లక్ష్మీ కాంత మజుందార్ ఈస్టిండియా కంపెనీకి కొలికతా, సుతనూరి, గోబిందాపూర్ పరగణాలను కేవలం రు.1300లకే అమ్మివేశాడు. బారిషాలో గత 400 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా దుర్గాపూజ జరుగుతోంది. దుర్గాపూజ జరుగుతున్న మరో పురాతన గృహం దత్తాలకు చెందిన 'హతకుహలా' మదన్‌మోహన్ దత్తాకు చెందిన ఈ ఇల్లు నిమితోలా ఘాట్ రోడ్‌లో ఉంది. భాటుబాబు, లాటుబాబులకు చెందిన ఉత్తర కలకత్తాలోని నివాసంలో కూడా పురాతనకాలం నుండి క్రమం తప్పకుండా దుర్గాపూజ జరుగుతోంది. గోపీమోహన్ దేవ్, రామకృష్ణదేవ్‌కు చెందిన రెండు నివాస గృహాల్లో కూడా 18వ శతాబ్దం నుండి పూజలు జరుగుతున్నాయి. ద్వారకానాథ్ దత్తాకు చెందిన ద్వారకా భవన్‌లోనూ, వారి పూర్వీకులకు చెందిన లాభతానీయలో 11వ శతాబ్దం నుండి నిరాటంకంగా దుర్గాపూజ జరుగుతున్నది. స్వాతంత్ర్య పోరాటకాలంలో ప్రముఖ రాజకీయ నాయకుడిగా వున్న నిర్మల్ చౌదర్ తాతగారైన గణేష్ చౌదర్‌కు చెందిన చౌదర్స్ హౌస్‌లో 1897 నుండి దుర్గాపూజ జరుపుకుంటున్నారు. 19వ శతాబ్దానికి చెందిన రాకీరసమోనీకి చెందిన సెంట్రల్ కలకత్తాలోని నివాస గృహంలో భారీ ఎత్తున దుర్గాపూజా ఉత్సవాలు జరుగుతున్నాయి. రామకృష్ణ పరమహంస శిష్యురాలైన ఈమె దాక్షిణేశ్వర్‌లో భాబాతరణీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ కుటుంబంలో పూర్వీకులు చేస్తూ వస్తున్న పూజా కార్యక్రమాలన్నీ వారి తరువాత తరం వారు కూడా కొనసాగించడం విశేషం. అందుకే కలకత్తాలో జరిగే ఉత్సవాల్లో ఈ ఇళ్ళల్లో జరిగే పూజలు విశేషంగా ప్రజలను ఆకర్షిస్తాయి. పండగకు నగరంలోని ప్రతి వీధిని ఎంతో అందంగా అలంకరిస్తారు. విద్యుత్ దీపాల కాంతుల ధగధగలతో పూజామండపాలు మెరిసిపోతుంటాయి. ఎక్కడ చూసినా, ఏ చిన్న సందులో చూసినా పండుగ వాతావరణం కనిపిస్తుంది. స్థానిక క్లబ్‌లు కూడా పూజను పెద్ద ఎత్తున జరుపుతాయి. పండుగ జరిగినన్ని రోజులు నగరంలో ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పర్యాటక శాఖ ప్రత్యేక బస్సులను నడుపుతుంది. పైన తెలిపిన అన్ని పురాతన నివాసాలను కూడా పర్యటనలో చూపిస్తారు.

'ఒక్కొక్క పువ్వేసి చందమామా....'

ఎలాంటి మత విశ్వాసాలు, సంప్రదాయాలకు తావు లేకుండా కన్నీటి గాథలనూ, బాధలను మరచి ఎంతో ఉత్సాహంగా మన రాష్ట్రంలో తెలంగాణా మహిళలు మాత్రమే జరుపుకొనే పండుగ బతుకమ్మ. ఇది పంటలకు సంబంధించిన పండుగగా కూడా ప్రసిద్ధి చెందింది. తెలంగాణాలో సాధారణంగా మెట్ట పంటలన్నీ దసరా నాటికే పండి ఇల్లు చేరతాయి. అందుకే ఈ ప్రాంతం వారికి ఇది ఆనందోత్సవ కారణమైంది. గాదెల్లు, నిండి ధాన్యం ఇంట్లో కళకళలాడుతూ వుంటే ఆడవాళ్ళు పిల్లలూ సంబరాలు జరుపుకొంటారు. ఈ పండుగ రోజుల్లో ప్రతి గుమ్మం ముందు హడావుడి వుంటుంది. తంగేడు పువ్వు, గునుగు పువ్వు, గడ్డిపువ్వు, బంతి పువ్వులతో అందంగా బతుకమ్మలను పేర్చి మహిళలు తమ భక్తిని, కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ సందర్భంగా మహిళలు చెప్పుకొనే బతుకమ్మ కథల్లో ఇటు మతానికి కాని అటు దైవానికి కాని పెద్ద పీట కనిపించదు. బతుకమ్మ పండుగను పోలిన పండుగ ఎక్కడా కనిపించదు. ఈ పండుగ నేపథ్యాన్ని పరిశీలిస్తే ప్రధానంగా 19వ శతాబ్దంలో పూర్వార్ధంలోను, 20వ శతాబ్దం ఉత్తరార్ధంలోను నిత్యం దారిద్ర్యం, కలరా, మశూచి వంటి వ్యాధులు, ప్రకృతి బీభత్సాలతో తెలంగాణాలోని గ్రామాలలో లక్షలాది మంది చనిపోతూ ఏ గడపలో చూసినా కన్నీటి పరుదాలే కనిపిస్తున్న తరుణంలో ప్రజల ఊహలకు ప్రతిరూపంలో బతుకమ్మ పండుగ వచ్చింది. తమకు పుట్టిన పిల్లలు చావకుండా బతకటానికి బతుకు + అమ్మ = బతుకమ్మ అనే పండుగ వచ్చిందని అంటారు. అందుకే భక్తి... ముక్తి వంటి మత భావాలు ఈ పండుగలో కనిపించవు. సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు కనిపిస్తాయి. కట్టుబాట్ల పేరిట పెద్ద పెద్ద కుటుంబాలలో ఏకాంతంగా గడిపే ఆడపడుచులకు, పొద్దస్తమానం ఊరికి దూరంగా పంట చేలల్లో కాయకష్టం చేసే బడుగువర్గాల స్త్రీలకు సంసారిక బంధాలు, ఆఫీసుల మధ్య ఎడతెరిపి లేకుండా వుండే మహిళలు ఒకచోట కలుసుకొని సామూహికంగా తమ కుటుంబాల సుఖాలను దుఃఖాలను పంచుకొంటారు.

అమావాస్య రోజు, దసరా కంటే ముందు సాయంకాల వేళ అయిదు పువ్వులలో చిన్న బతుకమ్మగా వేడుక మొదలై పండుగ రోజు సాయంకాలం సమయంలో మహిళలందరు ఆడుకునే చివరిరోజు పెద్ద బతుకమ్మ పేరుతో ఎంతో వైభవంగా జరుపుకొంటారు. దీన్నే సద్దుల పండుగ అని కూడా పిలుస్తారు. పెద్ద బతుకమ్మ రోజు ఏ వాకిట్లో అడుగు పెట్టినా ఆడపిల్లల నవ్వులు కేరింతలతో సందడిగా కనిపిస్తుంది. కొత్త బట్టలు, గాజుల గలగల సవ్వడిలు వినిపిస్తాయి. ఎక్కడెక్కడో వున్న రంగుల పువ్వులు, తీసుకొని రావడమే కాక తెల్లగా వుండే గానుగు పువ్వు తీసుకొని వచ్చి వాటిని రంగురంగులతో ముంచి తంబాలం (ప్లేట్)లో గుమ్మడి, తామర ఆకులను పరిచి పూలతో అందంగా పేర్చుతారు. చివరన గుడిగోపురంలా వుండేలా తీర్చుతారు. ఇలా బతుకమ్మను సింగారించే సరికి సాయంత్రం దగ్గర పడుతుంది. ఆ సమయంలో రంగుల చీరలతో అలంకరించుకొని వీధుల ప్రధాన కూడలి వద్ద తాము సింగారించిన బతుకమ్మలను ఏ రకమైన సంగీత వాయిద్యాలు లేకుండానే వాళ్ళ చప్పట్లు, కోలాటాలతో బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడ్తారు. ఈ సందర్భంగా పాడే పాటలలో మహిళలు తమ జీవితంలో ఎదురయ్యే సంఘటనలను, అనుభవాలను చిత్రిస్తారు.

"ఒక్కొక్క పూవేసి చందమామ
ఒక్క జామూ ఆమె చందమామ
రెండేసి పూలేసి చందమామ
రెండు జాములాయె చందమామ
మూడేసి పూలేసి చందమామ
మూడేసి జాములేయె చందమామ అంటూ సాగుతూ...
కింద ఇల్లు గట్టి చందమామ
పైన మఠము గట్టి చందమామ
మాయదారీ శివుడు చందమామ
గోరంట వనములకు చందమామ
గోడ బెట్టబోయె చందమామ
బంతులాడబోయె చందమామ
మల్లె వనములోకి చందమామ
మాటలాడబోయె చందమామ
నిద్రజెయ్యబోయె చందమామ' అంటూ కొత్త పెళ్ళి కూతుళ్ళపై, ఆలుమగల అలకలపై కట్న కానుకలపై తదితర అంశాలపై రంగురంగుల పువ్వులతో రమణీయంగా కూర్చిన బతుకమ్మల చుట్టూ తిరిగే మహిళలకు ఎంత సేపయినా సరే అలా జానపద పాటలతో ఆడాలనే అనిపిస్తుంది. చూసేవాళ్ళకు చూడాలనే అనిపిస్తుంటుంది. చివరి రోజు

"నిదురబో బొడ్డెమ్మ నిదురబోవమ్మా
నిదురకు నూరేండ్లు నీకు వెయ్యేండ్లు
పాలించే తల్లికి పాలు వెయ్యేండ్లు
నిన్ను గన్న తల్లికి నిండా వెయ్యేండ్లు... అంటూ నిద్ర యిచ్చే పాట పాడుతూ బతుకమ్మ పండుగ ముగుస్తుంది.

టి.వి.నారాయణ, సిరిసిల్ల

కొట్టుకుపోకుండా నిలిచిన దేవత 'దుర్గ', ఆమె పేరుతో జరిగే పండుగ 'దసరా'.

ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరు

దేశంలోని వివిధ ప్రాంతాల్లో రకరకాలుగా ఈ పండుగ జరుగుతుంది. నవరాత్రులందు రోజుకొకటి చొప్పున దుర్గ అంశలను కొన్ని ప్రాంతాల్లో పూజిస్తారు. కొన్ని ప్రాంతాల్లో దుర్గతో పాటు లక్ష్మిని కూడా కొలుస్తారు. ఉత్తర భారతంలో పది రోజుల పాటు 'రామలీల' వేడుక జరుగుతుంది. అంటే రామాయణ గాథలను నాటకాలుగా ప్రదర్శిస్తారు. రావణుడు, కుంభకర్ణుని బొమ్మను పెద్ద ఎత్తున తయారు చేసి దగ్ధం చేయడం ఇందులో ప్రధాన కార్యక్రమం. సుమారు 120 నుండి 150 అడుగుల ఎత్తు వరకు రాక్షసుల బొమ్మలు తయారు చేసి వాటిల్లో బాణాసంచా కూర్చి దగ్ధం చేస్తారు. మనదేశంలో ఈ ఉత్సవాలు అత్యంత ప్రముఖంగా జరిగే రాష్ట్రం బెంగాల్. ప్రత్యేకించి కలకత్తానగరంలో ఈ వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతాయి. 'కాళీమాత' ఉత్సవాల పేరుతో బెంగాల్ ప్రజలు ఎంతో ఆర్భాటంగా దసరా ఉత్సవాలు జరుపుతారు. దుర్గను కాళి అని పిలిచినట్లుగా 'శాకాంబరి' అని కూడా వ్యవహరిస్తారు. తమిళనాడులో దసరాను నవరాత్రి అంటారు. మూడు రాత్రులు లక్ష్మీపూజ, మూడు రాత్రులు సరస్వతీ పూజ చేసుకుంటారు. ప్రతి ఇంట్లోనూ బొమ్మల కొలువు పెడ్తారు. ఆటవస్తువులు, మట్టితో చేసిన దేవుళ్ళు, దేవతలు, జంతువుల బొమ్మలు మెట్లుమెట్లుగా వున్న బల్లల మీద అమరుస్తారు. ప్రతిరోజూ సాయంత్రం స్త్రీలు ఒకరి ఇళ్ళకు ఒకరు వెళ్ళి పాటలు పాడి నృత్యాలు చేస్తారు. తొమ్మిదవ రోజున సరస్వతి పూజ లేక ఆయుధ



దసరా ఉత్సవాలకు ముస్తాబైన మైసూర్ రాజభవనం

పూజ చేస్తారు.

కర్నాటకలో దసరా చాలా పెద్ద పండగ. వేలాది మంది భక్తులు చాముండి పర్వతం మీద గల చాముండేశ్వరి దేవాలయం వద్ద గుమిగూడతారు. దుర్గ మైసూరు నగర దేవత. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల్లో దసరా ఉత్సవాలు దాదాపు ఒకే విధంగా జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే విజయవాడలోని కనకదుర్గ ఆలయంలోఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఈ వేడుకల్లో ఇప్పటికీ ప్రతి పల్లెలోనూ అర్జునుని ధనస్సు ధరించిన, శ్రీరామునికి ప్రియమైనదిగా భావించి జమ్మి చెట్టును ప్రజలు పూజిస్తారు. గ్రామస్థులు మంగళవాయిద్యాలతో వెళ్ళి శమీ పూజ జరుపుతారు. దీనివల్ల పాపాలు శమిస్తాయని, శత్రువులు నశిస్తారని భావిస్తారు. ఇదే సమయంలో పాలపిట్టను కూడా చూడటం ఓ ఆచారం. పట్టణాలు, పల్లెల్లో ఆయుధ పూజలు జరుగుతాయి. ఏ వృత్తిలో వున్న వారైనా తమకు సంబంధించిన పనిముట్లను శుభ్రపరచి అలంకరణతో వాటిని పూజకు పెడతారు. మధ్యప్రదేశ్‌లో మహాకాళికి నెలవుగా వందేళ్ళ క్రితమే ఉజ్జయిని దసరా ఉత్సవాల కోసం ఐదెకరాల మైదానాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ దేవతగా, దుష్టశక్తులపై మహోగ్రంగా విజృంభించిన దేవతగా చెప్పుకుంటూ దసరా ఉత్సవాలు జరుపుకొంటారు.

మామూళ్ళు మామూలే!!

దసరా వచ్చిందంటే అందరికీ గుర్తుకు వచ్చేది మామూళ్ళు. అడిగే వారి హక్కుగాను, ఇచ్చేవారి దాతృత్వంగాను కనపడే ఈ మామూళ్ళ వ్యవహారం ఎక్కువ చోట్ల తలనొప్పిగానే ఉంటుంది. ఉత్సవాల పేరుతో చందాలు వసూలు చేసే వారు కొందరయితే వివిధ వృత్తుల్లో వున్న వారు, ప్రభుత్వ సర్వీసుల వారు దసరాకు మామూళ్ళు అడగడం పరిపాటిగానే మారింది. ముఖ్యంగా వ్యాపార వర్గాల వారు ఎక్కువ సంఖ్యలో మామూళ్ళు ఇచ్చుకోవాల్సి వస్తుంది. కొందరు గూండాగిరీ చెలాయించే వాళ్ళు, రౌడీలు బలవంతంగానైనా మామూళ్ళు వసూలు చేసుకుంటుంటారు. మనకు నిత్యం వివిధ సేవలందించే వారే పండుగకు ముందో, తర్వాతో దసరా మామూలు అంటూ ఓ పుస్తకం పట్టుకువస్తారు. అయితే తమ శక్తి కొలది చందా రాసి వచ్చిన వారిని సంతృప్తి పరిచే వారే అధికంగా ఉండటం దసరా పండుగలోని విశేషం.

ఎన్నెన్నో ఆశలు

దసరా విశిష్టత, వైశిష్ట్యం మాట ఎలా వున్నా వర్తమానంలో ఆయా వర్గాల ప్రజలు దసరాను ఎలా జరుపుకుంటున్నారన్నదే ముఖ్యమవుతుంది. దేశంలో బి.జె.పి. నేతృత్వంలోని ఎన్.డి.ఏ. అధికారంలోకి వచ్చినప్పటి నుండి సామాన్యుల బ్రతుకు చక్రం గతి తప్పుతూనే వుంది. ధరల భారాలు మోయలేని రీతిలో ఉంటున్నాయి. ప్రత్యేకించి మన రాష్ట్రం విషయానికి వస్తే అతివృష్టి, అనావృష్టి రెండూ రైతులతో చెలగాటమాడుతున్నాయి. మొన్నటి వరకు కరువు బారిన పడ్డ ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు అధికంగా కురిసి పంట నష్టపోయే ప్రమాదం ముంచుకువస్తోంది. సరైన తిండికి నోచుకోక ఎంతోమంది ఆకలి చావులకు గురి కాగా, పంటలను కాపాడే ప్రయత్నంలో పురుగు మందులు చల్లుతూ మరికొంత మంది మరణించారు. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా ఈ దసరా అందరి లోగిళ్ళలో ఆనందాన్ని నింపాలని, అలాంటి దసరాలే ప్రతి ఏటా రావాలని కోరుకుందాం.

- సండే డెస్క్

దుర్గాపూజ.... బుద్ధదేవ్ పాట!

బెంగాలీయులు దుర్గాపూజను అత్యంత వైభవంగానూ, భక్తి శ్రద్ధలతోనూ ఘనంగా జరుపుకుంటారు. వారం రోజుల పాటు ప్రజల్లో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తాయి. ఈ ఉత్సవాల్లో బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య గొంతు కలిపారు. ప్రతి దుర్గా మండపం వద్ద భక్తజనాన్ని ఆయన శ్రావ్యమైన గొంతు నుండి జాలువారిన మధురమైన పద్యాలు, పాటలు అలరించనున్నాయి. దుర్గాపూజ సందర్భంగా ఆర్.పి.గోయంకా గ్రూప్‌కు చెందిన మ్యూజిక్ వరల్డ్ రూపొందించిన క్యాసెట్‌లో బుద్ధదేవ్ 19 పద్యాలు పాడారు. బుద్ధదేవ్ మామగారైన సుఖాంతో భట్టాచార్య వీటిని రచించారు. ఆడియో క్యాసెట్‌లో పాటలు పాడిన మొదటి ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యనే. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నందన్ సినిమా కాంప్లెక్స్‌లోని ప్రైమ్ మ్యూజిక్ సెంటర్‌లో వీటిని రికార్డు చేశారు. క్యాసెట్ ధరను 40 రూపాయలుగా నిర్ణయించారు. ఈ డబ్బు మొత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేస్తారు. "హే మహాజలన్" అన్న పేరు గల ఈ క్యాసెట్‌ను దుర్గాపూజా కార్యక్రమంలో వినియోగిస్తారు. "ఆయన పాటలు పాడటమే ఈ సంవత్సరంలో అతి పెద్ద ఎట్రాక్షన్" అని గోయంకా గ్రూప్ సలహాదారు ఎం.ఎస్.ముఖర్జీ వ్యాఖ్యానించారు. ఒకే సిటింగ్‌లో బుద్ధదేవ్ మొత్తం 19 పద్యాలను ఆలపించడం విశేషం.



దక్షిణాదిలోనే విశిష్టం - విజయవాడలో దసరా

విజయవాడ నగరంలో జరిగే దసరా వేడుకలకి దక్షిణ భారత దేశంలోనే ఒక ప్రత్యేకత వుంది. ఇందుకు నగరంలో వున్న కనకదుర్గ ఆలయం ఒక కారణమైతే ఇక్కడ వాడవాడలా జరిగే నవరాత్రి వేడుకలు మరోకారణం. కనకదుర్గ (దుర్గామల్లేశ్వరస్వామి) ఆలయంలో దసరా సందర్భంగా ప్రతి ఏడాది ఆశ్వీయుజ శుద్దపాడ్యమి మొదలుకొని తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. విజయవాడకు వున్న మరోపేరు బెజవాడ. విజయవాడ నగరాన్ని బెజవాడగా వ్యవహరించడానికి అనేక కథలు వాడుకలో వున్నప్పటికీ ఇక్కడ వున్న కనకదుర్గాదేవి కారణంగానే విజయవాడకు బెజవాడ అనే పేరు వచ్చినట్టు పలువురి నమ్మిక. లోకరక్షణ కోసం స్వర్ణకవచంతో జగన్మాతగా అవతరించి ధర్మబీజాలు నాటింది. ఆనాడు జగన్మాత ధర్మబీజాలు నాటిన ప్రాంతమే నేటి విజయవాడ. నాడు బీజవాడగా వ్యవహరించినప్పటికీ కాలక్రమంలో బీజవాడ బెజవాడగా మారినట్టు చెబుతారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారం చేస్తారు. ఈ అలంకారాలను చూడటానికి దసరా సందర్భంగా దేశంలోని పలుప్రాంతాల నుంచి లక్షల ప్రజలు సంఖ్యలో విచ్చేస్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే నవరాత్రి ఉత్సవాలతోపాటు పదవరోజు విజయదశమి రోజు జరిగే తెప్పోత్సవంతో కలిపి 10 రోజులు జరిగే ఉత్సవాలకు కనీసం అయిదు లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనా. దుర్గాదేవి కైలాసం తిరిగి వెళ్ళే సమయంలో కృష్ణానదిలో జలవిహారం చేసినట్టు చెప్పే ఇతిహాసాన్ని పురస్కరించుకొని విజయదశమి రోజున ప్రత్యేకంగా రూపొందించిన పుష్పాలంకృత హంస వాహనంపై కనకదుర్గామల్లేశ్వరుల నదీవిహారంతో ఉత్సవాలు ముగుస్తాయి.

దుర్గగుడితో తమజీవితాలు ముడిపడి వున్నాయని భావించే ఈప్రాంత ప్రజలు పలుప్రాంతాలలో పందిళ్ళువేసి నవరాత్రిఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా రాత్రులలో కనకదుర్గాదేవి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో కనకదుర్గాదేవి ప్రతిమతోపాటు యువకులు స్వయంగా దుర్గాదేవితో సహా పలువేషాలు ధరించి వాహనాలపై ఊరేగుతారు. ఈ ఊరేగింపులో భేతాళ నృత్యాలు ప్రజల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. భేతాళ ఊరేగింపులో పాల్గొనే కళాకారులు ఎక్కడి నుంచోకాకుండా ఏ ప్రాంతానికి చెందినవారు ఆప్రాంతంలోనే స్వయంగా వేషాలు ధరిస్తారు. ఈ వేషాలు ధరించడం కోసం కనీసం యువకులు తమతమ ప్రాంతాలలో రాత్రి సమయంలో నెలరోజుల ముందు నుంచే ప్రత్యేకంగా శిక్షణ తీసుకొంటారు. భేతాళ నృత్యంలో కనకతప్పెటలకు అనుగుణంగా వేసే చిందు అద్భుతంగా వుంటుంది. విజయవాడ నగరానికి ప్రత్యేకమైన ఈ భేతాళ నృత్యాన్ని అనేక సినిమాలలో కూడా చిత్రీకరించారు.

-అన్నవరపు బ్రహ్మయ్య, విజయవాడ

సెరిబ్రల్ పాల్సీ గల పిల్లలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలు

గూల్ ఆర్ ప్లంబర్
రాష్ట్ర మానసిక వికలాంగుల సంక్షేమ సంఘం

సెరిబ్రల్ పాల్సీ ఉండే పిల్లలు అనేక రకాలైన వైకల్య సమస్యలకు గురి కావడం సహజం. వైకల్య సమస్యల్లో కంటికి సంబంధించినవీ ఉంటాయి. 50 శాతం నుండి 70 శాతం పిల్లలకు మాట్లాడడంలో సమస్యలు వస్తాయి. ఇవన్నీ ఒక దానితో ఒకటి కలిసి ఉంటాయని పరిశోధనలు తెలియచేస్తున్నాయి. 50 శాతం మంది పిల్లల్లో ఫిట్స్ సంభవించిన లక్షణాలు (డిసార్డర్స్) సెరిబ్రల్ పాల్సీని అనుసరించి ఉంటాయి. ఇంచుమించుగా 75 శాతం మంది పిల్లలు మనోవికాసం విషయంలో తక్కువ తెలివి తేటలు, 50 శాతం మంది మానసిక వికలాంగత కలిగి ఉంటారని పరిశోధనలు వెల్లడించాయి. అందువలన విద్యా విషయాలలో పిల్లలు వెనుకబడి ఉంటారు. కనుక ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలి.

పిల్లల సహజ పెరుగుదలపై ఫిట్స్ ప్రభావం

పిల్లలు నడవడం, మాట్లాడటం, మల మూత్ర విసర్జన లాంటివి నేర్చుకునే సమయంలో ఫిట్స్ రావడం, ఆగకుండా అలానే కొనసాగితే సహజంగానే తమను తాము నిగ్రహించుకునే స్థాయి రావడానికి ఆలస్యమవుతుంది. ఆత్మనియంత్రణ పెంచుకొనే విషయంలో సాధారణమైన పిల్లలు తీసుకొనే సమయం కంటే ఎక్కువ సమయం ఈ పిల్లల కోసం కేటాయించాలి. సెరిబ్రల్ పాల్సీ బిడ్డకు హద్దు అనేది అవసరం ఉంటుంది. తమ హద్దులు తెలుసుకోగలిగిన చలాకీతనం వుంటుంది. తెలివైన బిడ్డ సహజంగానే ఆత్మవిశ్వాసంతో ఉండగలడు.

సెరిబ్రల్ పాల్సీ బిడ్డ, ఫిట్స్ వచ్చిన ఏ బిడ్డ అయినా ప్రవర్తించే విధంగానే ప్రవర్తిస్తాడు. ఎపిలెప్సీ ప్రభావం మనిషిలో మానసిక, సాంఘిక సంఘర్షణ రూపంలో ఉంటుంది. అంతేకాని శారీరక సంబంధమైనది కాదు.

ఎపిలెప్సీ గల బిడ్డకి వైద్యం చేయకుండా ఉంటే అది బిడ్డ మెదడుకు హాని కలిగించి తద్వారా బిడ్డను మానసిక వికలాంగుడిగా మారుస్తుంది. వయస్సు పెరిగే కొద్దీ తీవ్రమైన సెరిబ్రల్ పాల్సీ గల పిల్లలకు ఎపిలెప్సీ వస్తే వైద్యం చేసినా త్వరగా నయం కాదు. ఎపిలెప్సీ కలిగియున్న సెరిబ్రల్ పాల్సీ బిడ్డకు ఆందోళన కలిగించే సమస్యలు ఉంటే అవి ఇంటి దగ్గరే మనకు తెలుస్తాయి. అలాంటి పిల్లల తల్లిదండ్రులు మిగతా పిల్లల కంటే సంరక్షణ పట్ల ఎక్కువ శ్రద్ధ కనబరుస్తారు. ప్రతి పనిని భయంతో అతి జాగ్రత్తగా చేస్తారు. దాంతో పిల్లలలో ఆదుర్దా పెరిగి ఎపిలెప్సీ కొని తెచ్చుకుంటారు. ఈ కారణాలన్నీ వారి సహజమైన పెరుగుదలను ప్రభావితం చేస్తాయి.

తల్లిదండ్రులకు కొన్ని సూచనలు

తల్లిదండ్రులు తమ పిల్లలకు వచ్చే ఫిట్స్ లక్షణాల గురించి, తరచుగా సంభవించే సమయాల్ని గురించి, ఫిట్స్ మాటిమాటికి ఎక్కువగా వస్తుంటే ఎవరిని వెంటనే సంప్రదించాలో వీటన్నిటి గురించి ఉపాధ్యాయులకు తెలియచేయాలి. స్పెషల్ ఎడ్యుకేటర్ (ప్రత్యేక



నా వయస్సు 38 సం॥లు. ఐదేళ్ళుగా ఒంటికి నీరు చేరుతోంది. రకరకాల టెస్టులు చేసి ఏమి లేదన్నారు. వారానికి మందులు ఇచ్చారు. యూరిన్‌లో నీళ్ళు పోవటానికి టాబ్లెట్లు వేసుకున్న రోజు బాగానే ఉంటుంది. లేకుంటే ఒంటినిండా నీరు చేరుతోంది. పరిష్కారం ఏమిటి?

మరో సమస్య. మూడేళ్ళ క్రితం పీరియడ్స్ లేట్‌గా వచ్చి మూడు నెలలు ఓవర్ బ్లీడింగ్ అయ్యింది. అప్పటినుండి పీరియడ్స్ ఇర్రెగ్యులర్ అయ్యింది. మెడిసిన్ (హార్మోన్లు) వాడినప్పుడు బ్లీడింగ్ కంట్రోల్‌లో ఉండేది. హార్మోన్స్ ఎక్కువ వాడొద్దని డాక్టర్ ఆపివేయమన్నారు. తర్వాత పరీక్షించి ఆపరేషన్ అవసరమన్నారు. రెండు నెలల క్రితం గుంటూరులో స్కానింగ్ చేయించాం. ఈ మధ్య బ్లీడింగ్ ఒక రోజు తప్పించి మరోరోజు అవటం జరుగుతోంది. గర్భసంచి గట్టిగా, కొంచెం పెద్దదిగా ఉంది. నా సమస్యలకు పరిష్కారం చెప్పండి.

- ఆర్.డి., వినుకొండ

మీకు రక్తం తక్కువగా ఉండడం వల్ల శరీరంలో నీరు చేరుతుంది. రక్తపరీక్ష చేయించుకొని రక్తం ఎంత శాతం ఉందో తెలుసుకొని రక్తం రావడానికి మందులు వాడవల్సివుంటుంది.

హార్మోన్లు వాడినా బ్లీడింగ్ తగ్గకుండా ఉన్నా గర్భసంచి పెద్దదిగా ఉన్నదని చెబుతున్నారు కాబట్టి మీకు తప్పక ఆపరేషన్ అవసరం.

నా వయస్సు 24 సం॥లు ఎత్తు 41/2, బరువు 49 కిలోలు. పెళ్ళి అయ్యింది. ఇద్దరు పిల్లలున్నారు. నెలనెల రుతుక్రమం సక్రమంగానే వస్తున్నా రుతుక్రమానికి ఒక రోజు ముందు నుండి నడుం పీకడంతో పాటు కడుపునొప్పి వస్తోంది. కడుపు నొప్పి రాకుండా ఉండాలంటే గర్భసంచి తొలగించాల్సిందేనా...? తగు సలహా ఇవ్వగలరు.

- టి.కుమారి, మామిడిపల్లి

రుతుక్రమం సమయంలో నడుం లాగడంతోపాటు కడుపునొప్పి రావడం సహజం. నొప్పి ఎక్కువగా ఉంటే 'మెఫ్ టాల్ స్పాన్' బిళ్ళలు వాడితే సరిపోతుంది. గర్భసంచి సాధారణంగా ఉంటే తొలగించాల్సిన అవసరం లేదు. మీరు దగ్గరలోని గైనకాలజిస్టును సంప్రదించగలరు.

డాక్టర్ ఇ. రావమ్మ, ఎంబిబిఎస్,
డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల,
నెల్లూరు.



శిక్షకుడు) వీలైనంత వరకు ఫిట్స్ గురించి వాటికి సంబంధించిన అవసరమైన విషయాలను గురించి (మందులు ఇతర జాగ్రత్తలు) వైద్యుని నుండి తెలుసుకోవాలి. ప్రవర్తనకు సంబంధించిన విషయాలను మానసిక వైద్యుని నుండి తెలుసుకోవాలి.

ఈ పిల్లలకు విద్య నేర్పించడానికి, పరిస్థితి అర్థం చేసుకొని వారిని దగ్గరకు తీసుకొనే మనస్తత్వాన్ని కలిగి ఉండడం ముఖ్యమైన అవసరం. చిన్న ఫిట్స్ (పెటిటోమాల్) అంటే 3 సంవత్సరాల లోపు పిల్లలకు ఒక క్షణం నుండి 20 క్షణాలు మాత్రమే సంభవించే చిన్న ఫిట్స్‌కు ప్రత్యేకమైన జాగ్రత్తలంటూ ఏమీ లేవు. కాని ఉపాధ్యాయుడు, ఆ పరిస్థితిలో క్లాసు రూములో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోగలిగే స్థితిలో ఆ పిల్లలు ఉండరనే విషయం మాత్రం గమనించాలి. అంతేగాక ఆ విషయం గురించి తెలుసుకోలేకపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఉండేది కొద్ది సమయమే అయినప్పటికీ, అది స్కూలు పనికి ఆటంకం కలిగిస్తుంది. ఎందుకంటే అది రోజుకు పది, పన్నెండు సార్లుగా సంభవించే అవకాశాలు వున్నవి. ఈ లక్షణం పెటిట్ మాల్‌పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంటుంది.

ఉపాధ్యాయుడికి ఫిట్స్ వచ్చే వారితో వున్న అనుభవం, బాధ్యత, నేర్పు క్లాసు రూములో వున్న పిల్లల్తో గల సంబంధాలలో కనిపిస్తుంది. ఇది పిల్లల్లో వ్యక్తిత్వ వికాసానికి (మంచి లేక చెడు) దారి తీస్తుంది. క్లాసులో వున్నప్పుడు ఆ పరిస్థితి ఎదురైనప్పుడు సాధ్యమైనంత నిగ్రహంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించాలి. ఎవరూ లేనప్పుడు సాధ్యమైనంత వరకు నిగ్రహించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించాలి. ముందు చెప్పిన విధంగా చేస్తూ బిడ్డ విశ్రాంతి తీసుకొన్న తర్వాతనే టీచర్ తన బోధన సాగించాలి. ఎందుకంటే టీచర్‌కు ఇతర పిల్లల బాధ్యత కూడా ఉంటుంది.

ఒకవేళ అవసరమైతే బిడ్డ భయపడకుండా, బాధపడకుండా ఉండేందుకు ఫిట్స్ త్వరగా తగ్గిపోతాయని మెల్లగా బిడ్డకు తెలియజేయాలి. ఈ కన్వల్సివ్ ఫిట్స్ ముగిసిన వెంటనే బిడ్డ గాఢమైన నిద్రలోకి జారుకుంటాడు. ఉపాధ్యాయుడు బిడ్డ. క్రింద ఒక బెడ్‌షీట్ ఉంచి అది పూర్తిగా బిడ్డను కప్పేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫిట్స్ వున్నా సెరిబ్రల్ ఫాల్సీ బిడ్డ స్కూలుకు తప్పనిసరిగా వెళ్ళాలి. కనీసం బిడ్డ ఆరోగ్యం గురించి అయినా తప్పనిసరిగా వెళ్ళాలి. మానసికంగానూ, శారీరకంగానూ చురుకుదనం కలిగి వుండడం అనేది మెదడును బాగా పని చేయించడానికి, ఆరోగ్యంగా వుంచడానికి తోడ్పడతాయి. అందుకే శారీరక, మానసిక చురుకుదనం నుండి పిల్లలను దూరం చేయకూడదు. ఫిట్స్ వచ్చిన బిడ్డను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. ప్రత్యేకంగా బయటకు షికారుగా వెళ్ళినప్పుడు వారి ఆటల విషయంలో ఎలాంటి ఆటలు ఆడించాలా అని ఆలోచిస్తుంటారు. కాని వారి ఆలోచనలకు సమాధానం దొరకదు. అందువల్ల వారి కుటుంబ వైద్యులు, బిడ్డ విషయం తెలిసిన వారెవరైనా మంచి సలహా ఇస్తే దాని ప్రకారం చేయవచ్చు. తాను స్వయంగా తన వయస్సు వాళ్ళతో కలిసి తిరగాలని ఆశ బిడ్డకు వుంటుంది. కాని దానికి కొన్ని పరిధులు వుంటాయి.

ఎపిలెప్సీ కలిగిన బిడ్డలు శరీర కదలికల్లో కంటే భావాల వ్యక్తీకరణలో లేక ప్రవర్తన రూపంలో ఫిట్స్‌ను బహిర్గతం చేయగలరు. కోపంగా అరవడం లేక పరుగెత్తిపోవడం లాంటివి తరచూ చేస్తూ వుంటారు. ఈ అలవాటు సైకో మోటారు లాంటి ఎపిలెప్సీని తెలియజేస్తాయి. అలాంటి సంఘటనలు విచిత్రంగా, అనూహ్యంగా అనిపించడం లేక ప్రయత్నించినా సాధారణ స్థితికి రాకపోతే వైద్యుని దృష్టికి తీసుకువచ్చి వారితో చర్చించాల్సి వుంటుంది. ఫిట్స్ వున్న బిడ్డకు ఇబ్బందికరంగానూ, అవమానంగా కూడా వుంటుంది. ఇది మానసిక జబ్బు కాదు. కనుక ఇతర కుటుంబ సభ్యుల్లానే ఆదరించాలి. ఇతర బిడ్డలలానే ఫిట్స్ వున్న బిడ్డను కూడా ప్రేమించాలి. హృదయ పూర్వకంగా ఇష్టపడాలి. బిడ్డ భావోద్వేగాల్ని అదుపులో వుంచుకోవడానికి కొన్ని పరిమితులను వుంచాలి. తన పనులను తానే చేసుకొనే అవకాశం కల్పించాలి. సమయానికి తగినట్టుగా అవసరమైన సహాయాన్ని అందిస్తూ పిల్లలకు వారి ప్రవర్తనా ధోరణులను, భావాలను తమకనుగుణ్యంగా మలచుకొనేందుకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సహాయ పడతారు. అలాగే అలాంటి బిడ్డను పెంచడంలో అవసరమైన జాగ్రత్తలను, సలహాలను అందివ్వగలరు. ☆

గ్రంథ స్వీకారం

సెప్టెంబర్ పదకొండో తేదీన అమెరికాపై జరిగిన టెర్రరిస్టు దాడులు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఆ దాడులలో వేలాది మంది మృతి చెందడం అత్యంత విషాదకరం. ఈ ఘటనలకు బలైన వారి కుటుంబ సభ్యులకు ప్రపంచ ప్రజలందరూ సంతాప సానుభూతులు తెలియజేస్తున్నారు. ఈ అమానుషత్వం ఏ విధంగానూ సమర్ధనీయం కాదు. ఇందుకు బాధ్యులెవరనేది జాగ్రత్తగా పరిశోధించి తేల్చవలసిన విషయం. సాక్ష్యాధారాలు దొరికిన వెంటనే ఐక్యరాజ్యసమితి ద్వారా, ఇతర ప్రపంచ సంస్థల ద్వారా దోషులను శిక్షించేందుకు చర్యలు తీసుకోవలసి వుంటుంది. కానీ అందుకు భిన్నంగా అమెరికా, నాటో దళాలు ఆఫ్ఘనిస్తాన్‌పై ఏకపక్షంగా దాడులకు దిగాయి. ఈ పరిస్థితుల్లో టెర్రరిస్టు దాడుల అనంతర పరిణామాలను, ప్రమాదాలను అర్థం చేసుకోవడానికి, మానవాళిని బెదిరిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదం నిజస్వరూపాన్ని తెలుసుకోవడానికి ఈ వ్యాస సంకలనం ఎంతగానో ఉపయోగపడగలదు.

అమెరికా యుద్ధోన్మాదమా?
టెర్రరిజంపై సమరమా?

ప్రచురణ : ప్రజాశక్తి బుక్‌హౌస్, వెల : రు. 5/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

కవి కాంచనపల్లి చిన వెంకట రామారావు సంస్మరణను పురస్కరించుకొని 2000, ఏప్రిల్ 8, 9 తేదీలలో నల్గొండ జిల్లా కవులు, రచయితల మహాసభ జరిగింది. ఈ సభను పురస్కరించుకొని ముద్రించిన ప్రత్యేక సంచిక ఈ పుస్తకం.

కాంచనపల్లి చినవెంకటరామారావు స్మారక
నల్లగొండ జిల్లా కవులు, రచయితల
మహాసభల ప్రత్యేక సంచిక

సంపాదకవర్గం : డా॥ నోముల సత్యనారాయణ, డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్.కె.రామారావు, చెరుకు ఉషాగౌడ్, పున్న అంజయ్య,
ప్రతులకు : డా॥ కాంచనపల్లి ప్రభాకర్‌రావు, ఇ.నెం. 6-3-77, రామగిరి, నల్లగొండ జిల్లా, చెరుకు ఉషాగౌడ్, కేరాఫ్ డా॥ చెరుకు సుధాకర్, హంస హాస్పిటల్, నకిరేకల్


పేదోడికి ఉండటానికి పక్కా ఇల్లు ఇవ్వాలనే సదాశయంతో
ముందుకు పోతున్నాం... మీరూ రండి బ్రదర్
బంద్


మునుపటికంటే.. ఇప్పుడు బాగా ధైర్యం అబ్బింది సార్..
ఒక వేతకే ఎవడైనా ఖతమే హహ్హహ్హా...
యోగా తరగతులు


తప్పు చేయడంతోపాటు.. పట్టుబడకుండా ఉండటంలోనే
రాజకీయ చతురత ఉందన్న విషయాన్ని...
అర్థం చేసుకొంటే పైకొస్తావోయ్!!
GANGA DHAR

ఉన్మత్తుల ఆగడాలు అరికట్టాలి



జరుగుతుంది మరో పోరు
ఎన్నడు మారేను ఈ తీరు???
భీకర గర్జనల నడుమ
మృత్యు ఘోష ధ్వనియించ...
భీతిల్లిన ప్రజ అంతా
తలోదిక్కు పయనించ...
ఎందుకు కొరగాని ఈ ధ్వంస రచన
శాంతి కొరకు చెయ్యాలి ఓ సూచన
పేట్రేగిన ముష్కరులు
మానవతనే మరచిపోగ...
చక్కని ప్రకృతియంత
కళ్ల ముందే కాలిపోగ...
విశ్వమంత నిండిపోవు హాలాహలం
ప్రతి ముంగిట వినిపించు హాహాకారం
పచ్చని పైరుల జాడ
లేగదూళ్ల అడుగుజాడ...
చల్లనైన పల్లె సీమలు
అందమైన ఉషస్సులు...
యుద్ధభూత కోరల్లో మాడిపోవు
మరుభూమిగ అవనంతా మారిపోవు
ధనిక-పేద తేడ లేదు
చిన్న - పెద్దయని లేదు..
యుద్ధమొస్తె నాశనమే
జీవనమొక శాపమే..
యుద్ధం వద్దంటూ ఘర్జించాలి
ఉన్మత్తుల ఆగడాలు అరికట్టాలి...

- సంపటం దుర్గాప్రసాదరావు

కోకిలమ్మ పదాలు



ఉగ్రవాదపు కత్తి
అగ్రరాజ్యపు నెత్తి
మీదజారిన మిత్తి
ఓ కోకిలమ్మా!

ఎదురులేదని విర్ర
వీగుచుండే కర్ర
పెత్తనానికి తొర్ర
ఓ కోకిలమ్మా!

ఆఫ్ఘాను చిట్టెలుక
అదుపు తప్పిన నడక
అమెరికంట్లో నలక
ఓ కోకిలమ్మా!

అవనినే భయపెట్టు
అమెరికా లోగుట్టు
అయ్యిందిలే రట్టు
ఓ కోకిలమ్మా!

తన శరీరము క్రింద
నలుపున్న గురివింద
చేసెనట పరనింద
ఓ కోకిలమ్మా!

సామ్రాజ్యవాదాలు
వైరిమత భేదాలు
వద్దులే ఇక చాలు
ఓ కోకిలమ్మా!

- అదృష్ట దీపక్

పిల్లల కోసం మీరు ఏం చేయాలంటే...

సబిత

మీ పిల్లల కోసం మీరేం చేస్తున్నారు?

అదేం ప్రశ్న మా పిల్లల కోసం మేమేం చెయ్యటం లేదు? తిండికి లోటు లేదు. మంచి మంచి బట్టలు కొంటున్నాం. మంచి బడికి పంపించి చదివిస్తున్నాం. ఆటలాడిస్తున్నాం. వాళ్ళ భవిష్యత్తు కోసం డబ్బు కూడబెడుతున్నాం. ఇక అంతకన్నా ఎక్కువ ఏం చెయ్యగలం?

ఆలోచించండి. ఇంకేం చెయ్యలేరా? కొంచెం సేపు దినపత్రిక పక్కన పెట్టి పిల్లల ముద్దుముద్దు మాటలు వినలేరా?

క్లబ్బుకి వెళ్ళడం మానేసి పిల్లల్ని షికారుకి తీసుకెళ్ళలేరా?

స్నేహితులను కలిసే బదులు పిల్లల్ని బజారుకో, మ్యూజియానికో, జూకో తిప్పచ్చుగా? రాత్రిపూట వేరే పనులు మాని పిల్లలకు కథలు కబుర్లు చెప్పి హాయిగా నిద్రపుచ్చితే బాగుండదూ? ఎలాంటి పరిస్థితిలోనయినా సరే పిల్లల్ని దండించకుండా నిగ్రహించుకోగలగాలి.

చెడు అలవాట్ల నుంచి, చెడు పుస్తకాల నుంచి వాళ్ళని మనం దూరంగా ఉంచాలి. ఆడంబరం కోసం నగలతో అలకరించకూడదు. వారికి సరిపోని, ఇష్టంలేని దుస్తులను ధరించాలని బలవంతం చేయకూడదు. పిల్లలు ఎప్పుడూ పరిశుభ్రత పాటించేలా కడిగిన ముత్యాల్లా కనబడేలా చూడాలి.

పిల్లలంటే ఇష్టం వున్నవాళ్ళు కొన్ని పనులు చేయకూడదు. వాళ్ళకి అడ్డు తగలకూడదు, అవమానించకూడదు. తినేటప్పుడు కోప్పడవద్దు. నిద్రపోయేటప్పుడు ఏడిపించవద్దు. ఇష్టం వచ్చినంత సేపు ఆడుకోనివ్వాలి. ఇది తినాలి, అది తినకూడదని ఆజ్ఞాపిస్తే ప్రయోజనం ఏమిటి? కొట్టి, కొట్టి నిద్రపుచ్చితే లాభమేముంది? మీ ఆనందానికి, సుఖాలకి అడ్డనుకుంటే అసలు పిల్లల్ని ఈ ప్రపంచంలోకి ఎందుకు రానిచ్చారు? రాత్రిపూట పిల్లలు మేలుకోవటం ఏ తల్లిదండ్రులకూ నచ్చని విషయం. కారణం ఏమిటి? వాళ్ళ కోసం రాత్రంతా జాగరణ చెయ్యాలనా? మరి సినిమాకో, షికారుకో వెళ్ళినప్పుడు! పేకాటతోనో, చదరంగంతోనో కాలక్షేపం చేసినప్పుడు. పుస్తకాలు చదివినప్పుడు మేలుకోలేదా? అవన్నీ లెక్కలోకి రావా?



పిల్లలకి పగలూ, రాత్రి, మధ్యాహ్నం, సాయంత్రం అన్న భేదాలు తెలియవు. వాళ్ళ సంతోషానికి కాలపరిమితి లేదు. సమయాసమయాలు లేవు. మనం పెద్దవాళ్ళుగా ఎదిగినప్పటినుంచే మన జీవితాల్లో రాత్రులనే అంధకారం అలుముకుంటుంది. అలాంటి అంధకారంలో కూడా పిల్లలకి వెలుగు కనిపిస్తుంది. నిష్కల్మష హృదయాలు వాళ్ళవి. వాళ్ళ మంచికోసం మనం *ఇంకా ఏం చెయ్యగలమంటే...* ఇరుగు, పొరుగు వారితో పోట్లాడకూడదు. చెడు స్వభావం కలవారు మన బంధువులయినా సరే దూరంగానే ఉంచాలి. మన కుటుంబంలో ఎవరికైనా దుర్గుణాలు ఉంటే అవి పోగొట్టేందుకు ప్రయత్నించాలి. మనలో దోషాలను తొలగించేందుకు దీక్ష పూనాలి. పిల్లల క్షేమం కోసం చివరికి తల్లినయినా, తండ్రినయినా దూరం చేయవలసి వస్తే సంకోచించకూడదు. పిల్లల కోసం ఇంటిని స్వర్గంగా మార్చాలనుకుంటే మీరు ఎంతటి త్యాగానికయినా సిద్ధపడాలి. క్రమశిక్షణ అనే బేడీలు, చదువు అనే సంకెళ్ళ నుంచి పిల్లలకు విముక్తి ప్రసాదించాలి. మన విశ్వాసాలు, ఆదర్శాలు, ఆలోచనలు వాళ్ళమీద *రుద్దకూడదు. అసలు ముందు ఈ* సమాజానికి దాసోహం అనకుండా ఉండటం మనం - పెద్దలం నేర్చుకోవాలి. ఆచారాలను, సంప్రదాయాలను, తరతరాలుగా అనుసరిస్తూ వస్తున్న పాత పద్ధతులను వదులుకోవాలి.

నేటి బాలలే రేపటి పౌరులు. మరి వీరి కోసం మనం ఏం చేయాలి? మన నుంచి వారు నేర్చుకున్నదే రేపు వారు ఆచరించబోయేదని మరిచిపోకూడదు. మనం నేడు త్యాగం చేసిన వాటినే రేపు వారు త్యాగం చేయగలరు. పిల్లలు భావితరానికి వెలుగునిచ్చే దీపాలు. మనం మనని తీర్చిదిద్దుకునేందుకు భగవంతుడు మనకు ప్రసాదించిన కాంతి పుంజాలు ఈ పిల్లలు. మనం వాళ్ళ గురించి అర్థం చేసుకోవలసిన విషయాలు - తినే వస్తువేదయినా ఇంకొకరు తినిపించకుండా స్వయంగా తిననిస్తే పిల్లలకు ఆనందం కలుగుతుంది. ఎత్తుకుని తీసుకు వెళ్ళకుండా నడిపించుకుంటూ తీసుకువెళితే పిల్లలకు సంతోషంగా ఉంటుంది. తాము స్వయంగా ఆడుకోవటంలో వారికున్న ఆనందం ఇంకొకరు ఆడిస్తే ఉండదు. "ఏది పాడమ్మా! అని" బలవంతంగా పాడిస్తే వాళ్ళకి ఇష్టం ఉండదు. వారికి ఇష్టమైనప్పుడు స్వేచ్ఛగా పాడటమే సంతోషాన్నిస్తుంది. తమ పనుల్ని తామే చేసుకోవడం వారికి ఇష్టం. సహజసిద్ధ అధికారాలను మరొకరు తీసుకుంటే పిల్లలు సహించరు. వారిని ప్రేమతో చేరదీసి కబుర్లు చెబితే, వారిని స్వేచ్ఛగా మెలగనిస్తే పరిపూర్ణ మానవులుగా వారు తయారవుతున్నారు. ☆

'పరివర్తన'

సుబ్బారావు మాష్టారు పట్నంలో ఉంటూ పల్లెటూళ్ళో ఉన్న స్కూలుకు రోజూ వెళ్తూ పాఠాలు చెప్పి వస్తుంటాడు. వాళ్ల స్కూలుకు ఆయనే హెడ్మాష్టరు. ఆయనకు ఇతర పనులేవో ఉండడం వల్లా, పట్నం నుండిరోజూ వచ్చిపోతుండడం వల్లా ఎప్పుడూ సమయానికి బడికి వెళ్ళేవాడు కాదు. ప్రార్థన ముగిసాక ఏ పావుగంటకో, అరగంటకో ఆయన బడికి చేరుకునేవాడు. అయితే సుబ్బారావుకు పాఠం బాగా చెబుతాడన్న మంచి పేరుంది.

ఓ రోజు ఆరవ తరగతిలో సైన్స్ పాఠం చెబుతున్నాడు సుబ్బారావు. 'ధూమపానం వలన అనేక నష్టాలున్నాయి. పొగాకులో ఉండే నికోటిన్ ఊపిరితిత్తులకు హాని చేస్తుంది. అనేక జబ్బులకు కారణమవుతుంది' అంటూ పాఠం పూర్తి చేశాక పిల్లలకు కొంత నోట్సు ఇచ్చాడు. పిల్లలు నోట్సు రాస్తుండగా ఆయన తరగతి గదిలోంచి వరండాలోకి వచ్చి జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి ఒక సిగరెట్ వెలిగించుకున్నాడు. రింగురింగులుగా పొగ వదలడం ఆయనకు ఒక అలవాటు. అలా సిగరెట్ తాగుతున్న సుబ్బారావు మాష్టారును కిటికీలోంచి పిల్లలు గమనిస్తూనే ఉన్నారు.



లంచ్‌టైమ్‌లో భోం చేశాక మూత్రశాల వద్దకు బయలుదేరాడు సుబ్బారావు. అక్కడ గోడ చాటుగా సిగరెట్ పొగ వస్తూ కనిపించింది. తాను తప్పా మిగతా ఉపాధ్యాయులెవ్వరూ సిగరెట్ కాల్చరని సుబ్బారావుకు తెలుసు. 'ఎవరై ఉంటారబ్బా' అనుకుంటూ గోడ చాటుకు వెళ్ళి ఆశ్చర్యపోయాడు సుబ్బారావు. ఆరోక్లాసు చదివే రవి సిగరెట్ కాలుస్తూ కనిపించాడు. మాస్టారును చూడగానే రవి తటాలున సిగరెట్ కింద పడవేశాడు. అతని కాళ్ళూ చేతులు వణకడం మొదలుపెట్టాయి. సుబ్బారావు కోపంతో 'ఏం పనిరా ఇది' అంటూ రవి మీదికి చెయ్యెత్తాడు ఓ దెబ్బ వేద్దామని. కానీ అతని మనసెందుకో ఆ పని చేయనీయలేదతన్ని. సుబ్బారావు అక్కడి నుండి వేగంగా ఆఫీస్సువైపు నడవసాగాడు. మూడో క్లాసు ముందు నుండి నడుస్తుండగా ఇద్దరు పిల్లల మాటలు అతని చెవిలో పడ్డాయి. 'ప్రధానోపాధ్యాయుడు అందరికన్నా ముందుగా బడికి వచ్చి బడిగంటలు కొట్టిస్తారని మనం చదువుకున్నాం కదరా ! మరి మన సుబ్బారావు మాస్టారు ఎప్పుడూ ఆలస్యంగా వస్తారెందుకో' అన్నాడొక విద్యార్థి. అందుకు రెండోవాడు 'ఏమోరా ! మనం ఆలస్యంగా వస్తే మాస్టారు బెత్తంతో కొడతారు. కానీ మన మాష్టార్లు ఆలస్యంగా వస్తే వారిని ఎవరూ ఏమీ అనరు కదా' అన్నాడు.

ఆ మాటలు విని సుబ్బారావు అవాక్కయ్యారు. అవమానం చెందిన వాడిలా తలదించుకొని నేరుగా తన ఆఫీసురూమ్‌లోకి వెళ్ళి కుర్చీలో కూర్చొని ఆలోచించ సాగాడు. పిల్లలు సాధ్యమైనంత వరకు ఉపాధ్యాయులు చెప్పే పనులు సమంజసమైనవే అని భావిస్తారు. చాలా వరకు ఉపాధ్యాయులనే అనుకరిస్తుంటారు. కాని ఒక ఉపాధ్యాయునిగా నేను చేసిందేమిటి? సిగరెట్ తాగడం వల్ల నష్టాలు ఉంటాయని చెబుతూనే సిగరెట్ తాగుతున్నాను. అందరికన్నా ముందు రావాల్సిన నేనే ఎప్పుడో కాని అలా పాఠశాలకు రావడం లేదు. ఇలా పరిపరి విధాలుగా అతని మనస్సు ఆలోచించింది. ఆ తర్వాత అతనెప్పుడూ బడికి ఆలస్యంగా రాలేదు. సిగరెట్ అలవాటును కూడా మానుకొని మంచిని ఆచరిస్తూ అదే అందరికీ బోధించ సాగాడు. ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరు తెచ్చుకున్నాడు.

-పెండెం జగదీశ్వర్



నాకు నచ్చిన వ్యక్తి 'భగత్‌సింగ్'

హలో ఫ్రెండ్స్,

నాకు భగత్‌సింగ్ అంటే ఎంతోఇష్టం. ఆయన మన దేశ స్వాతంత్ర్యంకోసం తన ప్రాణాల్నే త్యాగం చేసిన విప్లవవీరుడు. భగత్‌సింగ్ గురించి మనకందరికీ తెలిసినప్పటికీ నాకు తెలిసిన కొన్ని విషయాలు మీకు చెప్పాలనుకుంటున్నాను.

1907 అక్టోబర్‌లో పంజాబులో ఆయన జన్మించారు. భగత్‌సింగ్ తండ్రి కిషన్‌సింగ్. ఆయన కుటుంబం దేశభక్తిగల కుటుంబం. భగత్‌సింగ్ బాల్యంలో శివాజీ జీవిత చరిత్ర చదివి తాను కూడా శివాజీ వలే సైన్యాన్ని సమకూర్చుకొని యుద్ధం చేయాలనుకున్నాడు. అందుకే ఆయనకు కత్తులన్నా, తుపాకులన్నా చాలా ఇష్టం. ఆజాద్, శివవర్మ మొదలగు వారితో కలిసి ఆయన పనిచేశారు. 1926 తరువాత 'నవ జవాన్ భారత సంఘం'ను స్థాపించారు. ఎక్కువగా పార్టీ పనే చేస్తూ ఇంటికి ఆలస్యంగా వస్తుండేవాడు. భగత్‌సింగ్, భటుకేశ్వరదత్తు, సుఖదేవ్ కలిసి బ్రిటిష్ వారి అసెంబ్లీలో పైనుండి పొగబాంబు వేశారు. తర్వాత లోపలికి వెళ్ళి కరపత్రాలు విసిరి 'విప్లవం వర్ధిల్లాలి' అని నినాదాలు చేశారు. ఈ సంఘటనతో వారి ముగ్గురికి బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. చివరకు 1931 మార్చి 23న భగత్‌సింగ్‌ను ఉరితీశారు. ఇలా మనదేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ తన ప్రాణాలను ఇచ్చాడు.

-ఆలిసి నాగేశ్వర్‌రావు

9వ తరగతి, ఎస్.వి. హైస్కూల్, బంగారమ్మ గుడి వీధి
పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లా

ఒకే విధంగా ఉన్న రెండు ఏవి ?



చిన్నారి చిత్రకారులు



ఎల్. దీపక్, 7వ తరగతి
ఠాగూర్ విద్యాలయం, వైరా

సిహెచ్. అనూష, 5వ,తరగతి
మధురానగర్, హైదరాబాద్



జి. శ్రీలక్ష్మి, 5వ తరగతి
ఎస్‌విఎస్‌నికేతన్, చినకాకాని



సి. మాధవీలత, 10వ తరగతి
ఎంఎస్ నగర్, నంద్యాల



కలంస్నేహం

పేరు : కుంజా సంతోష్ కుమార్
వయస్సు : 13
చదువు : 9వ తరగతి
హాబీలు : స్టాంపులు, పాత నాణేలు సేకరించడం, కథలు చదవడం, క్రికెట్ ఆడటం, బొమ్మలు గీయడం, చెస్ ఆడటం
పూర్తి చిరునామా : సన్నాఫ్ కుంజా ధర్మారావు, ఇ.నెం : 17-1-62, భగవాన్‌దాస్ కాలనీ, భద్రాచలం, ఖమ్మం జిల్లా

పేరు : కె. కృష్ణమూర్తి
వయస్సు : 14
చదువు : 9వ తరగతి
హాబీలు : పాటలు పాడటం, పుస్తకాలు చదవడం
పూర్తి చిరునామా : కేరాఫ్ యు.పి.ఎస్., కుంట్లగూడెం, చౌటుప్పల్-508 116.

పేరు : మానేపల్లి మల్లిఖార్జునరావు
వయస్సు : 11
చదువు : 6వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడటం, మిమిక్రీ చేయడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ మానేపల్లి భానుమూర్తి, కేసరపల్లి (పో) గన్నవరం (మం) కృష్ణాజిల్లా - 521 102.

గణితం గమ్మత్తు

నేస్తాలూ,

ఈవారం మీకొక వింత సంఖ్యను పరిచయం చేయాలనుకుంటున్నాను. అంకెల్ని చూసి గాభరా పడకుండా వాటి మీద ఇష్టం పెంచుకుంటే ఎన్నో గమ్మత్తులు కనిపిస్తాయి. అంతేకాదు వాటిమీద మంచి ఆసక్తి కూడా కలుగుతుంది. అలాంటి ఓ అంకె గురించి ఈ వారం తెలుసుకుందాం. 10 చేత భాగిస్తే 9 శేషంగా వచ్చి, 9 చేత భాగిస్తే 8 శేషాన్నిచ్చి, అలాగే 7చేత భాగిస్తే 6, ఇలా....2 చేత భాగిస్తే 1 శేషంగా వచ్చే సంఖ్య 2519. 1 నుండి 9 వరకూ అన్ని అంకెలతోనూ భాగించి చూడండి. దీని వి'శేషం' ఏమిటో మీకే తెలుస్తుంది. అయితే ఇలాంటి సంఖ్య ఇదొక్కటే అనుకోనక్కరలేదు. ఇది అలాంటి వాటిలో ఒకటి మాత్రమే. ఇప్పుడు ఇలాంటి సంఖ్యను మీరు మరొకటి కనిపెట్టండి..ఉంటాను

మీ నేస్తం

బట్టా రామకృష్ణ, సౌత్ మోపూరు (గ్రామం), నెల్లూరు రూరల్ (మండలం), నెల్లూరు (జిల్లా)

మాటలకోట-30

అడ్డం

1. మమత లాంటిది (3)
3. ఆకాశం...వికృతి (3)
6. మునులు చేసేది (3)
7. ఖర్చిఫ్, జేబురుమాలు (2)
8. ధేనువు (2)
9. మత్స్యం (2)
10. తోట సంరక్షకుడు (4)
12. ఆగమని ఆదేశించండి (2)
14. వీళ్ళు కాకులని నానుడి (3)
16. గొడవ (3)
18. వెలలేని చాకిరీ (3)
21. తీగ (2)
22. టాబ్లెట్ (2)
24. మధ్య కోల్పోయిన చికాగో (2)
25. ఏదైనా కొనేటప్పుడు చేసేది (2)
26. అటు నుండి స్థలం (2)
27. రోగం (2)

నిలువు

2. ఆధారం, నిరూపణ (3)
3. ఆనపకాయ...1,3 (2)
4. కొందరు చిన్న చిన్న విషయాలకే ఇలా అంటుంటారు (2)
5. స్నేహం, చెలిమి (2)
6. పెరుగుటకు వ్యతిరేకం (3)
7. శీర్షాసనం వేసిన ఆపద (3)
8. '......హంసపాదు' (4)
10. చర్మం (2)
11. దసరాకు వీటి బెడద ఎక్కువ (3)
13. గురు,లఘువుల్లో ఏది సరిపోతే అది (3)
15. దీని కష్టాలు దీనివి (2)
17. ఇంగ్లీష్ మంచి (2)
18. గ్రామం (2)
19. ఈ పాలు గరిటెడైనా చాలట (4)
20. విరామచిహ్నం (2)
21. తెల్లగా (3)
23. తడబడ్డ కఠోరం (3)

1	2		✿	3	4		✿	5
✿		✿	6			✿	7	
8		✿		✿	✿	9		✿
	✿	10		11		✿	12	13
14			✿		✿	15	✿	
	✿	✿	✿		✿	16	17	
✿	18		19	✿	20	✿		✿
21		✿		✿	22		✿	23
	✿	24		✿	✿	✿	25	
26		✿		✿	27		✿	

గత వారం జవాబులు

మాటలకోట-29

అడ్డం : 2. పందారం 4. జమానా 6. గుడి 8. తరంగం 9. రావి 11. మేనత్త 12. మోత 14. తోలు 15. తుది 16. ఇంతి 18. బాలుడు 19. గులాబీ 21. అమృతం 22. దానం

నిలువు : 1. నవ్వుత 2. పంచాంగం 3. రంగు 5. మాతోరా 7. డిబిత్తకొ 10. విడిది 14. తోడేలు 15. తుమ్ములు 16. ఇంటిగుట్టు 17. సమాధానం 18. బావి 20. సొంతం

పట్టిందల్లా బంగారమే

అంపశయ్య నవీన్



"కొంపమునిగిందండీ!" అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

"ఎవరికొంప?" అన్నాన్నేను.

"ఎవరికొంపో కాదు. మా కొంపే!"

"ఏమైందో చెప్పండి"

"మా దగ్గరి బంధువుల బ్బాయొకడుండేవాడు... వాళ్ళు మొదట్లో పెద్ద డబ్బున్న వాళ్ళేం కారు... ఈ అబ్బాయి పెద్దగా చదువుకోలేదు. మా వాడు చదువుకోలేదని వాడి తల్లిదండ్రులు చాలా బాధపడిపోతుండే వాళ్ళు... కానీ ఆ అబ్బాయికి పదిహేడు పద్దెనిమిదేళ్ళు రాగానే చిన్న చిన్న వ్యాపారాలు చెయ్యడం మొదలెట్టాడు. మొదట్లో కొందరు షాపుల వాళ్ళను పరిచయం చేసుకొని వాళ్ళకు కొన్ని చిన్న చిన్న పనులు చేసి పెట్టేవాడు. షాపుల వాళ్ళు ప్రతిరోజూ కొంత డబ్బును బ్యాంకులకో, ఇతర ఫైనాన్స్ కంపెనీల వాళ్ళకో చెల్లించవలసి ఉంటుంది కదా... ఆ డబ్బులు నేను వెళ్ళి కట్టొస్తానని షాపుల వాళ్ళ దగ్గర తీసుకునే వాడు... అలా రోజూ యాభై అరవై షాపులు తిరిగి వాళ్ళ దగ్గర డబ్బులు తీసుకొని ఎవరెవరికి ఆ డబ్బులు చెల్లించాలో వాళ్ళకు చాలా నమ్మకంగా చెల్లించి రశీదులు తెచ్చి షాపుల వాళ్ళకిచ్చేవాడు... అలా ప్రతిరోజూ కొన్ని లక్షల రూపాయలు ఇతని చేతుల మీదుగా వెళ్తుండేవి. ఈ పని చేసిపెట్టినందుకు ప్రతిషాపువాడు ఇతనికి ఇతడు వాళ్ళ దగ్గర్నుంచి తీసుకెళ్తున్న మొత్తంలో కొంత పర్సంటేజీని కమిషన్‌గా చెల్లించేవాళ్ళు... ఇట్లా ఓరెండు మూడేళ్ళు గడిచేటప్పటికి వాడి చేతికి చాలా డబ్బొచ్చింది. ఆ డబ్బుతో వాడేం చేశాడో తెలుసా? స్వంతంగా ఓ ఫైనాన్స్ కంపెనీ ప్రారంభించాడు. అదీ బాగానే కలిసొచ్చింది.. తన కంపెనీలో డబ్బు డిపాజిట్ చేస్తే మామూలు బ్యాంకులిచ్చే వడ్డీ కంటే చాలా ఎక్కువ వడ్డీ ఇస్తానని తనకు తెలిసిన షాపుల వాళ్ళందరికీ చెప్పాడు. దాంతో డబ్బున్న వాళ్ళు చాలా మంది అతని కంపెనీలో లక్షలకు లక్షలు దాచుకోవడం మొదలెట్టారు. ఆ డబ్బును ఇతడు వేరే వాళ్లకు యింకా ఎక్కువ వడ్డీకిచ్చి బోల్డు లాభాలు సంపాదించడం మొదలెట్టాడు... అందరికీ ఇతని మీద... వాడిపేరు రమేష్... బోల్డు నమ్మకం కుదిరింది. లక్షలకు లక్షలు రావడం.. అవి మళ్ళీ ఇతడిచ్చే అప్పుల రూపంలో బయటకు వెళ్ళడం జరుగుతుండేది – ఈ రమేష్ ఇంతటితో ఊరుకున్నా బావుండేది... తన వ్యాపారాన్ని ఇంకా విస్తరించాడు.... కొత్త కొత్త కంపెనీలు ప్రారంభించాడు. సినిమా వాళ్ళకు అప్పులు పెట్టడం మొదలు పెట్టాడు... అందరూ అతన్నో సినిమా తియ్యమన్నారు. రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రారంభించమన్నారు.. అపార్ట్‌మెంట్స్ కట్టించి అమ్మమన్నారు... రమేష్ ఈ వ్యాపారాలన్నీ చేశాడు... అతని బిజినెస్ కోట్లకు చేరింది... అతనికి సమాజంలో బోల్డు గౌరవం ఏర్పడింది... ఇక్కడికి ఏ వి.ఐ.పి. వచ్చినా మొట్టమొదట రమేష్‌ను కలుసుకోవాల్సిందే! రచయితలు, పత్రికా సంపాదకులు, బ్యాంకు మేనేజర్లు, సినిమా నిర్మాతలు, సినిమా యాక్టర్లు, పెద్ద పెద్ద డాక్టర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, వైస్ ఛాన్సలర్లు, మంత్రులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు... ఇలా అందరికీ రమేష్ చాలా దగ్గరి మిత్రుడైపోయాడు.. వీళ్ళందరూ అతడు ప్రారంభించిన ఏదో ఓ కంపెనీలో షేర్లు కొనడం మొదలెట్టారు. అమెరికాలో వున్న మా అబ్బాయిక్కూడా రమేష్ ఎంత గొప్పవాడో తెలిసిపోయింది. రమేష్ పట్టుకున్నదల్లా బంగారమైపోతుందని మా అబ్బాయికి ఇక్కడివాళ్ళెవరో ఫోన్ చేసి చెప్పారట. అంటే ఈ రమేష్ అనే వాడి పేరు ప్రఖ్యాతులు అమెరికా దాకా ప్రాకాయన్నమాట... దాంతో మా అబ్బాయి నాకో పదివేల డాలర్లు పంపించి వాటిని రూపాయలుగా మార్పించి రమేష్ కొత్తగా ప్రారంభిస్తున్న రెడీమేడ్ గార్మెంట్స్ కంపెనీలో షేర్లు కొనమన్నాడు. నేను అలాగే రమేష్ కొత్తగా ప్రారంభించిన కంపెనీ షేర్లు కొన్నాను. ఇది జరిగి సంవత్సరం దాటిపోయింది.. ఇప్పుడే ఓ పిడుగులాంటి వార్త తెలిసింది".. అన్నాడు పుల్లారావు మొఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ...

"ఏమిటావార్త?"

"రమేష్ కంపెనీలన్నీ దివాళా తీశాయట. అతడు ఐ.పీ. పెట్టేసి ఎక్కడికో ఎవరికీ తెలియని చోటికి ఉడాయించేశాట్ట... అతని ఆస్తులనన్నింటినీ కోర్టువాళ్ళు స్వాధీనం చేసుకున్నారట... అతని కంపెనీల్లో కోట్లకు కోట్లు పెట్టుబడి పెట్టిన చాలా మందికి ఈ వార్త తెలియగానే గుండెపోటు వచ్చిందట... ఒకాయన పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందిట... అస్సలు సంగతేమిటంటే అతని పరిస్థితి చాలా రోజుల్నుండే బాగా లేదట... కానీ త్వరలోనే కోలుకోలేకపోతామా అన్న ధీమాతో కొత్తకొత్త వ్యాపారాల్ని ప్రారంభిస్తూ బయటి వాళ్ళకు రమేష్ కంపెనీలన్నీ సవ్యంగానే ఉన్నాయన్న అభిప్రాయాన్ని కల్గించాడు... బిగ్‌షాట్స్ అందరూ అతనికి చాలా దగ్గరివాళ్ళు కావడం... వాళ్ళతో ఇతడెప్పుడూ భుజాలు రాసుకుతిరుగుతుండటం... చాలా హైప్రొఫైల్ లైఫ్‌స్టైల్ మెయిన్‌టెయిన్ చెయ్యడం... ఈ కారణాల వల్ల రమేష్ త్వరలోనే దివాళా తీయబోతున్నాడన్న అనుమానం ఎవ్వరికీ కల్గలేదు... ఓ ఫైన్ మార్నింగ్ రమేష్ బోర్డు తిప్పెయ్యక తప్పలేదు. ఐ.పీ. పెట్టకా తప్పలేదు. మా వాడు నాలుగైదు కోట్లకు మునిగాడు. మావాడే కాదు... అతని భుజాలు రాసుకొని తిరిగిన చాలామంది బిగ్‌షాట్స్ కూడా మునిగారు.. ఈ రమేష్‌గాడు ఎక్కడో అక్కడ ఆగిపోతే ఇంతమంది మునిగేవాళ్ళు కారు... ఒక వ్యాపారంలో లాభాలొస్తున్నప్పుడు ఆ వ్యాపారానికే పరిమితమైపోతే బాగుండేది. ఒకదాని తర్వాతొకటి... కొత్తకొత్త కంపెనీలు తెరుస్తూ పోయాడు... అతడు పట్టుకున్నదల్లా బంగారమౌతున్నదని కొందరు పనిగట్టుకొని ప్రచారం చెయ్యడంతో జనం నమ్మి వాళ్ళ డబ్బంతా ఇతని చేతిలో పెట్టారు..."

"డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డవాళ్ళంతా ఇలాగే చేస్తుంటారు. డబ్బొస్తోంటే ఇంకా రావాలనుకుంటారు.. అదో వ్యసనంగా మారుతుంది.. తాగుబోతుకు ఎంతతాగినా తృప్తి ఉండదు. పేకాటాడే వాడికి ఎంతసేపాడినా ఇంకా ఆడాలనే అనిపిస్తుంటుంది... డబ్బనేది ఒక మంచి సేవకుడు మాత్రమే... దాన్నెప్పుడూ మన కంట్రోల్లో పెట్టుకోవాలి తప్ప మనం దాని కంట్రోల్లోకెళ్ళకూడదు... "మనీ ఈజ్ ఎ గుడ్ సర్వెంట్ బట్ ఎ బ్యాడ్ మాస్టర్" అన్నారు... చాలా మంది డబ్బునో యజమానిగా మార్చేసి దానికి దాస్యం చేస్తుంటారు... డబ్బు అనేది మనిషి సుఖంగా బతకడానికి కావలసిన ఒక సాధనం మాత్రమే తప్ప డబ్బు డబ్బు కోసమే కాదు... కానీ మీ రమేష్ లాంటి కొందరు అపరిమితంగా డబ్బు సంపాదించటాన్నే లక్ష్యంగా పెట్టుకుంటారు... పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు ఏమీలేని దశ నుండి ఎంతో ఉన్నత దశ వరకు పెరిగి మళ్ళీ ఏమీలేని దశకు చేరుకుంటారు. నాకు ఆశ్చర్యం కల్గించే విషయమేమిటంటే యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పత్రికా సంపాదకులు, బ్యాంకు మేనేజర్లు లాంటి ఎంతో విజ్ఞానవంతులు, తెలివితేటలున్న వాళ్ళు కూడా ఇంత సులభంగా మోసపోవడం! అంటే సులభంగా డబ్బు సంపాదించవచ్చునన్న ఆశ కల్గిందంటే ఎవరైనా మోసపోతారన్న మాట! అమెరికాలో ఉన్న మీ కొడుకు కూడా ఇలాంటి ప్రలోభానికి లోనుకావడం.... షాకింగ్!" అన్నాన్నేను. ☆

పెళ్ళి బేరాలు

లక్ష్మి

పెళ్ళి చేసుకుని ఇల్లు కట్టుకుని హాయిగా కాలం గడపాలోయ్ - అంటూ ఒక పాత సినీమాలో అందమైన పాటొకటి వుంది. ఆ రోజుల్లో - పెళ్లి చేసుకోడం, ఇల్లు కట్టుకోడం అతి సింపుల్ వ్యవహారాలని కవిగారి ఉద్దేశం కాబోలు! వారిని నేను తప్పు బట్టడం లేదు. ఈ దిక్కుమాలిన రోజుల్లో ఇల్లు కట్టుకోడం సులువేమోగాని - ఆడపిల్లకి పెళ్లి చేయడం ఒక మహాయజ్ఞంగా మారిపోయింది. ముప్పై ఏళ్లు వచ్చి కూడా పెళ్లికాని ఆడపిల్లలు చాలా ఎక్కువ సంఖ్యలో వున్నారనే చెప్పాలి. మా దగ్గిర బంధువుల్లోనే దాదాపు అరడజను మంది ఆడపిల్లలు వున్నారు. అందం, చదువు, గుణం అన్నీ సలక్షణంగా వుండి కూడా వాళ్లకి పెళ్లిళ్లు కావడం లేదు. దిక్కుమాలిన జాతకాలు కుదిరి చావనందున వాళ్ల పెళ్లిళ్లకు బ్రేకులు పడుతున్నాయి! చంద్ర మండలంలో మనిషి అడుగు పెట్టిన ఈ కాలంలో యింకా జాతకాలను విడిచిపెట్టడం లేదంటే ఈ జాతినేమనాలి? జాతకాలను పక్కన పెట్టండి. అంతకంటే పెద్దగండం - కట్నం! అబ్బాయి అమెరికాలో వున్నాడంటే - అతని రేటు ఆరేడు లక్షలు పలుకుతోంది! అనకాపల్లిలో వున్నా అంకెలు లక్షల్లోనే వుంటున్నాయి! వృత్తి జేబులు కొట్టడమని పబ్లిగ్గా చెప్పినా అబ్బాయి ధర పాతిక ఏభై వేలంటున్నారు! సామాన్యుడు అంతంత కట్నాలు పోసి అల్లుళ్లను కొనుక్కోడం సాధ్యమవుతుందా? అప్పు చేసి పెళ్లి చేసి - అప్పు తీర్చే మార్గం లేక - ఆత్మహత్యతో బతుక్కి చుక్క పెట్టేసుకుంటున్న సంఘటనలు ఎన్ని లేవు?

అదట్లా వుంచండి. పెళ్లి చూపుల సీన్లో పెళ్లి కొడుకుదే పై చెయ్యిగా వుంటుంది. పెళ్లివారు అద్దె కారులోంచి దిగగానే - ఆడపిల్లవాళ్ల గుండెల్లో గూడ్సురైళ్లు పరుగెడుతూ వుంటాయి. వచ్చిన వాళ్లకి కాళ్లకు నీళ్లూ, కాఫీ టిఫిన్లూ వగైరా ప్రాథమిక మర్యాదలతో పాటు వాళ్లేం సెలవిస్తారో వినేందుకు చేతులు కట్టుకు నిలబడతారు. ఊరెళ్లి కబురెడతామని వాళ్లంటారు. ఆ క్షణం నుంచీ ఒకటే సస్పెన్సు. పెళ్లి చూపుల్లో పిల్లని చూసినప్పుడు పిల్లవాడి రియాక్షన్లు ఎలా వున్నాయో సింహావలోకనం చేస్తారు. మొహం చిట్లించి విసుక్కున్నాడో - పెదవి మీద చిరునవ్వు వెలిగించేడో గుర్తు చేసుకుంటారు. అమ్మాయి పాడుతున్నప్పుడు ప్రసన్నంగా విన్నాడో - కణతలు నొక్కుకున్నాడో ఆరాలు తీస్తారు. అబ్బాయి వ్యవహారం అనుకూలంగా వున్నా అతని పెద్దల మాటేమిటని గుసగుసలాడతారు. తామిచ్చే కట్నానికి ఓయస్సంటారో లేక వద్దుపొమ్మంటారో తెలీదు. ఆడపడుచు లాంఛనాలు ఘనంగా వున్నాయని తృప్తి పడతారో ముష్టి వ్యవహారమని మూతి ముడుచుకుంటారో ఊహకు అందదు. ఇన్ని ఆలోచనల మధ్య ఆడపిల్లను కన్నవాళ్లకి నిద్రాహారాలు కరువవుతాయి! ఇన్ని ఆందోళనల మధ్య ఆ పిల్ల పెళ్లి జరిగిందే అనుకుందాం!

కట్నం బాకీతో అత్తవారింటికెళ్లిన ఆడపిల్ల రోజుకో చావు చస్తూ బతకాల్సిందే! దినదినగండం బతుకు బతకలేక కొందరు ఆడపిల్లలు కిరసనాయిలు వంటిమీద పోసుకుని తగలడిపోవడం కూడా మనకి బాగా తెలిసిన విషయమే గదా! జలగండం వుందనే భయంతో ఒక ఆడపిల్ల సగం ఎండిపోయిన కాలవలో అడుగు పెట్టేందుకు భయపడుతుంటే - ఆడపిల్లకి జలగండాల కంటే మొగుడి గండాలెక్కువని ఇంకోఆడపిల్ల ధైర్యం చెప్పిందిట. వదిలేయండి. ప్రేమ వివాహాలూ, ఆదర్శ వివాహాల్లో కట్నం గండాలుండవు. ఈ దిక్కుమాలిన రోజుల్లో అల్లాంటి వివాహాలే బెటరు! కట్నం పట్టింపులుండవు. అంచేత నచ్చినవాడ్ని ప్రేమలోకి దించి పెళ్ళి చేసుకోండని ఆడపిల్లల్ని ఎంకరేజ్ చేయడవే ఉత్తమ మార్గంగా కనిపిస్తోంది. ఈ పద్ధతి తప్పో ఒప్పో అడక్కండి. అవివాహితగా అరవై ఏళ్లు బతికి కన్ను మూయడం కంటె ప్రేమ వివాహాలే బెటరని చెబుతున్నాను. కట్నం పేరిట వేలూ లక్షలు గుమ్మరించి గుండెపోటు తెచ్చుకునే వాళ్లకిది పెద్ద ఓదార్పే అవుతుంది!

పూర్వం రోజుల్లో కన్యా శుల్కాలుండేవి. ఆడపిల్లలకి కట్నాలిచ్చి పెళ్లి చేసుకునేవారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకి మంచి గిరాకీ వుండేది కాబోలు! మగవీరులంతా తమ పెళ్లిళ్ల కోసం పోటీలు పడి కొట్టుకు చచ్చేవారు! మళ్లా ఆ రోజులొస్తే ఎంత బావుండునని ఆడపిల్లలు ఆశపడటంలో తప్పు లేదు. స్వయంవరాల గురించి మనకి తెలుసు. ఫలాన పిల్లని మేము చేసుకుంటాం మేము చేసుకుంటామని మగపిల్లలు పోటీలు పడుతున్నప్పుడు - సదరు ఆడపిల్ల ఆ మగ గుంపులోంచి తనకి నచ్చిన వాడ్ని ఎంచుకుని పెళ్లి చేసుకునేదిట! రాజకుమార్తె సరే సరి! తనని పెళ్లాడదలుచుకున్న రాజకుమారుల గుంపు వరసలో నిలబడాలి. వాళ్లకి బలపరీక్షలు జరిగేవి. ఆ పరీక్షల్లో నెగ్గిన వాడి మెళ్లో రాజకుమార్తె దండవేసి - ఇతగాడే నాకు నచ్చిన వాడని ప్రకటించేది. ఆ పరీక్షలు రకరకాలుగా జరిగేవి. నెత్తిమీద బాగా ఎత్తున గిరగిరా తిరిగే చేప తాలూకు కంటిని గురి చూసి బాణంతో కొట్టిన వాడే. నా కుమార్తెకు తగిన వరుడని ఒక రాజుగారు ప్రకటిస్తే విలువిద్యలో బాగా ఆరితేరిన రాకుమారులు అనేక మంది క్యూలో నిలబడ్డారు. ఆ ఛాన్సు అర్జునుడికి మాత్రమే తగిలింది!

సాక్షాత్తు శ్రీరామచంద్రుడు కూడా తన భుజబలం ప్రదర్శించే సీతమ్మను పెళ్లాడేడు. ఆ మాటకొస్తే రాములవారికి వారి బాల్యం నుంచీ గొప్ప బలశాలిగా పేరుండేది! అంతమాత్రాన మా అమ్మాయిని పెళ్లి చేసుకో శ్రీరామా అని ఏ రాజుగారూ రాముడ్ని ప్రాధేయపళ్లేదు. జనకమహారాజు కూడా తొందర పడలేదు. నువ్వు శ్రీరాముడివే కావచ్చు. సాక్షాత్తు దేవుడివే కావచ్చు. ఆ పాయింటు నాకనవసరం. మా యింటో మా అమ్మాయి ఆడుకునే శివధనుస్సుంది. ఆ ధనుస్సు విరిచే వీరుడికే సీతనిచ్చి కళ్యాణం చేస్తానని బోర్డు కట్టేడు. ఏతావాతా ఆరోజుల్లో ఆడపిల్లకి ఆపాటి విలువ వుండేది. ఈ రోజుల్లో కూడా చెదురు మదురుగా జనకమహారాజులున్నారని తెలిసి నేను ఆనందిస్తున్నాను. మహారాష్ట్రలో రూప్‌సింగనే వ్యాపారస్థుడు అపర జనక మహారాజు మాదిరి ప్రకటన చేసేదని వార్త. తన పాత ఆస్టిన్ కారు బాగు చేసిన ప్రజ్ఞావంతుడికి తన కుమార్తెనిచ్చి పెళ్లి చేస్తానన్నాడు. ఆ ఆస్టిన్ కారుకి చిన్న చరిత్ర వుంది. సింగుగారి తండ్రికి అలనాడెప్పుడో - ఒక బ్రిటీషు సుందరి ఆ కారుని బహుమతిగా యిచ్చిందిట. కాలం చెల్లిన ఆ కారు యిప్పుడు మూలుగుతూ మూలన పడగా - దాన్ని బాగు చేయడం ఎవ్వరి తరమూ కాలేదు. అందుకే - దాని రిపేరు తన కుమార్తె పెళ్లితో ముడిపెట్టేడు సింగుగారు. చాలామంది ప్రయత్నించేరు గానీ ఫెయిలైపోయేరు. చివరికి ఛార్లెస్ అనే యువకుడు ఆ కారుని బాగు చేసి సింగుగారికి అల్లుడయ్యేట్ట! అదీ విషయం. ఈ పద్ధతి బాగా పాప్యులరైతే - ఆడపిల్లల తల్లిదండ్రులు అదృష్టవంతులవుతారు. మన యింటికి సుందరంగా సున్నం వేసినవాడే అల్లుడవుతాడని ఎంచక్కా ప్రకటనయిచ్చి సున్నం ఖర్చు ఆదా చేసుకోవచ్చు! పైసా ఖర్చు లేకుండా చొట్టలు పడ్డ బిందెలూ తప్పేలాలూ తదితర వస్తు సామాగ్రిని బాగు చేయించుకోవచ్చు. తోట పనులు కూడా అంటగట్టవచ్చు. ఒక్కటేమిటి? ఆశిస్తున్న పద్ధతి అమల్లోకి వస్తే కాబోయే అల్లుళ్ల చేత మన సొంత పనులు సవాలక్ష లక్షణంగా చేయించుకోవచ్చని మంగ తాయారు చెప్పినప్పుడు నేనెంతో సంతోషించేను! ☆

సైబీరియా నుండి గుంటూరు!

విహంగ విహార క్షేత్రంగా ఉప్పలపాడు

వేణుగోపాల్ తలతోటి



అక్కడికి వెళితే మనం భారతదేశంలో ఉన్నామనే స్పృహే ఉండదు! ఎటుచూసినా చక్కర్లు కొట్టేపక్షులు... మునుపెన్నడూ చూడని విచిత్ర విహంగాలు తలలపై విహరిస్తూ, విన్యాసాలు చేస్తుంటాయి. అవికూడా భారీ సైజులో ఉండటంతో నోరు వెళ్ళబెట్టి చూడ్డం మనవంతవుతుంది!. మానసిక ఉల్లాసంతో మనమూ వాటితో విహరిస్తాం!. కొల్లేరు సరస్సు, పులికాట్ సరస్సుల్లో మాదిరి ఇక్కడ బైనాక్యులర్స్‌తో పక్షుల్ని చూడాల్సిన అవసరంలేదు. అతి సమీపంలో ఉండి వాటిని గమనించవచ్చు. పక్షి గూళ్ళలో ఉన్న గ్రుడ్లను సైతం మనం చూడొచ్చు!. అదే ఉప్పలపాడు చెరువు ప్రత్యేకత!.

మాఎదురుగా ఉన్న చెరువు చుట్టూరా ఉన్న తుమ్మ చెట్లపై గుంపులు గుంపులుగా వలసపక్షులు చేరాయి. గూళ్ళు కడుతూకొన్ని, గుడ్లు పొదుగుతూకొన్ని, రెక్కలు రాని పక్షి పిల్లల్ని సాకుతూ కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి. సాయంత్రం 5-30 తరువాత వేల సంఖ్యలో పక్షులు గుంపులు గుంపులుగా వస్తాయని గ్రామస్తులు చెపితే, మిద్దె మీదెక్కి వాటికోసం ఎదురుచూస్తున్నాము. ఉన్నటుండి ఒక్కసారి చీకట్లు కమ్మాయి. అనుకోని విధంగా ఒక పెద్ద మేఘం మమ్మల్ని ఆవరించింది. మేమందరం ఉలిక్కిపడి ఒక్కసారిగా తలలు పైకెత్తి చూశాం. ఆకాశం నుండి వందల సంఖ్యలో పక్షులు క్రిందికి దిగుతున్నాయి. విశాలంగా పరుచుకొన్న రెక్కలు, మూరెడు పొడవున్న కొడవలి ముక్కులతో, ఒక్కొక్కటీ పది నుండి పాతిక కేజీల బరువుతో భారంగా దిగుతున్నాయి. నీరుకాయ పంచెలు కట్టి అక్షర జ్ఞానం తెలియని గ్రామస్తులు సైతం 'ఇది ఫలానా, ఇది ఫలానా' అంటూ ఆరితేరిన ఆర్నితాలజిస్టులా పక్షుల పేర్లు, వివరాలు చెపుతున్నారు. విస్తుపోవటం మావంతైంతి!.

గుంటూరు నగరానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుగ్రామం ఉప్పలపాడు. ప్రతి సంవత్సరం ఇక్కడికి సైబీరియా, ఆస్ట్రేలియా, సౌత్ యూరప్, చైనా, మలేషియా నుండి పక్షులు వస్తుంటాయి. అక్టోబర్, నవంబర్ మాసాల్లో సుమారు 45 జాతులకు చెందిన పక్షులు ఇక్కడికి చేరుకొని జనవరి మాసాంతంలో సంతతిని పెంచుకొని, పిల్లాజెల్లతో తిరుగు ప్రయాణం కడతాయి. పది ఎకరాల్లో విస్తరించిన ఉప్పలపాడు చెరువులోపల ఎండిన మోడులు, చెరువు చుట్టూరా ఉన్న ఇంగ్లీష్ తుమ్మచెట్లపై ఇవి గూళ్ళు కట్టుకొంటాయి. నవంబర్‌లో రావలసిన 'పెలికాన్' పక్షులు ఈ ఏడాది అక్టోబర్ రెండవ వారంలో రావటంతో మిగిలిన పక్షులకు తలనొప్పిగా మారింది. ఇవి 20 నుండి 25 కేజీల బరువుతో, 3 అడుగుల ఎత్తుతో ఉండటంతో వీటి బరువుకు చెట్లకొమ్మలు ఒంగిపోతుంటాయి. పైగా ఇవి ముక్కులతో ఎక్కడ పొడుస్తాయో నన్న భయంతో చిన్న పక్షులయిన కెటిల్ గ్రేట్స్, లిటిల్ గ్రేట్స్, పాండ్ హెరాన్స్ కష్టపడి కట్టుకున్న గూళ్ళు ఖాళీ చేసి మరో చెట్టు నాశ్రయిస్థాయి. గ్రుడ్లను, పిల్ల పక్షులను రక్షించకోటానికి పక్షులన్నీ ఇంగ్లీష్ తుమ్మ చెట్లపైనే గూళ్ళు కడతాయి. చెరువుకు అతి సమీపంలో పెద్దపెద్ద వృక్షాలు పెరిగి శాఖోపశాఖలుగా విస్తరించినప్పటికీ వాటిపై వలసపక్షులు గూళ్ళు కట్టక పోవటంతో గ్రామస్తులు చెరువుకు మూడు వైపులా ఇంగ్లీష్ తుమ్మచెట్లను ప్రత్యేకించి పెంచుతున్నారు. వలసపక్షుల్లో పెలికాన్, స్పూన్‌బిల్, గ్రే హెరాన్, బస్టార్డ్స్ వంటి మరెన్నో అరుదైన పక్షులు కూడా ఇక్కడికి రావటంతో ప్రత్యేకత సంతరించుకొంది. అరుదైన 'పెలికాన్' పక్షులు ఆసియా ఖండంలో పది వేలుంటే ఇక్కడే మనకు రెండు వేలకు పైగా కనిపిస్తున్నాయి!.

వీటిలో స్పాటెడ్ బిల్డ్ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పెలికాన్స్ కూడా ఉన్నాయి. గబ్బిలాలు, గుడ్లగూబల మాదిరి రాత్రి సమయంలో తిండికోసం తిప్పలుపడే నైట్ హెరాన్స్ ఇక్కడ పాతిక వరకు కనిపిస్తున్నాయి. అక్టోబర్ రెండవ వారంలో గ్రే హెరాన్‌లు రెండు జతలు ఇక్కడికి రావటంతో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వైట్ ఐబిస్, బ్లూజి ఐబిస్, ఓపెన్ బిల్డ్ స్టార్స్, పర్పుల్ మూర్ హెన్, మరెన్నో ఇక్కడి యాత్రీకులకు కనువిందు చేస్తున్నాయి.

అరుదైన పక్షులు ఇక్కడికి నిర్భయంగా చేరుకోటానికి గ్రామస్తుల ఆదరణే ప్రధాన కారణం. కొన్నేళ్ళ క్రిందట కొందరు వ్యక్తులు ఇక్కడి వలసపక్షులను వేటాడి కెజీ మాంసం 15 రూపాయల చొప్పున గుంటూరు హోటళ్ళకు సప్లై చేశారు. ఇది తెలిసిన గ్రామస్తులు పక్షులను వేటాడి చంపిన కిరాత కులను పట్టి పోలీసులకు అప్పగించి దేహశుద్ధి చేయించారు. దీంతో వలస పక్షులపై రాయి విసిరే ధైర్యం కూడా ఎవ్వరికీ లేక పోయింది. గతంలో మాదిరి వలస వచ్చే పక్షుల సంఖ్య తగ్గటంతో ఇక్కడి గ్రామస్తుల గుండెల్లో గుబులు రేగింది. పక్షుల పోషణకోసం ఏడాదికి 30 వేల పైచిలుకు ఆదాయం వచ్చే చేపల చెరువును లీజుకివ్వకుండా గ్రామ పంచాయితీ వదిలేసింది. వలసపక్షుల అభివృద్ధికి చందాలు ఇవ్వటానికి కూడా గ్రామస్తులు సిద్ధంగా ఉన్నారు. పర్యాటకుల కోసం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బైనాక్యులర్స్, పక్షి శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు గ్రామస్తులు సేకరించి పెట్టారు. జనవరిలో రెండవ పంట మినుము వేసేందుకు రైతులు పొలాలు దున్నే సమయంలో వలసపక్షులు క్రిమికీటకాదులను ఏరుకుతిని పంటలకు రక్షణ కల్పిస్తున్నాయి. పొడవాటి కొడవలి ముక్కులు కలిగిన వైట్ ఐబీస్ బురదలోని పురుగులను సైతం వెంటాడి తింటూ చీడ-పీడల నుండి ఇక్కడి రైతుకు రక్షణ కల్పిస్తున్నాయి.

ప్రభుత్వ పరంగా పక్షులకు ఆదరణ కరువైంది. అటవీశాఖ అధికారులు గ్రామస్తుల పోరు పడలేక నామమాత్రంగా రెండు బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు. వ్యాపార ధృక్పథంతో ప్రభుత్వం ఆలోచించి 'వలసపక్షుల విహార కేంద్రాన్ని' ఏర్పాటుచేస్తే దానికి తాము వ్యతిరేకిస్తామని గ్రామస్తులు నిష్కర్షగా చెబుతున్నారు. పక్షులను చూసేందుకు వచ్చే పర్యాటకులకు పరిధులు విధించి, పక్షి కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ☆



విలక్షణ క్రికెటర్లకు 'నెలవు' హైదరాబాద్

మారేపల్లి లక్ష్మణ్

భారత క్రికెట్ చరిత్రలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం వుంది. హైదరాబాద్ లేని భారత క్రికెట్‌ను ఊహించడం కష్టం. సొగసైన స్ట్రోక్ ప్లేయర్లు, మేటి స్పిన్నర్లను దశాబ్దాల తరబడి భారత క్రికెట్‌కు అందిస్తూ దేశంలోని ప్రధాన క్రికెట్ కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ గుర్తింపు పొందింది. క్రికెట్ అందరూ ఆడగలరు, పరుగులూ చేయగలరు...... అయితే కొందరే 'సొగసైన'రీతిలో, 'నాజూకైన'తీరులో 'స్ట్రోక్'లు ఆడుతూ 'స్టయిలిష్ క్రికెటర్లు'గా, 'క్రికెట్ ఆర్టిస్టులుగా' హైదరాబాదీలు పేరుతెచ్చుకున్నారు. నిన్నటి తరం దిగ్రేట్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ (జూనియర్), ఎం.ఎల్.జయసింహ, మహ్మద్ అజారుద్దీన్, ఇప్పటి వి.వి.ఎస్.లక్ష్మణ్ వీరంతా క్రికెట్ ఆడడాన్ని ఒక కళగా ప్రపంచానికి చాటిచెప్పారు. కదలికల్లో హుందాతనం, ఫ్లిక్ షాట్లలో మణికట్టు మాయాజాలం, డ్రైవ్‌లు, కట్‌షాట్లలో అంతర్లీనంగా కనిపించే శక్తి, హుక్, పుల్‌షాట్లలో సహజత్వం హైదరాబాద్ క్రికెటర్ల విలక్షణమైన సొత్తు. ఇక స్పిన్నర్ల విషయానికి వస్తే ప్రధానంగా ఆఫ్ స్పిన్నర్ల ఖజానా హైదరాబాద్. గులాం అహ్మద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్, రామ్‌నారాయణ్, నౌషీర్ మోహతా, కన్వల్జిత్‌సింగ్, వెంకటపతిరాజు, ఎం.వి.నరసింహారావు అందరూ ప్రతిభావంతులే. అయితే వీరిలో కొందరు మాత్రమే అంతర్జాతీయ స్పిన్నర్లుగా, మ్యాచ్ విన్నర్లుగా గుర్తింపును తెచ్చుకున్నారు. భారత స్పిన్ చరిత్రలో తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. భారత క్రికెట్‌కు పటౌడీ, మహ్మద్ అజారుద్దీన్ వంటి తిరుగులేని కెప్టెన్లను అందించిన హైదరాబాద్ పలువురు అంతర్జాతీయ క్రికెటర్లను (ఎం.ఎల్.జయసింహ, పిచ్చయ్య కృష్ణమూర్తి, గోవిందరాజ్, అబిద్ అలీ, ఎం.వి.నరసింహారావు, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్, నోయెల్ డేవిడ్, వెంకటపతిరాజు, వి.వి.ఎస్.లక్ష్మణ్) ఇచ్చింది.

దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ రాణిస్తా : లక్ష్మణ్

చాలా అవకాశాలు వచ్చినా సరిగా సద్వినియోగం చేసుకోలేక విమర్శల పాలైన హైదరాబాద్ స్టయిలిష్ బ్యాట్‌మన్ వంగివరపు వెంకట సాయి లక్ష్మణ్‌కు ఆస్ట్రేలియా సిరీస్ జీవం పోసింది. మొదటి టెస్ట్‌లో ఓడిన భారత్ పని అయిపోయినట్టేనని అనుకుంటున్న విమర్శకుల నోళ్లు తన బ్యాటింగ్ ప్రతిభతో మూయించి భారత్‌ను ఒంటిచేత్తో విజయ తీరాలకు నడిపాడు. భారత్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచాడు. ఆ తరువాత భారత్ ఆటతీరే మారింది. ఆస్ట్రేలియా వరుస విజయాలకు గండి కొట్టగలిగింది అంటే అదంతా లక్ష్మణ్ అద్భుత బ్యాటింగ్ ప్రతిభే కారణం. దీంతో లక్ష్మణ్ ఒక్క సారిగా హీరో అయ్యాడు. గాయం తిరగబెట్టడంతో దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌కు దూరమైన లక్ష్మణ్ గాయం నుండి కోలుకొని టెస్ట్ సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ రాణించగలనన్న నమ్మకంతో వున్న లక్ష్మణ్‌తో ఇంటర్వ్యూ వివరాలు:

మోకాలి గాయం నుండి కోలుకున్నట్టేనా?

మోకాలి గాయం పూర్తిగా మానింది. ఇపుడు పూర్తి ఉల్లాసంగా వున్నాను. నెట్ ప్రాక్టీసు మొదలు పెట్టాను. ఫస్ట్‌క్లాస్ డివిజన్ లీగ్‌లలో సమర్ధవంతంగా ఆడుతున్నాను.

గతంలో భారత జట్టుతో దక్షిణాఫ్రికాలో పర్యటించారు. ఆ సిరీస్‌లో భారత్ సరిగా రాణించలేకపోయింది. కారణం?

రాణించలేదనడం నిజం కాదు. జోహన్స్‌బర్గ్‌లో జరిగిన చివరి టెస్ట్‌లో మేము విజయపుటంచుల వరకు చేరుకున్నాము. గెలుపు ఖాయం అనుకుంటున్న దశలో వర్షం మా విజయాన్ని అడ్డుకొంది. ఈ సారి జట్టు పూర్తి స్థాయిలో సిద్ధమై వెళ్లింది. చక్కగా రాణిస్తుంది.

వారి స్వదేశంలోనే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలలో ఎవరితో ఆడడం కష్టంతో కూడుకున్నది?

ప్రస్తుతం రెండు జట్లూ వరుస విజయాలను సాధిస్తూ మేటి జట్లుగా పరిగణింపబడుతున్నాయి. ఇద్దరిలో ఎవరినీ తక్కువగా చూపలేము. రెండు జట్ల ఆటగాళ్ళూ మానసికంగా చాలా పటిష్ట స్థితిలో వున్నారు. వారిని వారి ఫాస్ట్ పిచ్‌లపై నిలువరించడం చాలా కష్టంతో కూడుకున్నది. వారి బౌలింగ్‌ను ఎదుర్కోవడం బ్యాట్‌మెన్‌కు పరీక్ష లాంటిదే.

వాతావరణ, స్థానిక పరిస్థితులు ఆటపై ప్రభావం చూపుతాయా?

అది కొంత వరకు నిజమే. స్థానిక పరిస్థితులలో రాణించినంతగా విదేశీ పరిస్థితులలో రాణించడం కష్టమే. అయితే ఆటగాడు మానసికంగా బలంగా వుంటే వీటిని అధిగమించగలడు. విదేశీ పరిస్థితులలోనూ రాణించగలడు.

ఆస్ట్రేలియాపై రాణించిన మీరు దక్షిణాఫ్రికా సిరీస్‌లో ఎంత వరకు రాణించగలరనుకుంటున్నారు?

రాణించగలనన్న నమ్మకం వుంది. దక్షిణాఫ్రికా సిరీస్‌ను ఛాలెంజ్‌గా తీసుకొని బ్యాటింగ్‌లో రాణిస్తాను. వారి బౌలింగ్ పటిష్టంగా వుంది. అననుకూల పరిస్థితులలోనూ రాణించి నాపై వుంచిన నమ్మకాన్ని నిలుపుకుంటాను.

ఏ బౌలర్ భారత బ్యాట్స్‌మెన్‌ను ప్రభావితం చేయగలడు?

దక్షిణాఫ్రికా బౌలర్లలో అందరూ మేటి బౌలర్లే. డోనాల్డ్, పోలాక్, కల్లీస్ వారి స్వంత పిచ్‌లపై ప్రమాదకర బౌలర్లు. వారిని ఎదుర్కోవడం చాలా కష్టం.

జింబాబ్వే, శ్రీలంక పర్యటనల్లో మీ బ్యాటింగ్ తీరు సంతృప్తి నిచ్చిందా?

జింబాబ్వే సిరీస్‌లో మెరుగ్గా ఆడినా భారీ స్కోర్లు చేయడంలో విఫలమైనాను. బంతిని మెరుగ్గానే ఎదుర్కొన్నాను. శ్రీలంక పర్యటనలో నా బ్యాటింగ్ తీరు సంతృప్తి నిచ్చింది. ఆ పర్యటనలో కొన్ని మంచి స్కోర్లు నమోదు చేశాను. బ్యాటింగ్ గాడిలో పడుతున్న దశలో గాయం నన్ను సిరీస్ నుండి దూరం చేసింది.

ఆస్ట్రేలియాపై రాణించినట్లుగా దక్షిణాఫ్రికా సిరీస్ వుండబోతుందా?

ప్రతి సిరీస్‌లో ఒకే విధంగా రాణించడం ఎప్పుడూ సాధ్యం కాదు. కాకపోతే బాగా ఆడడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ రాణిస్తానన్న నమ్మకం వుంది.

అతడనేక యుద్ధముల ఆరితేరిన వృద్ధమూర్తి...

యు. రామకృష్ణ



రాత్రి 11 గంటలైంది.. ఓ 45మంది సభ్యులున్న దళం ఆ అర్ధరాత్రివేళ... కటిక చీకటిలో బయలు దేరింది... 'సన్నగా, పొడుగ్గా ఉన్న యువకుడు' ఒకరు ఆ దళానికి సూచనలిస్తూ ముందుకు కదిలిస్తున్నాడు... ప్రతి అడుగూ ప్లాన్ ప్రకారం పడుతోంది. దళం పోలీస్ స్టేషన్ సమీపించింది. 'సన్నగా, పొడుగ్గా ఉన్న యువకుడు' వెనుక వస్తున్న దళాన్ని నిలువరించి నలువైపులా పరికించాడు. పోలీస్ స్టేషన్ పరిసరాలలో ఎక్కడా ఏవిధమైన కదలికలూ లేవు.

పోలీస్ స్టేషన్ వరండాలో ఒక కొయ్య మెకరానికి ఆనుకొని సెంట్రీ కానిస్టేబుల్ ఎంతోకాలంనుండి నిదురలేని వాడిలా గురకపెడుతున్నాడు. దీనిని గమనించిన 'పొడవాటి యువకుడు' దళానికి సైగచేశాడు. దళంలో కొందరు అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు కదిలి రెప్పపాటు కాలంలో సెంట్రీపైపడి అదిమిపెట్టేశారు. అతను తెప్పరిల్లి కేకపెట్టే అవకాశం లేకుండా చేశారు. దళంలోని మిగిలిన వారు స్టేషన్‌లోకి వెళ్ళి ఆయుధాలు మొత్తంగా కట్టకట్టి బయటకు తెచ్చారు. అయితే అవన్నీ బర్మార్లే. ఈ దాడి జరుగుతుండగానే లోపల నుండి మరో కానిస్టేబుల్ 'పొడుగు యువకుడు' చేసిన హెచ్చరికతో గభాలున తలుపు వేసుకున్నాడు. ఇదే సమయంలో దళంలోని మరి కొందరు ఆ పక్కనే ఉన్న తహశీలుదారు కార్యాలయంపైన కూడా దాడిచేశారు. లభించిన రికార్డులను బయటకు తెచ్చారు. ఇనుపపెట్టెను పగులగొట్టి అందులో వున్న 240 రూపాయిలు తీసుకొని బయటకు వచ్చారు. ఈ విధంగా ఆ 'పొడవాటి యువకుడు' నేతృత్వంలో కృష్ణాజిల్లా పరిటాల 'పోలీస్ స్టేషన్, తహశీలు దారు కార్యాలయం'పై దాడులు, జయప్రదంగా జరిగాయి.

★ ★ ★ ★

బ్రిటిష్‌వారు భారత దేశాన్ని ఇండియన్ యూనియన్, పాకిస్తాన్‌లుగా ప్రకటించి భారత్‌నుండి నిష్క్రమించిన తరువాత, ఇండియాలో అంతర్భాగంగా లేని నైజాం సంస్థానం సర్వ స్వతంత్రంగా ఉండే విధంగా నిజాం నవాబు 'స్వతంత్ర హైదరాబాద్' గురించి పగటి కలలు కనసాగాడు. నైజాం నవాబు రజాకారు మూకలు విచ్చలవిడిగా దోపిడీని, విధ్వంసకాండను, క్రూర కిరాతకాలను కొనసాగిస్తూ పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పోలీస్, రజాకారు మూకల అండదండలతో తమ స్థానాన్ని కాపాడుకోవాలని భూస్వామ్య వర్గం యధాశక్తి పాకులాడుతోంది. తన వంతు కర్తవ్యంగా తన తాబేదార్లతో కలసి ప్రజలపై దాడులు చేస్తున్న కాలమిది.

పీడిత ప్రజలు తమను తాము రక్షించుకోనేందుకు పెద్ద ఎత్తున సమీకృతమై తమకు అందుబాటులో ఉన్న రాయి, రప్ప, బరిసె, వడిసెల వంటి ఆయుధాలతో ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకుగాను ప్రజలకు ముఖ్యంగా యువతీ యువకులకు గెరిల్లా తరహా యుద్ధ పోరాట పద్ధతులలో శిక్షణ ఇవ్వాలని కమ్యూనిస్టుపార్టీ పిలుపునిచ్చింది. దానిలో భాగంగా కృష్ణాజిల్లా కమ్మవారి పాలెం, మల్లాపురం గ్రామాలలో మొదటి శిక్షణా కేంద్రాలు ప్రారంభించబడ్డాయి.

ఇండియన్ యూనియన్‌లోని కృష్ణాజిల్లాలో విసిరి వేయబడినట్లుంటే కొడవటికల్లు, కొండపేట, ఉస్తేపల్లి మొదలైన ఏడు గ్రామాలు నైజాం సంస్థానపు అంతర్భాగాలుగా ఉన్నాయి. ఈ ఏడు గ్రామాలకు విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి మీద ఉన్న 'పరిటాల' తాలూకా కేంద్రంగా ఉంది. సర్కార్ జిల్లాలను బ్రిటిష్ వారికి ధారాదత్తం చేసే సందర్భంలో ప్రపంచ ప్రఖ్యాత వజ్రాల గనుల నిలయాలైన కొడవటికల్లు మొదలైన ఈ ఏడు గ్రామాలను దానం చేయబడిన 'జాగీరు' అనే పేర బ్రిటిష్‌వారిని దగాచేసి నిజాం నవాబు దక్కించుకున్నాడు.

ఆయుధ సేకరణకు గాను తొలిదెబ్బను ఈ గ్రామాల తాలూకా కేంద్రమైన పరిటాల పోలీస్‌స్టేషన్‌పై దాడిచేయటం ద్వారానే ప్రారంభించాలని కమ్యూనిస్టుపార్టీ రహస్య దళాన్ని కోరింది. అనుకున్నదే తడవుగా ప్లాను సిద్ధమైంది. ఈ దాడికి 'ఆ పొడవాటి యువకుడు' నేతృత్వం వహించి సహచర దళ సభ్యుల తోడ్పాటుతో జయప్రదంగా పరిటాల పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాలను కొల్లగొట్టాడు. ఆయుధ సేకరణలో భాగంగా ప్రారంభించిన ఈ దండయాత్రల పరంపర చాలా కాలం కొనసాగింది. ఈ సారి దాడిని మధిర తాలూకా మోటమర్రి గ్రామ సమీపానగల విజయవాడ- ఖాజీపేట రైల్వేలైన్‌పై రైలు గేటు కాపలాదారులుగా ఉన్న 'నిజాం మిలిటరీ' మీదకు సాగింది.

★ ★ ★ ★

మోటమర్రి రైల్వే గేటు కాపలా కాస్తున్న మిలిటరీపై దాడిచేయడానికి అల్లీనగరాన్ని కేంద్రం చేసుకున్నాడు ఆ 'పొడవాటి యువకుడు'. ఇది నైజాం సంస్థానంలోని మధిర తాలూకా మడుపల్లి శివారుకు చెందిన చిన్న గ్రామం. ఇండియన్ యూనియన్‌లోని కృష్ణాజిల్లా నందిగామ తాలూకా మాచినేనిపాలెం గ్రామానికి దగ్గరలో ఉంది. బ్రిటిష్ ఇండియా ప్రాంతాలైన కృష్ణా, గుంటూరు జిల్లాలతో సంబంధాలు గల ఈ చిన్న ఊరు మంచి చైతన్యవంతంగా ఉండేది.

మోటమర్రి రైల్వే గేటు కాపలాగా ఉన్న నిజాం పోలీసు బలగాలు, కాపలా విషయం ఎలావున్నా గేటుగుండా అనేక గ్రామాలనుండి కృష్ణాజిల్లా నందిగామ తాలూకా గ్రామాల్లోకి వస్తు, వాహనాలతో తరలి వెళ్తున్న ప్రజలను దోచుకోవడం, బాధించడం, హింసించడం నిత్యకృత్యమపోయింది. నిజాం సంస్థానం నుండి దాదాపు 40 గ్రామాలవారు ఇండియన్ యూనియన్‌లోకి ప్రవేశించడానికి ఈ గేటు అనువైనదిగా ఉంది. అందువల్ల ఆయుధ సేకరణతోపాటు వాళ్ళ ఆటకట్టించడానికి నిజాం పోలీసు మిలిటరీ బలగాలపై దాడిచేయాలని, ఈ దాడికి 'పొడవాటి యువకుడు' నాయకత్వం వహించాలని పార్టీ కోరింది.

దాడి నిర్వహించడానికి అతడు దళాన్ని అల్లీనగరం తీసుకువచ్చాడు. వారి విడిదికై కమ్యూనిస్టు పార్టీ స్థానిక శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. రైలు గేటు వద్ద మిలిటరీపై దాడిచేయడానికి అనువైన పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఈ 'పొడవాటి యువకుడు' దళాన్ని అల్లీనగరంలో ఉంచి ఉదయం తొమ్మిది గంటల సమయంలో ధోవతి కట్టుకొని, చొక్కా గానీ, బనియన్‌గానీ లేకుండా పై ఉత్తరీయం భుజాన వేసుకొని గేటు పక్కగా రైలు కట్టదాటి మోటమర్రి వరకూ నడిచివెళ్తూ జాగ్రత్తగా పరిశీలించాడు. దాడి వ్యూహాన్ని ఆలోచిస్తూ తిరిగి అల్లీనగరం వచ్చాడు. ప్లాన్ సిద్ధమైంది.

★ ★ ★ ★

చీకటి పడింది. దళం భోజనాలు ముగించింది. ఊరిలో జనం పగలల్లా చేసిన పనిపాటలతో అలసిపోయి నిద్రాదేవి ఒడిలోకి జారిపోయారు. కందిచేలు కారడవుల్లా కన్పిస్తున్నాయి. జొన్నచేలు గాలికి సవ్వడి చేస్తున్నాయి. చేలల్లో అంతా రేగు కంప.

దళం అడుగులో అడుగు వేసుకుంటూ ఆచీకటిలో దాడి చేయవలసిన గేటు దగ్గర ఉన్న కందిచేలోకి చేరుకుంది. 'పొడవాటి యువకుడు' చేలోనుండి ముందుకు వచ్చి గేటు వద్ద వరండా వైపు చూశాడు. సెంట్రీ గాఢనిద్రలో ఉన్నాడు. గది వెనుక కిటికీ వేసి ఉంది. మళ్ళీ వెనుదిరిగి దళం వద్దకు వెళ్ళి, గదికి ఇరువైపులా దళం నిలవాలని, వరండాగుండా గదిలోకి వెళ్ళి గ్రెనేడ్ విసిరి తలుపులగి బయట గడియ పెట్టాలని, సెంట్రీ మేల్కొంటే మీదపడి వాడిని లొంగదీసుకోవాలని, ఆయుధాలు గుంజుకోవాలని సూచనలు ఇచ్చాడు. ఎవరెవరు ఏమి చేయాలో వివరించాడు. అటు నుండి గాని, ఇటు నుండిగాని రైలు రాకముందే ఈ దాడి పూర్తి చేయాలని కోరాడు.

చీకటిని చీల్చుకుంటూ వరండాలో గది తలుపు వరకూ చేరాడు 'పొడవాటి యువకుడు'. గ్రెనేడ్ గదిలోకి విసిరి బయట గొళ్ళెం పెడుతుండగానే పెద్ద శబ్దం చేస్తూ అది పేలిపోయింది. అంత త్వరగా అది పేలిపోవడంతో 'పొడవాటి యువకుడు' వరండా నుండి బయట పడక ముందే సెంట్రీ లేచి రైఫిల్ అందుకున్నాడు. 'పొడవాటి యువకుడు' సెంట్రీని బయటినుండి బంధించి రైఫిల్ కింద పడవేయవలసిందిగా హెచ్చరించసాగాడు. అదే

సమయంలో దళంలోని మరో ముఖ్యకార్యకర్త ఒకరు సెంట్రీపైకి బర్మార్ పేల్చాడు. ఈదెబ్బతో అతడు రైఫిల్ కింద పారవేశాడు. ప్రాణాలు దక్కించుకునేందుకు కాబోలు చనిపోయిన వాడిలా పడిపోయాడు. అతని పక్కనే పడుకొని ఉన్న రైల్వే గేటు కాపలాదారు మాత్రం బయటకు దూకి చీకటిలో పరిగెత్తసాగాడు. ఖాకీ దుస్తుల్లో ఉన్న దళ సభ్యుడొకరు కాపలాదారుపై కలియబడ్డాడు. ఖాకీ దుస్తుల్లో ఉన్న దళ సభ్యుడిని పోలీసనుకొని భావించిన దళంలోని ఒక ముఖ్య కార్యకర్త బర్మారు తిరగేసి అతని నెత్తిమీద బలంగా కొట్టాడు. అతని నెత్తి పగిలింది. తుపాకీ మడం విరిగింది. ఈ సమయంలో 'పొడవాటి యువకుడు' గదిలో ఉన్న రైఫిళ్ళను, మందుగుండు పెట్టెను బయటకు తెచ్చాడు. తలపగిలిన కామ్రేడ్‌ను భుజాన వేసుకొని, రైఫిళ్ళు, మందుగుండు సామాగ్రి పెట్టెను నెత్తికెత్తుకొని ఆచీకటిలోనే అక్కడికి పడమర దిక్కున ఉన్న కాకరవాయి బీళ్ళలోకి దళం వెళ్ళిపోయింది.

ఆతరువాత కొన్నాళ్ళకు మధిర తాలూకా గన్నవరం పోలీస్ క్యాంప్ మీద దాడిచేశారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ ఆదేశానుసారం దళాల నిర్మాణం, కార్యకలాపాల నిర్వహణకై 'పొడవాటి యువకుడు' మానుకోట ఏరియాకు పంపబడ్డాడు.

★ ★ ★ ★

ఈ విధంగా పరిటాల పోలీస్ స్టేషన్‌పై దాడిజరిపి, ఆయుధాలు లూటీ చేయడంలోనూ, మోటమర్రి రైల్వేగేటు వద్ద కాపలాగా వున్న నిజాం మిలటరీపై దాడి జరిపి వారి వద్ద ఉన్న రైఫిళ్ళను లాక్కొని తీసుకువచ్చిన ఈరెండు సంఘటనలకు నాయకత్వం వహించిన **ఆ 'పొడవాటి యువకుడే' కామ్రేడ్ మంచికంటి రాంకిషన్‌రావు**. ఈ సంఘటనల్లో ఆయనకు సహచరులుగా ఉండి అన్ని విధాలా తోడ్పడిన కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలే కామ్రేడ్ బొంబై ప్రసాద్, నీరుకొండ అప్పారావు, గంగిపరిపు శ్రీనివాసరావు, గిరిప్రసాద్, వట్టికొండ నాగేశ్వరరావులు.

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో మంచికంటి రాంకిషన్‌రావు జన్మించారు. తండ్రి పర్సా రామానుజరావు, తల్లి సీతమ్మ. ఐదో, పదో ఎకరాలు ఆస్తి ఉన్నా అప్పులు బాగా పెరిగిపోవడంతో ఆ కుటుంబానికి తిప్పలు ప్రారంభం అయ్యాయి. రాంకిషన్‌రావుకు ఐదారేళ్ళ వయసున్నప్పుడే వారి నాన్నగారు చనిపోయారు. రాంకిషన్‌రావుకు ఓ అక్క, అన్న కూడా ఉన్నారు. వారి పోషణ భారం వారి అమ్మదే అయ్యింది. పిల్లలు పెద్దవాళ్ళయ్యే వరకు వ్యవసాయం చేసుకొని ఫలసాయం అప్పులకింద జమ చేసుకునేలా అప్పుల వాళ్ళకు అప్పగించి ఆ కుటుంబం ఖమ్మం వెళ్ళిపోయింది. రాంకిషన్‌రావు తల్లిగారు బ్రాహ్మణులు, వైశ్యులకు మునేటినుండి, ఖిల్లా బావి నుండి రోజుకు 10 బిందెల వరకు మంచినీళ్ళు మోసి వారిచ్చే 10 కానులతో ఆ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేది. ఆకాలంలో వీరి కుటుంబ విషయం విని కాచిరాజుగూడెం భూస్వామి, పట్వారీ అయిన మంచికంటి తిరుమలరావు రాంకిషన్‌రావును దత్తత చేసుకున్నారు. దత్తత తండ్రి సహృదయత, దత్తత తల్లి వాత్సల్యం రాంకిషన్‌రావు అసలు తల్లి, సోదరి, సోదరుడిని వారికి మరింత చేరువ చేశాయి. కాచిరాజుగూడెంలో ఇంటి వద్దనే ప్రైవేట్ మాస్టర్‌ను పెట్టించి మూడవ తరగతి వరకు రాంకిషన్‌రావుకు చదువు చెప్పించారు. ఆ తరువాత పై చదువుకై ఖమ్మంలో పెట్టారు. అసలు తల్లి రాంకిషన్‌రావు వద్ద వుండి వంట చేసిపెట్టేది. దత్తత తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఖమ్మం వచ్చి వారి యోగక్షేమాలు, చదువు సంధ్యల గురించి విచారించి శ్రద్ధవహించేవారు. ఆరవ తరగతి చదువుతుండగానే మంచికంటి రాంకిషన్‌రావుకు వివాహం అయింది.

ఆంధ్రమహాసభలోను, కమ్యూనిస్టుపార్టీ లోనూ ప్రముఖ పాత్ర వహించిన దేవులపల్లి వెంకటేశ్వరరావు ఎనిమిదవ తరగతి నుండి ఖమ్మంలో మంచికంటికి క్లాస్‌మేట్. హైదరాబాద్ వెళ్ళి వకాలత్ చదువుకోవాలకున్న మంచికంటి అభిలాష దత్తత తల్లిదండ్రులకు సుతరామూ ఇష్టం ఉండేది కాదు. వారి ఆప్యాయత అలా కట్టిపడ వేయడంతో మంచికంటి చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. ఇంటివద్దనే దత్తత తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ పట్వారీగిరి చేపట్టాడు. దీనితోపాటు స్వంత వ్యవసాయం భూముల వ్యవహారం కూడా తానే చూసేవాడు. భూ నిర్వహణ వ్యవహారాలే గాక, వ్యవసాయ కూలి ఇచ్చే వ్యవహారాల్లో చాలా అవకతవకలు ఉండేవి. వాటిలోతు పాతుల్ని తెలుసుకోవాలనే కుతూహలం ఉండేది మంచికంటికి. పట్టాలు ఒకరి పేరుతో, భూములు మరొకరి అధీనంలో, నక్షాల్లో ఒక రకంగా, లెక్కల్లో ఇంకో రకంగా భూములు ఉండేవి. ఇలాంటి విషయాల్లో దత్తత తండ్రి, మంచికంటి తత్వాలు భిన్నధృవాలుగా ఉండేవి. వీటి విషయంలో సర్దుబాటు చేసుకోలేని మంచికంటి హైదరాబాద్‌లోని ల్యాండ్ రెవెన్యూ కార్యాలయంలో చిన్న ఉద్యోగంలో చేరాడు. అక్కడ ఇచ్చే 30 రూపాయలు జీతం మంచికంటి కుటుంబానికి సరిపోయేదికాదు. ఎప్పుడూ అప్పులు చేయాల్సివచ్చేది.

★ ★ ★ ★

అవి రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులు. భార్యను హైదరాబాద్‌లోనే వదిలివేసి షోలాపూర్ వెళ్ళి సైన్యంలో అంబులెన్స్ దళంలో చేరాడు మంచికంటి. ఆ సమయంలో ఆంధ్రమహాసభలో పనిచేస్తున్న జాతీయవాది కొమరగిరి నారాయణరావు మంచికంటి అడ్రస్ తెలుసుకొని పూనా వచ్చారు. సైనిక కవాతు జరుగుతుండగా మంచికంటిని చూసి కవాతు తరువాత తనను కలవవలసిందిగా కొమరగిరి సైగచేశారు. తర్వాత వారిద్దరూ కలిసి మాట్లాడినప్పుడు భార్య, పెంపుడు తండ్రి పడుతున్న ఆందోళన, ఆవేదన వివరించి తిరిగి వచ్చేయవలసిన అవసరాన్ని కొమరగిరి, మంచికంటికి గుర్తుచేశారు. దీనిని అర్ధంచేసుకొన్న మంచికంటి దొడ్డిదారిన సైన్యం శిబిరం (పూనా) నుండి హైదరాబాద్‌కు పారిపోయి వచ్చారు.

మిలిటరీనుండి పారిపోయివచ్చిన మంచికంటి ఆరోజుల్లో పోలీసుల కంట పడకుండా కొన్నేళ్ళపాటు అజ్ఞాతవాసంలో గడపాల్సివచ్చింది. అజ్ఞాతవాసంలో ఆయన కొణతమాత్మకూరులో ఉన్నప్పుడు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్స్ పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావులను చూశారు. వారు అప్పుడప్పుడు రాత్రిపూట సుంకర సత్యనారాయణ గారింటికి వచ్చి వెళ్తుండేవారు. మొదట్లో వారెవరో, ఎందుకు సత్యనారాయణ గారింటికి వచ్చేవారో అతనికి అర్ధమయ్యేదికాదు. మంచికంటి సత్యనారాయణగారింటి పక్కనే ఉండేవారు. ఆ తర్వాత వారెందుకు అక్కడకు వస్తున్నారో ఆయనకు తెలిసింది.

మంచికంటి కొణతమాత్మకూరులోనే కమ్యూనిస్టుపార్టీ సభ్యుడయ్యారు. ఇదే ఆయన రాజకీయ జీవితానికి ఆరంభమనవచ్చు. 1946 నాటికే తెలంగాణాలో ముఖ్యంగా నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వంలో సమీకృతమౌతున్న వీడిత ప్రజానీకం వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, ఫ్యూడల్ భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా తిరుగుబాటును ఉధృతం చేసింది.

నిర్బంధ లేవీకి వ్యతిరేకంగా

రైతాంగం కూడా కమ్యూనిస్టుపార్టీ వెనుక బలీయమైన శక్తిగా సమీకృతమవుతున్న కాలమది. కమ్యూనిస్టుపార్టీ సభ్యుడైన మంచికంటి నిజాం నవాబుకు చెందిన రజాకార్లు, భూస్వామ్య శక్తులు ప్రజలపై చేస్తున్న దాడులను తిప్పికొట్టేందుకు కృష్ణాజిల్లా కమ్మవారిపాలెంలో ఏర్పాటుచేసిన కేంద్రంలో గెరిల్లా పోరాట యుద్ధ పద్ధతులలో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన తరువాత పరిటాల పోలీస్ స్టేషన్‌పైదాడి, మోటమర్రి రైల్వే గేటు వద్ద మిలిటరీ క్యాంప్‌పై దాడి, ఇంకా అనేక వాటిలో పదుల సంఖ్యలో పాల్గొన్నారు.

పిండిప్రోలులో దేశ్‌ముఖ్ జగన్నాథరెడ్డి ప్రజలపై క్రూర అకృత్యాలకు పాల్పడేవాడు. దుర్భేధ్యమైన తన గడీలో కచేరి చావడి వద్ద చెట్టుకు కట్టేసి శిక్షలను అమలు చేసేవాడు. ఆ చావడి, అక్కడున్న చెట్టు పేరు చెపితే జనం భయంతో వణికిపోయేవారు. ప్రజాసమీకరణతో ఈ దొర గడీని కూల్చివేసిన సంఘటనలో కూడా మంచికంటి పాల్గొన్నారు. అలాగే సంకీస పోలీస్ స్టేషన్, మానుకోట తాలూకాలోని నెల్లికుదురు పోలీస్ స్టేషన్లపై దాడిచేసిన దళాల్లో మంచికంటి కూడా ప్రధానపాత్ర వహించారు. ఈ దాడిలో ఐదుగురు సైనికులు మృతి చెందారు. ములకలపల్లి మిలిటరీ క్యాంప్‌పై దాడిలో కూడా ఆయన పాల్గొన్నారు. ఒకరోజు మన్నెంగూడెం నుండి పొలాల మీదుగా

(మిగతా 23వ పేజీలో)

రుక్మిణి

"పచ్చ చొక్కయ్యా జిందాబాద్! చొక్కయ్యగారూ వర్ధిల్లాలి.. చొక్కా జిందాబాగ్!"

వరండాలో పచార్లు చేస్తున్న పచ్చ చొక్కయ్య పడిలేచినంత పని చేసి - తేరిపార చూసే సరికేముంది. ఇంటిగేటు తోసుకుని బిలబిలమని నానా కంగాళీగా పల్లెజనం... కూల్నాలి... ముసలీ ముతకా, ఆడా - మగా ఆవురావురుమని ఆదరాబాద ాగా అరుచుకుంటూ వచ్చారు గదా!

"రిపోర్టరుగారూ! చూసినారు గద! అదీ సంగతి! ఆళ్ళముల్లేదో ఇక్కడ దాసి పెట్టినట్టు దోసుకెళ్ళడానికి బయల్దేరింద్రాయె! చూడాలి వీండ్ల సంగతి!" చొక్కయ్యగారు పంచె బిగించి ముందున్న జక్కులోడ్ని అజాపజా అడిగాడు.

"గదే... పనికి ఆహార పతకం... 'కరువు బియ్యం' పంపించిన్నవని చెంద్రబాబుగారే టీవీల చెప్పిన్రాయె! ఎన్నెన్ని కిలోలిస్తరో... ఎట్లిస్తరోనని...!" నసిగాడు.

చొక్కయ్యగారికి బహు సంబరం కలిగింది. బొళబొళమని దిలాసాగా నవ్వాడు. మల్లేశు వెంటనే మహా ఉద్రేకపడిపోయి "పచ్చ చొక్కయ్యా... అమర్‌రహే" అని బిగ్గరగా ఆర్తనాదం చేసేసరికి యాద్గిరి బలవంతంగా వాడి నోరు వినపడకుండా మూసిపారేశాడు!

"వానల్లేవు... చెరువులు పూరాగా ఎండిపోయినై కాబట్టి పూడికలు తీయించడానికి పొక్లెయిన్లు కావాలె! మరేవెూ మీ కందరికీ పనులు కల్పించడానికే 'జలయజ్ఞం' వెంటనే మొదలు పెడదాం... అబ్బో.. ఈ ఎండల్ని ఈ జన్మలో చూడలేదు - అంతటా కరువేనని మన నివేదికలు చెప్తున్నాయి - అందులోనూ కరువుతో తిండిలేక ఎవడూ చావగూడదని సుప్రీంకోర్టు సెలవిచ్చింది"

"మరి తిండిలేకపోతే జనం చావడం మామూలేగదా... అట్లానే జనం చస్తున్నారు గదా!" విలేకరి అయోమయంగా అడిగాడు.

"అట్లా చావడం పూరాగా కోర్టు ధిక్కార నేరం కిందకే వస్తుంది - అట్లా తిండిలేక చావద్దూ ఖబడ్దార్ ఖడేజావ్ హర్రాంకోర్ అనేమో కోర్టు వారు అంటుంటే" నేనట్లనే నస్తా... నా ఇష్టం.. నా నీలుగుదునాదీ... నన్నెవడు పీక్కుంటాడూ" అని జులుం చేయడం నేరం! అట్లాంటోళ్ళమీద న్యాయస్థానం కఠోరమైన చర్యలు తీసుకుంటుంది.. ఊర్కె పోదు. కోర్టు ధిక్కారం... పోలీసులు... లాఠీలిరుగుతాయి... జైలు.. కొంపమునుగుతుంది.. జాగ్రత్త.. తమాషాలు చేస్తున్నార్ర... ఖబడ్దార్... జైలు.. పోలీసులు...!"

జక్కులోడికి ఏమీ అర్థంగాక హాహాకారం చేశాడు.. చాలామంది కూల్నాలి జనం కోర్టులేందీ... ఈ పోలీసులెందుకో... వాళ్ళు తమని తన్నుడెందుకో అర్థంగాక అప్పటికప్పుడు ఆకలిని మొత్తానికి మొత్తం మరచిపోయి దిగులుతో కృంగిపోయారు!

"మరయితే జనం తిండికి మాడి చావకుండా మీరేం చేస్తున్నట్లు? చస్తే నేరం మీది కాదా?" అతి తెలివిగా విలేకరి అడిగాడు!

పచ్చ చొక్కయ్య కులాసాగా నవ్వాడు - "అదేనయ్యా మా బాబుగారి యంత్రాంగం... జనం రోజూ చావడం రివాజే! వాడు ఆకల్లో సచ్చినా... కేకలు పెట్టి చెయ్యొద్దు.. ఇంకుడు గుంతలు యాడబడితె ఆడ తవ్విపారెయ్యండి! జాగా లేకపోతే నడివింట్లనైనా సరే! లెక్క ప్రకారం తవ్విపారెయ్యండి.. మన స్వర్ణాంధ్రకూ... ఇంకుడు గుంతలకూ... కరువు బియ్యానికీ లంకె! ఎన్ని బియ్యం కావాల్నంటే అన్ని! ఆరు కోట్ల టన్నులు...

కరువు బియ్యం వరద బియ్యం!

మిడికినా వాడికి కాలం తీరి కునికేసాడనే చెప్తాం! అదే కిటుకు! అయినా జనాలకు కరువు బియ్యం అందించాలనే గదా ఈ జలయజ్ఞం"

మళ్ళా మల్లేశం... యాద్గిరీ అందరూ తేరుకున్నారు... పోలీసుల బెడదా... లాఠీపోట్లు లేవనంగానే ఆకలి దానంతటదే మొదలయ్యింది!

"ఈ కరువుక్కారణం పంటలు లేకపోవడం... పంటల్లేకపోవడానిక్కారణం నీళ్ళేకపోవడం... నీళ్ళేకపోవడానిక్కారణం కురిసిన నీటిని నిలవ చేసుకోకపోడం... దానిక్కారణం వానల్లేకపోవడం... అవి కురవకపోవడానిక్కారణం... ఓజోన్ పొర పరపరమని పగలడం... దానిక్కా...

"అది కాదెసె.. వినండ్రె... మనిషి సావడానిక్కారణం ఆకలికావడం... దానిక్కారణం తినకపోవడం.. దానిక్కారణం వండకపోవడం... దానిక్కారణం బియ్యం లేకపోవడం.. అవి లేకపోవడానిక్కారణం పన్లేకపోవడం... పన్లేకపోవడానిక్కారణం మనందరం పుట్టడం...!" ముసలి గంగయ్య అలుపొచ్చి ఆపసోపాలు పడి గోడకు జారగిలపడ్డాడు.

పచ్చొక్కయ్య పట్టించుకోకుండా జలయజ్ఞం వివరాలకు తగులుకున్నాడు. "బియ్యం వచ్చి నా గోదవున్లనె భద్రంగా వున్నై! మా చెంద్రబాబుగారు మీ అందరికీ జన్మభూవులూ... జలయజ్ఞాలు పెట్టి వాటిని పంచమని మా అందరికీ తర్ఫీదిచ్చినాడు.. చెరువులు పూడికలు తీయండి... లోతుగా తీయండి.. రోజుకు 5 కిలోలు 30 రూపాయలు.. 8 కేజీలు 10 రూపాయలు.. లేకపోతే సొంతం 10 కేజీల బియ్యం! లెక్క ప్రకారం పని చేయాలె... ఎండను లెక్క

పడుతూ లేస్తూ చాతనైన వాడల్లా పలుగూ-పారా అందుకుని చెరువుల వెంటా, డొంకల వెంటా పూడికలకూ.. గుంతలకూ తగులుకున్నారు.

"మీ గోడాన్లో బియ్యం ఉండడం ఏందీ?" విలేకరి కుతూహలంగా అడిగాడు.

"స్వర్ణాంధ్ర కరువు బియ్యం... కేంద్రంతో కొట్లాడి తెచ్చినం! వాళ్ళేమో వుచితంగానే ఇయ్యమంటారు - వాళ్ళ ముల్లేం పోయింది? ఎట్లా ఇవ్వాల్నో.. ఎన్నివ్వాల్నో చెప్పరాయె! మన జనమేమో మాటవినక అల్లర్లకు తగులుకుంటున్నారాయె...

☆ ☆ ☆

అబ్బో...! ఎక్కడ అగ్నిపర్వతం ప్రేలిందో.. మన్నూ మిన్నూ ఏకమయ్యిందోగానీ... ఒకటే వాన... వానంటే వానకాదు.. ఎడతెరిపిలేని జల్లు మీద జల్లు.. వాగులూ.. వంకలు.. వరదలతో పరవళ్ళు... రోడ్లు... ఇండ్లు కొట్టుకుపోతే.. ఒక పక్క కాస్తోకూస్తో వేసుకున్న పైర్లు పూర్తిగా మునిగిపోవడంతో జనాలు లబలబలకు తగులుకున్నారు.

"మీ కష్టం ఫలించింది... జలయజ్ఞం టోటల్‌గా సక్సెస్సయ్యింది. ఒక్క దెబ్బకే మీ కరువూ... ఆకలీ... ఆకలి చావులూ మటుమాయం! "పచ్చొక్కయ్య మహా సంబరపడిపోతూ చిందులేస్తుంటే గేటు దాటి వచ్చిన జనాలు నోర్లు గేట్లా బార్లా వెళ్ళబెట్టారు.

"ఓర్నీ... మరి కరువు బియ్యం... పనికి ఆహార పథకం బియ్యం ఇవ్వరా ఏంది?" జక్కులోడు ధుమధుమలాడుతూ చిందులు తొక్కాడు. పచొక్కయ్య అర్థం కానట్టు అతి తెలివిగా మొహం పెట్టి చిన్నకోర్టు పెద్ద జడ్జిలా సులోచనాలు సర్దుకున్నాడు.

"వానలు పడ్డాయి గదా... చెరువులు నిండినై గదా.. ఇంకుడు గుంతలు పొంగిపొర్లినాయి గదా... నదుల నిండా నీళ్లే... మళ్ళా కరువంటారేందీ? జలయజ్ఞంతో 'ఆనాడు' పత్రికోళ్ళు ఊరూరా జనాల్నీ... టీవీల్నీ తిప్పి చేసినారు గదా!"

"ఓరి నాయనో... ఇదెక్కడి మతలబురా తండ్రో.. చెరువుల కట్టలు తెగిపాయె! రోడ్లు కొట్టకపాయె! ఇండ్ల కొట్టాలు పుటుక్కుమని ఇరిగిపాయె! మొలగుడ్డలు తప్ప మరేం లేక మురికి నీళ్ళల్ల బిక్కురు బిక్కురు మంటుంటిమాయె!" యాద్గిరి మటమటలాడుతూ ఇటు ఆకలితో అటు ఒళ్ళు మంటతో సింగినాదాలు చేశాడు.

"అబ్బా... మీకాళ్ళమీద మీరు నిలబడి బతకాలె... అన్నీ గవర్నమెంటు చేయదు.. అక్షర సంక్రాంతిలో చేరండి... చేర్పించండీ... ఉద్యోగాల కోసం కాదు చదువు... ఉపాధి.. పేపరు చదివి సంగతులు తెలుసుకోవాలె... టెలిఫోను వాడుకోవాలె!"

నీళ్ళలో తడిసీ తడిసీ ముద్దయిన జనం కొందరు మూర్ఛపోయారు!

'అద్సరె గానీ.. ఆ కరువు బియ్యం... గవే... ఢిల్లీ నుండి పంపినవి... గవన్ని ఇప్పించండి.. గంజి కాచుకు తాగుతం !" మల్లేశం సర్దిచెప్పాడు.

"ఓహో...హోహో... పనికి ఆహారం పథకం.. అవునవును.. ఆ పథకం అస్సలు రద్దయిపోయిందనుకుంటున్నాం గదా... సర్సరె.. ఇపుడు కరువు పన్లు వదిలేసి వరద పనులకు తగులుకోండి!"

"వరద పనులా?" జక్కులోడి భార్య నోరు మహా విశాలంగా తెరిచింది!

"అవును. మీ తెగిపోయిన చెరువు కట్టలు కట్టుకోండి! అర్జంటుగా ఇంకుడు గుంతలు మూత వేయండి - కాలుజారి పడితే మూతీ ముక్కూ పచ్చడవుతాయి - నడుము లిరిగేను - ఒరే.. మీకసలు తెలవదుగానీ మన 'జలయజ్ఞం' దెబ్బకు ఈ వరద మీ మంచికే వచ్చింది. యజ్ఞం వల్ల వానా... వాన వల్ల వరదా... వరదల వల్ల పన్లూ... పనుల వల్ల వరద బియ్యం... బియ్యం వల్ల ఆకలి చావులుండవు.. ఒరే... దాంతో సుప్రీంకోర్టు... పోలీసులు.. పఠాను దెబ్బలూ వుండవు... భలే తప్పించుకున్నార్రా... పొండి... రోడ్లు బాగు చేసుకొని... పందిర్లేసుకుని రండి...

ముక్కుతూ మూలుగుతూ ముద్దముద్దయిన జనం ఊరివెంటబడ్డారు!

☆ ☆ ☆

"ఆగోదాముల 'కరువు బియ్యం'....

"అవిపుడు 'వరద'... వరద బియ్యం - వున్నాయి! చెక్కు చెదరకుండా రేకుల షెడ్డులోనే వున్నాయా లేదా?" పచ్చొక్కయ్య సిగరెట్ పీకి తాపీగా అన్నాడు.

"సర్సరె... ఈ పనులన్ని చేసిన కూల్నాలి జనాలకు ఎపుడిస్తారు?"

పచ్చొక్కయ్య బొళబొళ నవ్వాడు. "ఓసి వెర్రిమొకవా! వానలొచ్చినాయిగద! పంటలు పండుతాయి! యవడి పని వాడు చేసుకుని బతుకుతాడు! మరి ఆ మన బియ్యం మిల్లు ఓనరుకు రేపే కాటా పెట్టించి టోకున అమ్మిపారేయడానికి బేరం సెటిల్మెంటు చేశానే వెర్రిదానా!"

పచ్చొక్కయ్యగారి భార్య వెర్రిదోకాదో తెలవదు గానీ... వెర్రిదాన్లానే చూస్తూ [illegible]! ☆

'నృత్య రూపక సృష్టికర్త' నటరాజ రామకృష్ణ

నటరాజ రామకృష్ణ ఇండోనేషియాలోని బాలిద్వీపంలో 1933లో జన్మించారు. ఆయన కుటుంబం లలిత కళాపోషణకు ఖ్యాతిగాంచినది. ఆసియాలోనే బాలిద్వీపం కళలకు కొలువైనది. రామకృష్ణకు నాట్యంపై అభిరుచి పెరగడం తండ్రికి నచ్చలేదు. తన కుమారుడు నాగరిక సమాజానికి విరుద్ధంగా, ఆ రోజుల్లో పంక్తి బాహ్యులుగా పరిగణించే నటకోటిలో చేరవద్దని ఆయన పట్టుదల. కాని బాలుడయిన రామకృష్ణకు జాగ్రత్స్వప్న నిద్రావస్థల్లో లయబద్ధమైన గజ్జెల సవ్వడి చెవులకు వినిపించేది. అంతరాత్మ అంతగా అర్ధంకాని ప్రబోధం చేసేది. ఈ ఒత్తిడికి తట్టుకోలేక ఆయన కుటుంబానుబంధాన్ని కూలదోసి పిత్రార్జితంలోని తన పెద్దపాలును కాలదన్ని భారతదేశం చేరుకున్నారు. దీంతో పేదరికం కోరల్లో చిక్కుకొని ఆకలికి అలమటించారు. కష్టాలతో, కలతలతో నలిగిపోయారు. మొదట మద్రాస్‌లోని రామకృష్ణ మఠంలోనూ, తరువాత గాంధీజీ ఆశ్రమంలోనూ ఉన్నారు. నాట్యకళా పిపాసను తీర్చుకొనే అన్వేషణలో ప్రసిద్ధ నాట్యాచార్యులు ఆయనకు తారసిల్లారు. మీనాక్షి సుందరం పిళ్ళై, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, శ్రీమతి నాయుడుపేట రాజమ్మ, పెండ్యేల సత్యభామ వారికి వివిధ నాట్యరూపాలను బోధించారు.

బండారా సంస్థానాధిపతి కుటుంబ వైద్యుడయిన డాక్టర్ సోనక్ నాగపూర్‌లో రామకృష్ణ నాట్య ప్రదర్శన తిలకించి ముగ్ధుడయ్యాడు. వెంటనే సంస్థానాధిపతి రాజా గణపతిరావు పాండ్యా వద్దకు ఆయన్ను తీసుకువెళ్ళారు. పండితులు, కవులు, కళావేత్తలు, నాగపూర్ ప్రముఖులందరి ముందు నాట్యం చేయవలసిందిగా ఆ ప్రభువు ఆదేశించారు. ఆ రోజు రామకృష్ణ తిండికి కూడా నోచుకోలేదు. నాట్య ప్రదర్శన జరిగింది. దర్బారంతా మంత్ర ముగ్ధమైంది. ఆనాటి నుండి ఆయనకు కూడుగుడ్డకు లోటులేకుండా పోయింది. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులు కూడా అయ్యారు. పద్దెనిమిది ఏళ్లు కూడా నిండని రామకృష్ణకు రాజా గణపతి రావు పాండ్యా 'నటరాజ' బిరుదును ప్రసాదించారు.



రెండు వేల సంవత్సరాల చరిత్ర గల 'దేవదాసి-అభినయం' నామరూపాలు లేకుండా పోతున్న సమయంలో ఆయన దాని గురించి రాజమండ్రిలో 1972లో చర్చాగోష్ఠి నడిపారు. ఈ విధంగానే 'తూర్పు భాగవతం' గురించి సదస్సు నిర్వహించి ఆ కళకూ, కళాకారులకు ఆదరం లభించేందుకు తోడ్పడ్డారు. తెలంగాణాలో ప్రసిద్ధమయిన 'చిందు యక్షగానం' ప్రదర్శించే కళాకారులకు ఆయన ఎంతో తోడ్పడ్డారు.

నటరాజ రామకృష్ణ నాట్య కళా పరిశ్రమను నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. అవి 1. నాట్యకళకు గౌరవస్థానాన్ని సమకూర్చటం. 2. మరుగున పడిన నాట్య రూపాలను పునరుద్ధరించి, కళాకారులకు జీవనోపాధి కల్పించడం. 3. నాట్యగ్రంథ రచనలు చేయడం. 4. నూతన నృత్య రూపకాలను సృష్టించడం. భారతీయ నాట్యభేదాల గురించి ఆయన కూలంకషంగా అధ్యయనం చేశారు. చివరకు తాత ముత్తాతలకు తావయిన ఆంధ్రదేశానికి వచ్చి 1955లో 'నృత్యనికేతన్'ను హైదరాబాద్‌లో స్థాపించారు. ఆంధ్రదేశానికి సంబంధించిన అన్ని రకాల నాట్యాల గురించి పరిశోధన ప్రారంభించారు. ఆనాడు ఆయన నలుమూలలా సంచరించారు. అభినయపూర్వకంగా ప్రసంగాలు చేశారు. నాట్యకళ పట్ల ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు. ప్రజల అంతరంగాల్లో పరివర్తన మొదలయ్యింది. బాలబాలికలు నిర్నిరోధంగా నాట్యం నేర్చుకోవడం ప్రారంభమయ్యింది. ఆయన ఇప్పటి వరకు మూడువేల మందికి పైగా నాట్యకళావేత్తలుగా తీర్చిదిద్దారు.

నటరాజ రామకృష్ణ కనుమరుగైన కాకతీయ యుగం నాటి 'పేరిణి' (పేరిణి శివతాండవం) నాట్యాన్ని పునరుద్ధరించారు. భారతీయ నాట్యసారం, ఆత్మసందేశమూ అయిన అభినయాన్ని ప్రచారం చేశారు. నాట్యకళా పునరుద్ధరణలో భాగంగానే ఆయన చర్చా గోష్ఠులు నిర్వహించారు. కొన్నేళ్ళ క్రితం కేంద్ర సంగీత నాటక అకాడమీ కూచిపూడి నృత్యాన్ని నాట్యంగా పరిగణించలేదు. వెంటనే వారు తాను సారధిగా ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించి కూచిపూడి నృత్యానికి ప్రాచీన ప్రతిష్ట ప్రభవిల్లేటట్లు చేశారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర గల 'దేవదాసి-అభినయం' నామరూపాలు లేకుండా పోతున్న సమయంలో ఆయన దాని గురించి రాజమండ్రిలో 1972లో చర్చాగోష్ఠి నడిపారు. ఈ విధంగానే 'తూర్పు భాగవతం' గురించి సదస్సు నిర్వహించి ఆ కళకూ, కళాకారులకు ఆదరం లభించేందుకు తోడ్పడ్డారు. తెలంగాణాలో ప్రసిద్ధమయిన 'చిందు యక్షగానం' ప్రదర్శించే కళాకారులకు ఆయన ఎంతో తోడ్పడ్డారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని 'తప్పెటగుళ్ళు', ఉభయ గోదావరి జిల్లాల్లోని 'వీరనాట్యం', 'గరగలు' కళలనూ పునరుద్ధరించి ఆ కళాకారులను ప్రోత్సహించారు. ఎక్కడో మారుమూల పల్లెల్లో నివసిస్తూ కూడూ గుడ్డ కరువైన 'దొమ్మరులు', 'తోలుబొమ్మలాటగాండ్రు', 'గురవయ్యలు', 'ఉరుములు' (రాయలసీమ), 'వీధి భాగవతులు' (చిత్తూరు జిల్లా) మొదలైన కళాకారుల ప్రదర్శనలను రాష్ట్రమంతటా ఏర్పాటు చేసి వారి భుక్తికి లోటురాకుండా చేశారు.

తన పదిహేనవ ఏటనే ఆంధ్రప్రభలో ఏడాదిన్నరపాటు 'నృత్యాంజలి' శీర్షికతో వ్యాసాలు రాశారు. అందరికీ అర్ధమయ్యేరీతిలో సాగే గ్రంథాలు యాభై వరకు ఆయన రాశారు. నర్తనబాల, నర్తనకథ, నర్తనభూమి మొదలైన గ్రంథాలు బహుమానాలు పొందాయి. నటరాజ రామకృష్ణ నృత్యరూపక సృష్టికర్త కూడా. వెంకటేశ్వర స్వామి కథను నృత్యరూపకంగా మొదట రూపొందించిన ఖ్యాతి వారికే దక్కుతుంది. కాళిదాస మహాకవి 'కుమార సంభవం'ను 1962లో నృత్యరూపకంగా మలిచి ఉజ్జయినిలో ప్రదర్శించారు. దీనికి ఆయన స్వర్ణకలశం అందుకున్నారు. 1975లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సోవియట్ రష్యా, ఫ్రాన్స్ దేశాల్లో పరిశోధకుడిగా పర్యటించారు. ఆ దేశాల్లో భారతీయ నాట్యరీతులను ప్రచారం చేసి పాశ్చాత్య భారతీయ నాట్యాలను తులనాత్మకంగా పరిశీలించి ఒక గ్రంథాన్ని రచించారు. ఆయనకు ఎన్నో సత్కారాలు చేసి బిరుదులు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ 'భరత కళాప్రపూర్ణ' అని, ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' అని, కేంద్ర సంగీత నాటక అకాడమీ 'ఉత్తమ దక్షిణ భారత నాట్యాచార్య' అన్న బిరుదులతో గౌరవించాయి. మద్రాసులోని ఎల్.వి.ఆర్. ట్రస్టు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ వారిని సత్కరించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు విశిష్ట పురస్కారం అందచేసింది.

-వై. రత్నమాల

కొమ్ముల్లేని ఎడ్లు

బోయ జంగయ్య

పొద్దు పడమటికి వంగింది.

సూర్యుడు ఆకారంలో కొంత పెద్దగాను రంగులో ఒకింత ఎర్రగాను కనిపిస్తున్నాడు.

పనిపాటల కోసం అడవికి వెళ్ళిన జనం ఊరు చేరడానికి ఇంకా కొంత సమయం ఉంది.

ఎడ పిల్లలు చంటి పిల్లలను సమాధాన పరచడానికి ఒక్కొక్కరు ఒక్కొక్క తీరు పాట్లు పడుతున్నారు. అక్కడక్కడ నులకమంచాల మీద ముసలి వాళ్లు దగ్గుతూ గునుస్తూ ఉన్నారు. అది ఓ పల్లెటూరు. ఉన్నట్టుండి దళిత వాడలో కుక్కలు బెదిరి బెదిరి చూస్తున్నాయి. పందులు పరుగులు తీస్తూ వున్నాయి. పైన గద్దలు కిందకే చూస్తున్నాయి. ఊరమ్మటి వున్న ఊరబావి దగ్గర రెపరెప రెక్కలు కొట్టుకుంటున్న కోళ్ళు, కోళ్ళ పిల్లలు, ఆడుకుంటున్న పిల్లలు ఆటలను మానేసి గిలగిల కొట్టుకుంటున్న వాటిని చూస్తూ వున్నారు. అంతేకాదు తమ కోళ్లు చస్తూ వుంటే ఏడుస్తూ నిలుచున్నారు. ముసలివాళ్లు వాటివైపే చూస్తు 'చ్చొ - చ్చొ' ఎందుకు ఇట్లా చస్తున్నాయి అని అంగలారుస్తున్నారు. బడి నుండి వచ్చిన పిల్లలు వాళ్ల వాళ్ల కోళ్లను చేతుల్లోకి తీసుకుని 'ఏమైంది' అన్నట్టు ఆదుర్దాగా చూస్తూ వున్నారు.

పొద్దు దగ్గరపడింది.

పొలం నుండి జనం ఊరు చేరుతున్నారు. దళితుల ఇళ్లముందు వాకిళ్లలో, చెట్ల కింద రాలిపడిన పూవుల్లా నిర్జీవంగా కోళ్లు, కోడి పిల్లలు. దళితవాడ పక్కమ్మటి వున్న ఊరబావి ఎనుగు పొడుగూత చచ్చిపడివున్న కోళ్లే! 'ఎందుకిట్లా ఒక్కసారి కోళ్లన్ని చచ్చిపడివున్నాయి?'

పొద్దుకూకింది. అందరూ ఊరు చేరుతున్నారు. దళితవాడలో కలవరం మొదలైంది.

ఎదలను బాదుకుంటున్న ఆడవాళ్లు. 'పండగలు పబ్బాల కోసం సాదుకున్న కోళ్లు పండగలు రాకముందే - ఈ గోరం జరిగింది' అంటూ ఏడుపులు పెడబొబ్బలు. తిట్లు - శాపనార్థాలతో దళితవాడంతా గందరగోళంగా వుంది.

ఊళ్లో కోళ్లను అందరు పెంచుతారు కాని దళితులకు మాత్రం అవి ఓ చిన్నపాటి ఆస్తిపాస్తులు. వాటిమీద వచ్చే రాబడితో బట్టలు కొనుక్కుంటారు. గాజులు - మెట్టెలు పెట్టించుకుంటారు. రకరకాల చిల్లర ఖర్చులన్నిటినీ ఈ కోళ్లమీద వచ్చే పైకంతో తీర్చుతారు. అందుకని అనుకోని ఈ సంఘటనకు అందరూ అవాక్కయినారు. కారణం గూర్చి ఆలోచిస్తూ, కారకులు ఎవరని ఆరా తీస్తున్నారు.

★ ★ ★ ★

ఆ ఊరి దళితులకు మూడెకరకాల బంజరు భూమి ఐదేండ్ల కింద పట్టా అయింది. పంచుకుంటే తలా మూడు గుంటలు గూడా రాదని అందరూ కలిసి ఉమ్మడిగా దున్నుతూ, పెసర, కంది వేసుకుంటూ వస్తున్నారు. ఈసారి కందిచేను వేశారు. అందరి ఇంటిముందటి పెంటదిబ్బలను తెచ్చి అందులోనే చల్లారు కాబట్టి కంది చేను పసరు కక్కుతూ నాచు రంగుతో నవనవలాడుతూ వుంది. దానికి ఇంటికొక రోజు చొప్పున కాపలా కాస్తూనే వున్నారు. అయినా కాపలా వాని కళ్లల్లో దుమ్ముచిమ్మి ఎనుగు ఇరుగతొక్కి చేల జొరబడి తుమ్మకాయను తిన్నట్టు తింటూ వున్నాయి పశువులు. అవతలి మూల నుండి కాపలా కాస్తున్న వ్యక్తి పరుగెత్తుకొచ్చే లోపల మునుము మందం మేయనే మేసినాయి. అప్పుడే అటునుండి వెళుతున్న మరో ఇద్దరు దళితులు అది చూసి చేను దగ్గరికొచ్చి, పశువులను బయటికి కొట్టుకొచ్చి, బాటలో మళ్లేసి కావలాగ నిలుచున్నారు. కాపలావాన్ని కసిరించి, 'పసులు చేలో పడ్డది కనిపిస్తలేదా?' అన్నారు.

"ఈటి నక్కలు తిన. ఆ మూల నుండి వస్తనే వున్న పడి మేస్తనే వున్నయి" అంటూ చేతిలో వున్న కర్రతో వాటిని బాదసాగాడు. అవి దెబ్బలకు తట్టుకోలేక అటు ఇటు పరుగెడుతూ వున్నాయి. ముగ్గురు మూడు వైపుల నిలుచొని వాటిని అక్కడే మల్లేసారు. అవి బుసలు కొడుతూ బెదిరి బెదిరి చూస్తూ వున్నాయి.

"ఇవి ఎవరి పసులు" అన్నాడు చింతకింది బుచ్చయ్య. చేతిలో కర్ర, చెవిలో చుట్ట, భుజం మీద కండువా, మోకాళ్ల వరకు గోచి, పాదాలకు పాత చెప్పులు అరవైకి పైన్నే.

"దొరయి" అన్నాడు చేను దగ్గర వున్న బర్ల లింగయ్య. అతని చేతిలో రాగోల, బుచ్చయ్య లాంటి వేషధారణే. అదనంగా నడుంకు తోలు సంచి, పాదాలకు రబ్బరు చెప్పులు.

"అయితే వాటిని కొట్టద్దు. బందెలలో పెట్టాలె. కొడితే దెబ్బలు కనపడి తగాదాకు దారితీస్తయి" అన్నాడు బుచ్చయ్య తన చేతి కర్రతో పశువులను అదిలిస్తూ.

"మొన్న ఆడు మన కోళ్లు వరిచేలోకి పోతే ఎండ్రిన్ కలిపిన గింజలు చల్లి చంపలే. మనం గూడ -" చేతిలోని రాగోలను మరొకసారి కొట్టడానికి లేపుతూ అన్నాడు లింగయ్య.

'చంపుదాము అంటవు. వాడు ఎండ్రీన్ పెట్టి, ఎలుకల కోసం మందు పెడితే వాటిని కోళ్లు తిని సచ్చినయి. నేనేం చెయ్యను' అని నలుగుట్ల చెప్పి తప్పిచ్చుకునె, మరి మనం ఎట్లా తప్పించుకుందాం? వద్దు ఇరికిపోతం, అంతేకాదు కోసుకుతినడానికే ఈ పన్నాగం అంటారు. వద్దు వద్దు కొట్టద్దు" అన్నాడు బుచ్చయ్య.

"అని వదిలి పెడదామా?" అన్నాడు ఎత్తిన రాగోలను దించుతు తన కోపాన్ని తానే దిగమింగుతు.

"సెప్పితికద బందెల దొడ్లో పెడదామని" అన్నాడు బుచ్చయ్య భుజం మీద కండువాను ఎగేసుకుంటు.

పశువులను ఊరివైపు మళ్ళించారు.

చీకటి పడింది. దొర వాకిట్లో పళ్లు కొరుకుతూ అటు ఇటు తిరుగుతూ దళిత వాడవైపు బస్మాసురునిలా చూస్తూ వున్నాడు. లంకంత ఇల్లు ఇంటికి ఓ పెద్ద నగిషీలు చెక్కిన తలుపులు. ఆ దర్వాజాకు రెండు వైపుల రెండు అరుగులు. దర్వాజ ఎదురుగా ఎప్పుడూ తన కుక్క పడుకుని వుంటుంది. తన యజమాని అసహనాన్ని పసిగట్టినట్టుంది. అదీ ఓ మాదిరి ఆందోళనగా గునుస్తూ వుంది.

దొరతాగిన గట్టెకల్లు మనిషిలో మంటలు లేపుతుంది.

"దొర పశువులు బందెల దొడ్లోనా?" అన్న దొర సానిమాట మరిమరి గుర్తొస్తూ వుంది.

'పసులు మేత లేక సస్తన్నట్టుంది. ఎవడు బందెల దొడ్లో తోలిండో వాళ్లే మళ్ళీ నా దొడ్లో తోలిపోవాలి. అంటూ పట్టు పట్టిండు దొరాయన. ఎట్లా అబ్బా' అనుకుంటూ పంచాయితీ ఆఫీసు వైపు నడిచాడు కారోబార్. బందెల దొడ్డిలో పశువులు అరుస్తూనే వున్నాయి. ఆ అరుపులు దొరోరి ఇంట్లో, వాకిట్లో వున్న కుక్క చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ రాత్రి అలజడిగ వుంటుందనుకున్న దళిత వాడ ప్రశాంతంగా వుంది. దొరకు నిద్ర రావటం లేదు. సర్పంచ్‌ను ఇంటికి రావల్సిందిగ కబురు పంపితే ఆయన రాలేదు. పక్కవాడలో వుంటున్న చదువు పంతులు ఈ రోజు ఇంట్లో వున్నాడో అనుకుంటూ కాళ్లకు చెప్పులేసుకుని టార్చ్‌లైట్ చేతపట్టుకుని పంతులింటికి బయలుదేరాడు. ఆయన వెంట ఆయన కుక్క. సందుల్లో కుక్కలు దొరకుక్కను చూసి అరుస్తున్నాయి. మధ్య మధ్య వాటిని అదిలిస్తూ మెల్లగా వెళ్లి తలుపు తట్టాడు.

"ఎవరూ" లోపల నుండి. పంతులు బాగా చదువుకున్నవాడు. ఐదారు ఏళ్ల నుండి ఈ వూళ్ళోనే చదువు చెపుతున్నాడు.

"సీతయ్యను" గొంతులో చిన్నతనపు పొర ధ్వనించింది.

తలుపు తెరుస్తూ "ఏమిటి ఇంతరాత్రివొచ్చారు" అడిగాడు పంతులు. నలుపు-తెలుపు కలిసి కనిపిస్తున్న తల నడివయస్సుకు సాక్ష్యం:

"కొంచెం మాట్లాడిపోదామని" నవ్వును నటిస్తూ అన్నాడు దొర. అరవై దాటినా చిక్కని తెల్లనెత్తి.

"అంత అర్జెంటా" రవ్వంత చికాకుగా తన లుంగీని పిక్కల వరకు మడిచి పట్టుకుంటూ అన్నాడు.

"అర్జెంటేమి కాదు కాని కంటికి కునుకు రావటం లేదు" ఈసారి మాటలు బాధభరితంగా వున్నాయి.

"లోనికి రండి" అని తలుపులు తెరచి, లోపలికి వచ్చినాక దగ్గరేశాడు. తలుపులు ఓ మాదిరి శబ్దం చేశాయి. పొద్దంతా పిల్లలతో అరిచి, అలసి రాత్రులు ప్రశాంతంగా పడుకుంటారు పంతుల్లు దొర రాకతో అది చెదిరిపోయింది.

సీతయ్య చెప్పులు పక్కకు వదిలి, ఇద్దరూ వరండాలో వున్న కుర్చీల్లో కూర్చున్నారు. దొర మొలన వెండి మొలతాడు తాను ధరించిన పలుచటి ఆంగీలో నుండి కనిపిస్తూ వుంది. దానికో బంగారు తాయితు.

"చెప్పండి" అంటూ అవులిస్తూ తన కుడి అరచేతిని అడ్డంగా పెట్టుకున్నాడు.

"మీ నిద్రను చెడగొట్టాను, తప్పలేదు" అంటూ చూపులను తన వళ్ళోకి మరల్చుకుని ఎడమ చేతిలో కుడి చేతిని

వుంచి తన వేళ్లను తాను చూసుకుంటూ, ఐదేళ్లు సరిగలేవు అన్న సంగతి మరొకసారి నిర్ధారించుకుని -

"ఈవూరి మాదుగలకు నాకు తగవొచ్చింది" అని తలదించుకొనే అన్నాడు. గొంతులో నుండి మాట ఆగుతూ ఆగుతూ వచ్చింది.

'ఏ విషయంలో' అన్నట్టు చూశారు.

"మా పశువులను వాళ్లు బందెల దొడ్డిలో పెట్టారు" అప్పుడూ తలపైకెత్తలేదు.

'చేలో పడితే పెట్టారేమో' అనుకున్నాడు మనస్సులో పంతులు. కాసేపు మాట్లాడలేదు.

"తరతరాల నుండి మా పశువులు ఎవరి చేల పడ్డా ఎదురు చెప్పరు. ఈసారి మా పంచన బతికే అదునుగాళ్లు మా పశువులను బందెల దొడ్డిలో పెడతారా?" అని పంతులు కళ్లలోకి చూశాడు. గొంతులో ధ్వని మారింది. కళ్లలో ఎరుపు కనిపించింది.

పంతులు మౌనంగా వింటూ గోడగడియారం వైపు చూస్తు "కాలం మారిందికదా" అన్నాడు. ఆ మాట వినకుండా

"ఇక నుండి వాళ్లను మా పొలాల్లోకి రానియ్యం" బయట కుక్క ఒక్కసారే మొరిగింది.

'మరి సాగు చేసేది ఎవరు?' అన్నట్లు చూశాడు పంతులు కాస్త కదిలి కూర్చుంటూ.

"ట్రాక్టర్లు?, ఏత, కోతకు మిషన్లు కూడ వొచ్చినయికదా? ఈసారి సూటిగ పంతులు కళ్లలోకి చూస్తూ అన్నాడు.

"వీళ్లతో పనేముంది" అన్నాడు ఆవేశంగా మళ్ళీ తానె.

"ఆలోచించండి" అన్నాడు పంతులు. ఎడమ చేతిలో కుడిచేతిని వెలికలగ వుంచుతూ, రేపటి గూర్చిన ఆలోచనలోకి వెళ్లాడు. పరిస్థితి చూస్తే లొల్లి అయ్యేటట్టుంది అనుకున్నాడు.

"ఇక ఆలోచనలేదు. రేపు చావడి దగ్గర చాటింపు చేయించేదే" తన రెండు చేతులను తొడల మీద వుంచుతూ అన్నాడు, లేవడానికి సిద్ధపడుతూ.

ఆవలింతకు చేయి అడ్డం వుంచుతూ - "వాళ్ళకు చట్టపరమైన రక్షణలున్నాయి" అంటూ గుర్తు చేశాడు పంతులు.

"తిట్టను కొట్టను చేసి చూపిస్తాను. నా పశువులనే, హాఁ" అంటూ పటపట పళ్లు కొరుకుతూ దర్వాజా దగ్గరవున్న చెప్పులను తొడుక్కొని బయటికి నడిచాడు. అప్పుడాయన ఎడమ చేయి మీసాల మీదుంది. కుడిచేతిలో దోతి అంచువుంది.

"జిద్దు హద్దును దాటించి ఆగం చేస్తది సుమా" అంటూ తలుపులు మూసుకున్నాడు పంతులు.

★ ★ ★ ★

ఒకే ఊరిలోని రెండు వాడల మధ్య పెద్ద అగాధం ఏర్పడ్డది.

దళితవాడలో పొగ రాజేది లేనిది ఆరా తీస్తూనే వున్నారు. తమ వాడలో ఏం జరుగుతున్నది. పొక్కనిస్తలేరు. కోమట్లను ఉప్పు, మిర్చకాయలు ఇవ్వద్దు అన్నారు. గీతపనివాళ్లు తమ కల్లును ఊళ్లోకి తేవద్దు అన్నారు. వాళ్లు రోడ్డు మీదే అమ్ముకుంటూ వున్నారు. చేసేది లేక దళితులు ఆకలి దప్పులు తట్టుకోలేక చుట్టపక్కాల ఊళ్లకు వెళ్లి ఒకటి రెండు రోజులు వుండి వస్తున్నారు. అప్పుడప్పుడు ఆకలికి తట్టుకోలేని పిల్లలకు రోత, తాటి బొత్తలను నర్కి వాటి గుజ్జును తినిపిస్తున్నారు. వ్యవసాయ పనులకు పిలిచేవారు లేరు. వాళ్లంతవాళ్లూ వెళ్లటం లేదు. పశువుల మేపేవాళ్లను, పేడతీసేవాళ్లను, పొలం దున్నేవాళ్లను, ఎరువులు చల్లేవాళ్లను ఎవ్వర్ని పనులకు పిలవటం లేదు. పనులు లేక కూళ్లు లేవు. కూళ్లు లేక పొగరాజడం లేదు. పస్తులుంటున్నారు. అప్పుడప్పుడు గుట్టకు వెళ్లి సీతపాల కాయలను తెచ్చి కాల్చుకుని తింటూ వున్నారు. పండ్లు దొర్కితె పిల్లలకు యిస్తూవున్నారు.

పక్క ఊరువాళ్లు పట్టిచ్చుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పినా ఫలితం కనిపించలేదు. రెండు వారాలు గడిచాయి. దొరవంశంలో ఓ చావు జరిగింది. అన్ని పనులు వాళ్లే చేసుకున్నారు. కనీసం దప్పులు కొట్టడానికైనా పిలవలేదు. ఓ పెండ్లి జరిగింది. దానికీ పిలవలేదు.

దళితుల మేకలు పనాదిగుండ మాత్రమే వెళ్లాలి, ఎవరి పట్టా భూమిలో నుండి వెళ్లగూడదు. అవి బంజరు భూమిలో, బోడు - బీడు భూమిలో మాత్రమే తిరగాలి. మంగలి క్షవరం చేయకుండ, చాకలి బట్టలు ఉతకకుండ చేశారు.

అట్లా ఇరవై రోజులు గడిచాయి.

భూమిలేని వాళ్లకు భుక్తి వుండదు. కూలిదొరక్కపోతే కూడుండదు.

ఈ రహస్యం తెల్సినవాళ్లు సాగించుకుంటూ వుంటే సామాన్యులు సతమతమైపోతున్నారు. దొర దర్బారులో రోజూ చర్చలు జరుగుతూనే వున్నాయి. దళితులను ఎట్లా ఇరకాటంలో పెట్టాలి అని. ఇంకా ఎట్లా అణిచి వుంచాలి అనేదే ఆ చర్చల్లోని అంశం. చివరికి అప్పుల కాగితాలు చూపించి, 'ఇచ్చి తీరాలి' అని చిన్న చిన్న ఆస్తులను కాజేశారు. ఎకరం రెండెకరాలుంటే అసలు, వడ్డీకల్పి లెక్క చేసి చూపించి తమ తమ చెలుకల్లో కలిపేసుకున్నారు. ఆ మేరకు కాగితాలు రాసుకున్నారు. ఓసారి దళిత స్త్రీని చెలుకలో బలాత్కారం చేసినపుడు అందరూ ఒక్కటై నిలదీసింది గుర్తు చేసుకుని కక్షను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ద్వేషం ఎప్పుడూ చెడునే కోరుకుంటుంది. 'బహుజనులంతా ఒక్కటే' ఎన్నికల ముందు కల్సి తిరిగినా ఎన్నికల్లో పోటీ చేసిన వారికి డిపాజిట్ కూడా రాకపోయే సరికి మళ్ళీ ఎవరికి వారే యమునాతీరే అయ్యారు. గతంలోలాగానే, బి.సీలు అగ్రకుల తొత్తులయి దళితులను పీడిస్తూనే వున్నారు. కర్ర గొడ్డలి కామగా మారి చెట్లను నర్కుతున్నట్టు! అణిచివేతకు హద్దు లేకుండా పోయింది.

★ ★ ★ ★

దళిత వాడంతా తాటికమ్మల గుడిసెలు. ప్రభుత్వపు పక్కా ఇండ్ల పథకాన్ని ఆ ఊరుకు చెరనివ్వలేదు. వేపచెట్లకింద ఆడ - మగ బతుకు తెరువు చర్చలు. వాళ్ల శ్వాసల్లో ఆకలి వాసనలున్నా గుండెల్లో ఏదో మొండి ధైర్యాన్ని నింపుకుంటున్నారు.

"పంట పొలాలు లేవు పట్టా భూములు లేవు" అంది రంగమ్మ. ఆమె మెడలో పగడాల దండ చెమటకు మాసిపోగా దానికో, రాగి తాబీసు కట్టి వుంది.

"రెక్కాడితే డొక్కాడే" అంది ఎంకమ్మ కాయకష్టం చేయడంలో ఆమె శరీరపు రంగే మారిపోయింది.

"ఊరొదిలి పోవాలంటే మనసొప్పటం లేదు" అన్నాడు లింగయ్య

"ఉన్నచోటే ఊరు" మర్రాకు చుట్టను అంటించుకుంటు అన్నాడు బుచ్చయ్య.

అక్కడ చావడి దర్బారులో కఠినమైన నిర్ణయాలు జరుగుతూనే వున్నాయి. చేతగాని సర్పంచ్ చూస్తూ నిలుచున్నాడు.

★ ★ ★ ★

తెల్లవారుజామున ఆడమగ పొలిమేర దాటుతూనే వున్నారు. పోతూపోతూ కందిసేను వైపు చూస్తూ కన్నీరు పెట్టుకున్నారు. పుట్టి పెరిగిన ఊరివైపు మళ్ళీ మళ్ళీ చూస్తూ నడుస్తూ వున్నారు. వాళ్లతో పాటు వాళ్ల కుక్కలు వెనకనడుస్తూ అప్పుడప్పుడు ఆగి ఊరివైపు చూస్తూ కుయ్, కుయ్‌మంటూ వున్నాయి. తలల మీద మూటల మీద కూర్చున్న కోడిపిల్లలు బెదిరి బెదిరి చూస్తూ వున్నాయి. ఆగండి అన్నాను.

ఆగలేదు నడుస్తూనే వున్నారు.

పారిపోతున్నారా అడిగాను.

'లేదు వలసపోతున్నాం' అన్నట్టు వినిపించింది.

ఎక్కడికి అన్నాను.

"కూలి దొరికే చోటుకు"

అక్కడ మాత్రం ఈలాంటి దొరలు - "లేనిచోటుకే పోతాము". ☆

అతడనేక యుద్ధముల ఆరియు తేరిన వృద్ధమూర్తి...

(19వ పేజీ తరువాయి)

నడిచివస్తుండగా భూస్వాములకు చెందిన పొల్లాల్లో ఇద్దరు గూండాలు ఘర్షణ పడుతున్నారు. ఇద్దర్నీ చెరి రెండువేసి వారి వద్ద ఉన్న రివాల్వర్లు తీసి నడిపిస్తుండగా 50 మంది అశ్వికదళ సైన్యం అటుగా వస్తోంది. వారిని చూడగానే పక్కనున్న గూండాలు పారిపోయి తన గురించి సైన్యానికి చెప్పారు. దీంతో మంచికంటి మరో దిక్కువైపు పారిపోయే ప్రయత్నంచేశారు. అక్కడున్న పశువుల కాపరులు పరిస్థితిని అర్థంచేసుకొని సమయస్ఫూర్తితో సైన్యం నుండి మంచికంటిని రక్షించారు. ఈ విధంగా ఎన్నో సాహస ఘట్టాలలో ఆయన పాత్రవుంది.

★ ★ ★ ★

మంచికంటి తన రాజకీయ జీవితంలో జైళ్ళలో అనుభవించిన కఠిన శిక్షలు అన్నీఇన్నీ కావు. వరంగల్ జైల్లో ఉన్నంతకాలం రేయింబవళ్ళు కాళ్లూ చేతులకు బేడీలు వేయబడి అతి ఇరుకైన గదిలో శిక్ష అనుభవించారు. 1964లో సిపిఎం వైపు వచ్చిన మంచికంటి ప్రభుత్వ ఆగ్రహానికి గురై 16 నెలల పాటు జైలు శిక్ష అనుభవించారు. జైలులో ఉండగానే ఆయన ప్రమాదకరమైన జబ్బున పడ్డారు. 1974లో అధిక ధరలకు నిరసనగా సిపిఎం ఇచ్చిన పిలుపు నందుకొని నిర్వహించిన ఆందోళనకు నాయకత్వం వహించారని మరో కమ్యూనిస్టు యోధుడు చిర్రావూరి లక్షీనరసయ్యతోపాటు మంచికంటిని కూడా అరెస్ట్ చేశారు. అంతటితో ఆగక ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వారిద్దరికీ బేడీలు వేయించి ఖమ్మం పురవీధులలో ఊరేగింపజేశారు. ఆ తరువాత ఈ దృశ్యాన్ని తిలకించిన ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా ఈసడించుకున్నారు. ఆ తరువాత ఆ యోధులిద్దరూ ఆ ఖమ్మం గడ్డపైనే ఒకరు మున్సిపల్ ఛైర్మన్‌గా, మరొకరు శాసనసభ్యులుగా ఎన్నుకోబడ్డారు. 1975లో ఎమర్జెన్సీలో కూడా మంచికంటిని రాజమండ్రి, హైదరాబాద్, వరంగల్ సెంట్రల్ జైళ్ళలో నిర్బంధించారు. మళ్ళీ ఆయనకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడటంతో వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో చేర్చారు. ఆ స్థితిలోకూడా ఆయనను గొలుసులతో మంచానికీ, కాలుకీ కట్టివేసి హింసల పాలు చేశారు. మంచికంటి తాను జీవించిన కాలానికి సగటున ఒకనెల రాజకీయ జీవితానికి సగటున రెండు నెలల జైలు జీవితం గడిపారు.

సిపిఎంలో మంచికంటి ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. 1952లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, 1964 నుండి సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, 1972 నుండి రాష్ట్ర కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. 1971 నుండి 78 వరకు వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1980లో అదే జిల్లాకు సి.ఐ.టి.యు. అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1982, 1985లో ఖమ్మం శాసనసభ్యునిగా ఎన్నికై శాసనసభలో ప్రజలవాణిని వినిపించారు.

జమీందారుల దత్తపుత్రుడై సుఖసంతోషాలలో ఓలలాడదగిన అవకాశాలున్నా వాటిని త్రోసిరాజని, పీడిత ప్రజల విముక్తికై వీరతెలంగాణా సమరాంగణంలో కొదమ సింగంలా విజృంభించి, చివరికంటా ప్రజా ఉద్యమ నిర్మాణంలో ఆణిముత్యమై భాసిల్లారు మంచికంటి రాంకిషన్‌రావు. ఆ యోధుడు 1995 ఫిబ్రవరి 8వ తేదీన కన్నుమూశారు. ☆

తర్జన భర్జన

కొండబాబు



"అక్కా.. స్కెచ్ పెన్ను ఇస్తావా? ఇవ్వవా?" ఐదేళ్ళ తేజ సీరియస్‌గా చూస్తూ అన్నాడు.

"ఈ పెన్ను నాకు కావాలిరా... ఆడుకునేది కాదు.. పాడు చేస్తే మా మిస్ కొడతారు" ఏడేళ్ళ చైతన్య తమ్ముడికి నచ్చచెపుతూ అంది.

"ఆడుకోడానికి కాదు రాసుకుంటా'

' "రాసుకునేది కాదమ్మా.. బొమ్మలు గీసుకోవాలి'
'

"బొమ్మలకోసనమే లేవే.. అట్లా అడిగితే నువ్వు ఇవ్వవేమోనని" బదులిచ్చాడు వాడు.

"ఈ పెన్నుతో గీయడం నీకు రాదురా, నేను ఇవ్వను'' అంది చైతన్య ఖరాఖండిగా "ఇవ్వవా?.. అయితే మొన్న నా పెన్సిల్ ఇచ్చాను గదా! అదిచ్చెయ్" తేజ అన్నాడు.

"పెన్సిల్ అయిపోయిందిగదరా.. గొడవ చేస్తే మమ్మీతో చెప్తా" బెదిరించింది చైతన్య.

"నేను డాడీతో చెప్తా"

"నేను నానమ్మతో చెప్తా"

"నీ బుక్స్ చింపేస్తా'' బెదిరించుకుంటూ పెద్దాళ్ళకు వినబడకుండా మెల్లగానే అరుచుకుంటున్నారు పిల్లలు.

వాళ్ళ గొడవతో వాళ్ళమ్మ వచ్చింది.

"ఏంట్రా తర్జన భర్జన పడుతున్నారు" అంది వాళ్ళ గొడవ తీర్చడానికన్నట్లు మెల్లగా

"మమ్మీ వాడు బుక్స్ చింపుతానంటున్నాడే!'
'

కాదు మమ్మీ.. మరే.. అక్కే... ఏదో చెప్పబోయాడు వాడు.

"సరేలే.. గొడవ పడకండి.. బుక్స్ చింపుకోవడమేమిట్రా..? మా చిన్నప్పుడు ఇలా తన్నుకుంటే మా అమ్మకొట్టేది. అసలు మేం దెబ్బలాడుకునే వాళ్ళమే కాదు" అందామె.

"మేము చూడలేదుగా" అన్నాడు ఐదేళ్ళ తేజ.

× × ×

ఇలా పిల్లలు గొడవ పడటం, పెద్దలు ఏదో హితబోధలు చేయబోవడం పిల్లల చేతిలో దంగవడం చాలాసార్లు జరుగుతూంటుంది. ఈనాటి పిల్లలు చిచ్చరపిడుగులుమరి. అన్ని ఇళ్ళల్లో ఇది పరిపాటే. అసలు పిల్లల అల్లరిలేని ఇంటికి కళే ఉండదంటారు చాలామంది.

పిల్లలు గురించి చాలా చెప్పుకోవచ్చు ఇలా. కాని మనం 'పలుకు'ల గురించి కదా! చర్చించుకోవాలి. తేజ, చైతన్య వాళ్ళమ్మ మాట్లాడుతూ 'తర్జనభర్జన పడుతున్నారేమిట్రా? అనడం చదివాంకదా! మన చర్చ 'తర్జన భర్జనే'.

సూటిగా ఈ పదానికి నిఘంటువులు అర్థాన్నివ్వడంలేదు. ఇది తెలుగు వ్యవహారికము. కాని శబ్దార్థరత్నాకరము వంటి నిఘంటువుల్లో చోటు దొరకలేదు. సాధారణ వ్యవహారికర్థం ఏమిటో మనకు తెలియంది కాదు. శిష్ట వ్యవహారికులే కాదు సాంస్కృతికంగా మధ్య తరగతి ప్రజానీకమూ వాడటం ఉంది.

ఒక విషయాన్ని తేల్చకుండా గొడవ బడుతుండటాన్ని తర్జన భర్జన పడుతూండటంగా చెప్తాము. అంటే దాని అర్థం చర్చ అని కాదు, చర్చలో ఆలస్యంగానైనా విషయం తేలుతుంది. తర్జన భర్జనలో ఒక పట్టాన విషయం తేలదు. అంటే పట్టువిడుపులు లేని మొండివాదనతో సమస్యను పరిష్కరించాలనుకోవడం వంటిదన్నమాట.

ఈ పదం ఎలా మన తెలుగులో కొచ్చింది? అంటే చెప్పలేము. ఏ పదాలకలయికతో ఈ పదం ఏర్పడి తెలుగు వ్యవహారికమయిందో పరిశీలించవచ్చు.

ఇది జంట పదము, 'తర్జనము', 'భర్జనము' అనే రెండు పదాల సమ్మిశ్రమము, ఈ రెండూ సంస్కృత పదాలే. 'తర్జనము' అంటే బెదిరించడం, 'తర్జని' అనే పదాన్ని బెదిరించడంగా శిష్ట వ్యవహారికులు వాడటం ఉందికదా! 'భర్జనము' అన్నా కూడా బెదిరించడమే. విధ్వంసం చేయడం అనే అర్థంకూడా ఈ పదానికి ఉంది.

దానిని బట్టి ఒక వాదనను మొండిగా బెదిరింపులతోనూ, చర్చలను ధ్వంసం చేసే పద్ధతితోనూ చేయడమే 'తర్జన భర్జన' అన్నమాట. ప్రస్తుతం ఈ పదాన్ని అంతటి తీవ్రతతో కాకుండా తేల్చని సులభ వ్యవహారశైలికి కూడా వాడటం కనిపిస్తోంది. అదీసంగతి. మన చర్చ మాత్రం తర్జన భర్జన కాదు సుమా! ☆

పాఠక స్పందన

ఉపయోగకరమైన వ్యాసం

14-10-2001 ప్రజాశక్తి ఆదివారంలో బాలవికాసం శీర్షికన ప్రచురించిన 'పిల్లలచేత ఎలాంటి పుస్తకాలు చదివించాలి' చాలా బాగుంది.

– పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం జిల్లా

విస్తృతంగా కుల వివక్ష

అక్టోబర్ 14 ఆదివారం అనుబంధంలోని కవర్ స్టోరీ రాష్ట్రంలో ఇప్పటికీ అస్పృశ్యత, కుల వివక్ష ఎంత వికృతంగా, విస్తృతంగా వుందో కళ్ళకు కట్టింది. 'దళితులపై వివక్షకు అంతం ఎన్నడు?' దళితులపై జరుగుతున్న అరాచకాలను చక్కగా వివరించింది. మైసూర్ యాత్ర గురించి ప్రచురించిన టూరిస్ట్ గైడ్ వ్యాసం ఆహ్లాదకరంగా వుంది. పాఠక స్పందన పేజీని పుస్తకం చివర్లో కాకుండా మొదటి పేజీలో ప్రచురిస్తే బాగుంటుంది.

– బట్టా రామకృష్ణ, సాతమోపూర్ గ్రామం, నెల్లూరుజిల్లా

లాంఛనం బాగుంది

పలుకుబడి శీర్షికలో ప్రచురించిన 'లాంఛనం' ఎంతో బాగుంది. ఆరోగ్యం శీర్షికలో 'రొమ్ము క్యాన్సర్ గుర్తించడం ఎలా' చాలా ఉపయోగకరంగా వుంది.

– ఎస్.శ్రీదేవి, కె.రేవతి దేవి, డా॥ ఎస్.సి.రావు,

మల్లంపేట, విజయనగరం జిల్లా

బిజీ... బిజీ...

7-10-2001 ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన కథ 'మిస్సింగ్ యూ..." మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. రేపటి పౌరులను తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే వుంది. కానీ వారు ఉద్యోగ బాధ్యతలతో చాలా బిజీగా వుంటున్నారు. అమ్మానాన్నల ప్రేమ పిల్లలకు అందకుండా పోతోంది. ఎన్ని ఆటవస్తువులు సమకూర్చినప్పటికీ ఆప్యాయంగా పలకరించలేనంత వరకూ వారు ఏకాకులే అవుతారు. అలాగే పలుకుబడిలో చాలా మంచిపదాలు అందజేస్తున్నారు. రుక్మిణి గారి కచేరి యాస కాస్త ఇబ్బందిగా వుంది.

– సి.హెచ్.పెంటయ్య, తహెర్‌ఖాన్‌పేట, మెదక్

కాయకష్టం కడుపు నింపేనా.....

ఫోటో : నరహరి, హైదరాబాద్

మీ ఇల్లే ఒక పార్కు, బయట పార్కులెందుకు ఎవిసి టౌన్‌షిప్ ఉండగ.

మీ ఇంటి ప్లాటే ఒక పార్కు, మీఇంటి కాలనీయే పెద్ద పార్కు

మీ ఇంటి ప్లాటే ఒకపార్కు అని ఎందుకంటున్నామంటే-బొప్పాయి, జామ, దానిమ్మ, నారింజ, కొబ్బరి చెట్లు, అరటి చెట్లు, టేకు చెట్లు, మీరు కొనే ప్లాటులో మేము పెంచేటప్పుడు ఆ చెట్లు కల్పించే వాతావరణంతో అది మీ సొంత పార్కే అవుతుంది. ఈ ప్లాటు ఉన్న "ఎవిసి టౌన్‌షిప్" అంటే మీ ఇంటి కాలనీలో-అందరికోసం పార్కులు, పిల్లలాడుకునే ఉయ్యాలలు, జారుడు బండ్లతో ప్రత్యేకమైన పిల్లల పార్కులు, లేక్‌లో బోటు షికారు, జాగింగ్ ట్రాక్, అవుట్‌డోర్, ఇండోర్ స్టేడియాలు, అత్యాధునిక జిమ్‌లు, గ్రంథాలయాలు, ఇంటర్‌నెట్ కేఫ్‌లు-ఇన్ని ఉండగా మీ ఇంటి కాలనీ అయిన "ఎవిసి టౌన్‌షిప్"ను అతి పెద్ద రిసార్టు సౌకర్యాలు గల పార్కు అంటే కాదనగలరా! ఈరోజే "ఎవిసి టౌన్‌షిప్" లో ప్లాటు తీసుకోండి. బయట పార్కులను మరచిపోండి. నాగార్జునసాగర్ హైవేపైన ఆ రహదారికే తలమానికంగా ఎవిసి గ్రూప్ వారు ప్రతిష్ఠాత్మకంగా ఎవిసి టౌన్‌షిప్‌ని రిసార్ట్ సౌకర్యాలతో తీర్చి దిద్దుతున్నారు. ఎవిసి గార్డెన్స్‌లోని ప్లాట్లు మీకు విశాలమైన రోడ్లు, చెట్లతో మీ ఇంటి స్థలాలకై స్వాగతం పలుకుతున్నాయి.

ఎవిసి టౌన్‌షిప్ **ఎవిసి గార్డెన్స్**

తక్షణ రిజిస్ట్రేషన్ సౌకర్యంతో
భూమిపై మీకు పూర్తి హక్కులు

* 500, 1000 గజాల ప్లాట్లు, * ఎవిసి రిసార్ట్స్‌లో సభ్యత్వం, * ఎన్.ఆర్.ఐ. సభ్యుల కొరకు ప్రత్యేక బ్లాకులు, * 80' / 60' / 40' విస్తీర్ణంకల రోడ్లు, * వాటర్, ఎలక్ట్రిసిటి, డ్రైయినేజ్ సౌకర్యాలు, * ప్రతి ప్లాటులో ఫలసాయాన్నిచ్చే చెట్లు, * 200,400 గజాల ప్లాట్లు, * గ్రూప్‌గా వచ్చే వారికి ప్రత్యేక బ్లాకులు, * 40' / 33' విస్తీర్ణంకల రోడ్లు, * వాటర్, ఎలక్ట్రిసిటి, డ్రైయినేజ్ సౌకర్యాలు, * రోడ్లకిరుపక్కల చెట్లు, * ఎవిసి రిసార్ట్స్‌లో సభ్యత్వము (నిబంధనలతో)

ఒక్క ఫోన్ కాల్‌తో ఎవిసి టౌన్‌షిప్ మరియు ఎవిసి గార్డెన్స్ లకు మాకార్లలో ఉచితంగా రండి.

AVC GROUP

A.V.C. HOUSING PRIVATE LIMITED

Regd. Office : G-3, Ushodaa Apartments, Huda Complex, Kothapeta, Hyderabad-500035, Ph : 040-4043265, **Central Office :** B-1, 2nd Floor, Ahuja Estates, Opp. Santosh Swapna Theatre lane, Abids, Hyderabad-500001, Ph :040-4752839, 4758035, Fax:040-4758136, Visit us at : www.avchousing.com, Email:infoavc@avchousing.com

హరి ఓం!
సర్వేజనా సుఖినోభవంతు

శ్రీ శ్రీనివాస హాస్పటల్

శ్రీ వెంకటేశ్వర నర్సింగ్‌హోం

ఎక్స్‌రే సౌకర్యం కలదు

సాగర్‌రోడ్, హాలియా, నల్గొండ జిల్లా,
ఫోన్ : 08680-78751.

డా॥ కె. కనకాల్‌రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్

డా॥ కె. రాధ క్రిష్ణమూర్తి
M.B.B.S
ఫిజీషియన్ & సర్జన్